

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 194

గురువారం 30-3-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నేడు భద్రాద్రి రాముడి కల్యాణం

కల్యాణ శోభ సంతరించుకున్న భద్రాచలం

రేపు కోదండ రాముడికి పట్టాభిషేకం


- వివరాలు 2లో



ఎంపీ సభ్యత్వం పునరుద్ధరణ

హత్యాయత్నం కేసులో పదేళ్ల శిక్ష పడటంతో రద్దు చేసిన లక్షద్వీప్ ఎంపీ ఫైజల్ సభ్యత్వాన్ని.. లోక్‌సభ పునరుద్ధరించింది.

వివరాలు 6లో ▸



ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి..

ప్రజాస్వామ్యానికి భారత్ తల్లిలాంటిదని.. వేగంగా ఎదుగుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్, సింధు

స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారులు కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు.

వివరాలు 12లో ▸



ఆ చెల్లింపులపై చార్జీలు ఉండవు

ఒక బ్యాంకు ఖాతా నుంచి మరో బ్యాంకు ఖాతాకు జరిపే సాధారణ యూపీఐ చెల్లింపులపై చార్జీలు ఉండవని ఎన్‌పీసీఐ తెలిపింది.

వివరాలు 13లో ▸

యంత్ర వ్యవ'సాయం'

రైతులకు అందుబాటులో ఆధునిక యంత్రాలు: సీఎం జగన్

వ్యవసాయ పరికరాల పంపిణీ షెడ్యూల్‌కు సీఎం గ్రీన్ సిగ్నల్

- ఏప్రిల్‌లో మిగిలిన 4,225 ఆర్బీకేల్లో సీహెచ్‌సీల ఏర్పాటు
- జూలైలో 500 ఆర్బీకేల్లో వైఎస్సార్ కిసాన్ డ్రోన్లు.. డిసెంబర్ నాటికి మరో 1,500 డ్రోన్లు పంపిణీ
- సాధ్యమైనంత త్వరగా పంట నష్టం నివేదికలు.. ఏప్రిల్ 15 నుంచి రబీ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు
- ఆర్బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు
- కియోస్క్‌ల సేవలు పూర్తి స్థాయిలో రైతులకు అందించాలి
- ఉద్యాన వన పంటల మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి
- ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో భూసార పరీక్షలు
- 2023–24 సీజన్ కోసం 10.5 లక్షల టన్నుల ఎరువులు సిద్ధం
- వ్యవసాయ శాఖపై సీఎం సమీక్ష

2లో



కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం జగన్

జీవనాడికి సహకరించండి

- పోలవరానికి రూ.10 వేల కోట్లు మంజూరు చేయండి..
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి
- ప్రత్యేక హోదాతోనే రాష్ట్రానికి మేలు
- హామీలిచ్చి తొమ్మిదేళ్లు పూర్తయింది.. రాష్ట్ర సమస్యలపై దృష్టి సారించండి
- 40 నిమిషాల భేటీలో పలు అంశాల ప్రస్తావన

2లో

“ ఖరీఫ్ నాటికి నూరు శాతం ఆర్బీకేల్లో యంత్ర సేవా కేంద్రాలు అందుబాటులో ఉండాలి. ఆర్బీకేలకు అనుబంధంగా కిసాన్ డ్రోన్స్‌ను సత్వరమే ఏర్పాటు చేయాలి. జూలైలో కనీసం 500 కిసాన్ డ్రోన్స్, డిసెంబర్ కల్లా మరో 1,500 డ్రోన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. రైతులకు వ్యక్తిగతంగా టార్పాలిన్లు, స్ప్రేయర్ల పంపిణీకి సాధ్యమైనంత త్వరగా శ్రీకారం చుట్టాలి. జూలైలో టార్పాలిన్లు, జూలై-డిసెంబర్ మధ్య మూడు విడతల్లో స్ప్రేయర్లు పంపిణీ చేయాలి. ఆర్బీకేల్లో కియోస్క్‌లు నూరు శాతం పని చేసేలా చూడటంతో పాటు, వాటి సేవలు పూర్తి స్థాయిలో రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. కియోస్క్‌ల పని తీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలి.

- వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం జగన్

మోగిన కర్ణాటక ఎన్నికల నగారా

మే10న ఎన్నికలు

రాష్ట్రంలో ఒకే దశలో పోలింగ్

- అమల్లోకి వచ్చిన ఎన్నికల నియమావళి
- ఓటింగ్ శాతాన్ని పెంచేందుకే బుధవారం పోలింగ్
- వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికకు తొందర పడటం లేదు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్



కర్ణాటకలో మూడుముక్కలాట!

- బొమ్మై ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని మోదీ ఇమేజ్ మరిపించగలదా?
- బలమైన స్థానిక నాయకత్వం కాంగ్రెస్‌కు అనుకూలంగా మారుతుందా?
- కింగ్ మేకర్ నుంచి కింగ్ అవ్వాలన్న జేడీ(ఎస్) ఆశలు ఫలిస్తాయా?

6లో

కర్ణాటక ఎన్నికల ముఖచిత్రం

నోటిఫికేషన్ విడుదల: ఏప్రిల్ 13

నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 20

నామినేషన్ల పరిశీలన: ఏప్రిల్ 21

ఉపసంహరణకు చివరి తేదీ: ఏప్రిల్ 24

పోలింగ్: మే 10; ఫలితాలు: మే 13

గూగుల్‌కు షాక్



ఆండ్రాయిడ్ మొబైల్ పరికరాల కేసుకు సంబంధించి టెక్ దిగ్గజం గూగుల్‌కు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌ఏటీ)లో ఎదురు దెబ్బ తగిలింది. రూ.1,338 కోట్ల జరిమానా విధిస్తూ కాంపిటీషన్ కమిషన్ ఇచ్చిన తీర్పును ఎన్‌సీఎల్‌ఏటీ సమర్థించింది. ఇప్పటికే చెల్లించిన 10 శాతం మొత్తాన్ని సర్దుబాటు చేసి, మిగతాది 30 రోజుల్లో డిపాజిట్ చేయాలని ఆదేశించింది.

- వివరాలు 13లో

ఏది నిజం?

దారుణాలు జరిగిన 'నాడు' నోరెత్తని రామోజీ

బాబుకోసం.. దళిత రాగం

- వ్యక్తిగత ఘటనలకూ కులం రంగు పులుముతూ కథనాలు
- టీడీపీ అచ్చేసిన పుస్తకంలోని అంశాలనే పేరుస్తూ బ్యానర్ స్టోరీ
- అసత్యాలు.. అర్ధసత్యాలతో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ గణాంకాలకూ మసి
- టీడీపీ హయాంలో దళితులపై దాడుల్లో దేశంలో ఏపీ నెంబర్–2, ఇప్పుడు–10
- నాలుగేళ్లుగా హోంమంత్రి పదవి సైతం దళిత మహిళకే
- ఈ వాస్తవాలేవీ ప్రస్తావించకుండా విషం కక్కిన 'ఈనాడు'

4లో

టీడీపీ నేతల బరితెగింపు

- కళ్యాణదుర్గంలో దారుణం
- రాత్రి సమయంలో బలహీన వర్గాలకు చెందిన వారి ఇళ్లలోకి చొరబాటు.. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మాజీ ఎమ్మెల్యే ఉన్నం కుమారులు
- అడ్డొచ్చిన దళిత యువకుడిపై దాడి

4లో



వివేకా కేసు విచారణకు నూతన సిట్

- సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ డీఐజీ చౌరాసియా నేతృత్వంలో ఐదుగురితో బృందం
- ఏప్రిల్ 30 లోపు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశం
- రాంసింగ్‌ను తప్పించిన సుప్రీంకోర్టు ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) సీబీఐ ఏర్పాటు చేసింది. బృందంలోని సభ్యుల పేర్లను సీబీఐ అందజేయగా సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. దర్యాప్తును వేగవంతం చేసి ఏప్రిల్ 30 లోగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు అధికారిగా ఉన్న రాంసింగ్‌ను తప్పించింది. వివేకా హత్య కేసులో ఏ5గా ఉన్న శివశంకర్‌రెడ్డి భార్య తులశమ్మ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. నూతన సిట్ బృందానికి సీబీఐ డీఐజీ కేఆర్ చౌరాసియా నేతృత్వం వహించనున్నారు. ఈ బృందంలో ఎస్పీ వికాస్‌సింగ్, అదనపు ఎస్పీ ముకేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు ఎస్.శ్రీమతి, నవీన్ పూనియా, ఎస్ఐ అంకిత్ యాదవ్ ఉన్నారు.

ఇలా ఎంతకాలం?

దర్యాప్తు అధికారి మార్పు/కొనసాగింపుపై సీబీఐ డైరెక్టర్ నిర్ణయాన్ని వెల్లడించాలంటూ సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో సీబీఐ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ తాజాగా జాబితాను అందజేశారు. చౌరాసియా నేతృత్వంలోని

మిగతా 2వ పేజీలో ▶



మరో 22 వేల ఈవీ చార్జింగ్ స్టేషన్లు

- దేశంలో 2024 నాటికి ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయం
- ఈ ఏడాది 7,432 చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళిక
- ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 400 స్టేషన్లకు అవకాశం

14లో

బెంగాల్‌పై కేంద్రం వివక్ష



పశ్చిమ బెంగాల్‌పై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దారుణమైన వివక్ష చూపుతోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. కేంద్ర పథకాల కింద తమ రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కేంద్రం తీరును నిరసిస్తూ ఆమె కోల్‌కతాలో ధర్నా చేశారు.

- వివరాలు 6లో

'రన్'రంగం రె'ఢీ'

కరోనా నేపథ్యంలో గత నాలుగేళ్లు పలు ఆంక్షల మధ్య జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. ఈసారి ఎలాంటి ఆంక్షలు లేవు. అభిమానులకు పరుగుల విందు అందించడానికి ఐపీఎల్ జట్లు సిద్ధమయ్యాయి. శుక్రవారం గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తొలి మ్యాచ్‌తో ఐపీఎల్ 16వ సీజన్‌కు తెర లేవనుంది.

- వివరాలు 12లో



క్లుప్తంగా...

గవర్నర్ శ్రీరామనవమి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి విజయానికి, ధర్మ సంస్థాపనకు శ్రీరామనవమి వేడుక ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కరుణ, ధర్మానికి ప్రతిరూపమే శ్రీరాముడని గవర్నర్ పేర్కొన్నట్లు రాజ్‌భవన్‌వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

ప్రజలకు సీఎం జగన్ శ్రీరామ నవమి శుభాకాంక్షలు



సాక్షి,అమరావతి: రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సీతారాముల దీవెనలు, అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని అభిలషించారు. భద్రాద్రి, ఒంటిమిట్ట ఆలయాలతో పాటు, తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంటింటా శ్రీరామనవమి పర్వదినాన్ని, రాములవారి కళ్యాణాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఏప్రిల్ 3 నుంచి పింఛన్ల పంపిణీ

- బ్యాంకులకు 1న ఆర్థిక సంవత్సరం ముగింపు సెలవు.. 2వ తేదీ ఆదివారం
- దీంతో 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని సెర్ప్ ఆదేశం

సాక్షి, అమరావతి: బ్యాంకులకు వరుస సెలవులు రావడంతో ఈసారి ఏప్రిల్ 3 నుంచి అవ్వాతాతలకు పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సీఈవో ఇంతియాజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన అన్ని జిల్లాల పీడీలకు ఆదేశాలు జారీ చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఏప్రిల్ 1న దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు రావడం.. రెండో తేదీ ఆదివారం కావడం.. ఆరోజు కూడా బ్యాంకులకు సెలవు కావడం వల్ల ఏప్రిల్‌లో చేపట్టే పింఛన్ల పంపిణీలో మార్పులు చేసినట్లు సెర్ప్ సీఈవో పేర్కొన్నారు. ఏప్రిల్ 3వ తేదీన విడుదల చేసిన మొత్తాన్ని.. ఆ రోజు నుంచే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో అందరికీ ఆదేశాలు జారీ చేయాలని పీడీలకు సూచించారు.

రెండు మండలాలుగా ఏలూరు

- ఏలూరు అర్బన్, రూరల్ మండలాలుగా విభజన
- ప్రాథమిక నోటిఫికేషన్ జారీ

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా కేంద్రమైన ఏలూరు మండలాన్ని ప్రభుత్వం రెండుగా పునర్‌వ్యవస్థీకరించింది. ఇప్పుడున్న ఏలూరు మండలాన్ని ఏలూరు అర్బన్, ఏలూరు రూరల్ మండలాలుగా విభజిస్తూ బుధవారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏలూరు నగరం మొత్తాన్ని అర్బన్ మండలంగా ఏర్పాటు చేశారు. కొత్తగా నగరంలో కలిసిన చొదిమెళ్ల, తంగెళ్లమూడి, శనివారపుపేట, సత్రంపాడు, వెంకటాపురం, కొమడవోలు, పోణంగి గ్రామాలను సైతం అర్బన్ మండలంలోనే విలీనం చేశారు. రూరల్ మండలంలో చాటపర్రు, జాలిపూడి, కాట్లంపూడి, మాదేపల్లి, మల్కాపురం, మానూరు, శ్రీపర్రు, కలకుర్రు, కోమటిలంక, గుడివాకలంక, కొక్కిరాయిలంక, పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక గ్రామాలను చేర్చారు. పరిపాలన సౌలభ్యం, ఆయా ప్రాంతాల అభివృద్ధి నిమిత్తం పునర్విభజన చేస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రభుత్వం దీనిపై సూచనలు, అభ్యంతరాలను 30 రోజుల్లోపు జిల్లా కలెక్టర్‌కు తెలపవచ్చని సూచించింది.

విద్యార్థులకు వినూత్న బోధన

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో సేవ్ ది చిల్డ్రన్ సంస్థ స్టెమ్ (సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్), డిజిటల్ విధానం ద్వారా వినూత్న బోధన అందిస్తోందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా ఎస్పీడీ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో సేవ్ ది చిల్డ్రన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్ ఫౌండేషన్, సన్ టీవీ నెట్‌వర్క్ సంస్థలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ.. పిల్లలకు అనుభవాత్మక విద్యను అందించడానికి సేవ్ ది చిల్డ్రన్ సంస్థ ప్రత్యేక ప్రాజెక్టులను రూపొందించి రాష్ట్రంలోని 81 మోడల్ స్కూళ్లు, 117 జెడ్పీ హైస్కూళ్లలో స్టెమ్, స్మార్ట్ ల్యాబొరేటరీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఎస్‌ఏపీడీ బి.శ్రీనివాసరావు, కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదనరావు, మోడల్ స్కూల్ సెక్రటరీ కేవీ కృష్ణారెడ్డి, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ముద్రణ సంచాలకులు కె.రవీంద్రనాథ్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ ముత్యం, డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ వెంకటరాజేష్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ వినాయక్, సేవ్ ది చిల్డ్రన్ ప్రతినిధులు ప్రశాంతి బత్తిన, నగేష్ మల్లాడి, రమేష్ దొంత పాల్గొన్నారు.

స్కూళ్లను సందర్శిస్తూ.. ఆర్బీకేలపై ఆసక్తిగా

- కృష్ణా, గుంటూరు జిల్లాలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన
- రోల్‌మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని సీఎం జగన్‌పై ప్రశంసలు
- మానవ వనరుల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కితాబు



సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమైన ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ అగస్టే తనుకమే (ఫైల్)

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. విద్య, వైద్య రంగాలను సంస్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. దేశ సగటు కంటే ఏపీలో ఎక్కువగా వృద్ధి రేటు నమోదు కావటాన్ని ప్రస్తావిస్తూ మిగిలిన రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌ను ఉదాహరణగా తీసుకుని ముందుకు సాగవచ్చని సూచించింది. రాష్ట్రంలో సమర్థవంతమైన, డైనమిక్ ప్రభుత్వం ఉందని కితాబిచ్చింది.

స్కూళ్లు, సచివాలయాలు, ఆర్బీకేల సందర్శన

తాజాగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పర్యటించిన ప్రపంచబ్యాంకు డైరెక్టర్ (ఇండియా) అగస్టే తనుకమే నేతృత్వంలోని బృందం వెనిగండ్లలో ప్రభుత్వ పాఠశాలలతోపాటు పెనమలూరు మండలం వణుకూరులో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాలను సందర్శించింది. ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువుల పంపిణీ తీరు, కియోస్క్‌ల సేవలను ఆసక్తిగా పరిశీలించింది. పాఠశాలల్లో బోధనా విధానాలతోపాటు మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను స్వయంగా పరిశీలించింది. తల్లిదండ్రుల కమిటీలు, విద్యార్థులతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించింది. ఉత్తమ వైద్యం, విద్యతోపాటు నిర్ణీత సమయంలోగా పౌరులకు సేవలందించడంలో ముఖ్యమంత్రి జగన్ రోల్‌మోడల్‌గా నిలిచారని ఈ సందర్భంగా అగస్టే తనుకమే అభినందించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి జగన్ తపిస్తున్నారని చెప్పారు. ప్రపంచ బ్యాంకు సాయంతో అమలవుతున్న మూడు ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి జగన్‌తో సమావేశం సందర్భంగా బృందం సమీక్షించింది. రానున్న పాతికేళ్లకు సంబంధించి ముఖ్యమంత్రి జగన్ విజన్, మిషన్‌కు ప్రపంచబ్యాంకు సహకారం కొనసాగుతుందని ప్రకటించింది.

పెట్టుబడులను ఆకర్షిస్తాయి

''విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, కృషిని వణుకూరు, భవానీపురం, వెనిగండ్లలో ప్రత్యక్షంగా గమనించాం. ఈ రంగాలపై ప్రభుత్వం భవిష్యత్తులో కూడా అధికంగా వ్యయం చేయనుండటం, పెరుగుతున్న వృద్ధి రేటు స్థిరమైన పెట్టుబడులను ఆకర్షిస్తాయి. తన విజన్‌ను మాతో పంచుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు''

– ట్విట్టర్‌లో 'అగస్టే తనుకమే'

యంత్ర వ్యవ'సాయం'

- రైతులకు అందుబాటులో ఆధునిక యంత్రాలు
- వ్యవసాయ శాఖపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష



వ్యవసాయ, ఉద్యాన శాఖలపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలి. పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. గ్రామ స్థాయిలో ప్రతి రైతుకు ఆధునిక యంత్రాలను అందుబాటులో ఉంచాలి. ఇప్పటికే మెజార్టీ ఆర్బీకేల్లో రైతు గ్రూపులకు యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేశాం. సాధ్యమైనంత త్వరగా మిగిలిన ఆర్బీకేల్లో ఏర్పాటు చేయాలి. అవసరమైన మేరకు టార్పాలిన్లు, స్ప్రేయర్లు వంటి వ్యక్తిగత పరికరాలను రైతులకు పంపిణీ చేయాలి. అలా చేస్తే వ్యవసాయ యాంత్రీకరణ మరింత పెరిగి.. రైతులు మరింతగా లబ్ధి పొందేందుకు దోహద పడుతుంది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అధికారులు రూపొందించిన వ్యవసాయ పరికరాల పంపిణీ షెడ్యూల్‌కు బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన శాఖలపై జరిగిన సమీక్షలో సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుత రబీ సీజన్‌తో పాటు రానున్న ఖరీఫ్ సీజన్‌లో అనుసరించాల్సిన కార్యాచరణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ఇంకా మిగిలిన 4,225 ఆర్బీకేల్లో సీహెచ్‌సీలకు ఏప్రిల్‌లో యంత్రాల పంపిణీ పూర్తి చేయాలని చెప్పారు. రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్నారు. రైస్ మిల్లర్ల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఇటీవలి అకాల వర్షాల వల్ల దెబ్బ తిన్న పంటలకు సంబంధించి ఎన్యుమరేషన్‌ను వేగవంతం చేయాలన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలని, ఈ విషయంలో మరింత శ్రద్ధ పెట్టడంతో పాటు నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఆర్బీకేల్లో కియోస్క్‌లు నూరు శాతం పని చేసేలా చూడటంతో పాటు, వాటి సేవలు పూర్తి స్థాయిలో రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కియోస్క్‌ల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలన్నారు.

ఆర్బీకేల ద్వారా 10.5 లక్షల టన్నుల ఎరువులు

2023–24 సీజన్‌లో 10.5 లక్షల టన్నుల ఎరువుల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఎరువులతో పాటు రైతులకు అవసరమైన స్థాయిలో పురుగుల మందులను ఏపీ ఆగ్రోస్ ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టామని చెప్పారు. రబీ సీజన్‌లో 100 శాతం ఈ క్రాపింగ్ పూర్తయిందని, దీని ఆధారంగానే రబీ ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎగుమతికి ఆస్కారం ఉన్న వరి రకాలను ప్రోత్సహిస్తున్నామని, 2022 ఖరీఫ్‌లో 2.74 లక్షల హెక్టార్లలో ఎగుమతి చేయదగ్గ వరి రకాలను సాగు చేసేలా ప్రోత్సహించామని చెప్పారు. తద్వారా దాదాపు 6.29 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చిందని తెలిపారు. ప్రస్తుత రబీ.. 2022–23 సీజన్‌లో 1.06 లక్షల హెక్టార్లలో ఎగుమతి వెరైటీలను రైతులు సాగు చేశారని, 3.79 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నామని వివరించారు. ఇంకా ఏం చెప్పారంటే..

- పొలంబడి శిక్షణ కార్యక్రమాల వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా ఉత్తమ వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్నాం. వీటి వల్ల వరి, వేరుశనగలో 15 శాతం, పత్తిలో 12 శాతం, మొక్కజొన్నలో 5 శాతం పెట్టుబడి ఖర్చులు తగ్గాయి. పత్తిలో 16 శాతం, మొక్కజొన్నలో 15 శాతం, వేరుశనగలో 12 శాతం, వరిలో 9 శాతం దిగుబడులు పెరిగినట్టుగా క్షేత్ర స్థాయి పరిశీలనలో గుర్తించాం.
- పూర్తి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల దిశగా అడుగులు వేయడానికి ఇది తొలి మెట్టు కానుంది. 26 రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీవో)లకు జీఏపీ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్) సర్టిఫికేషన్ ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.
- రాష్ట్రంలో మిల్లెట్స్ సాగును ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించాం. 19 జిల్లాల్లో 100 హెక్టార్ల చొప్పున మిల్లెట్ క్లస్టర్లు ఏర్పాటు చేశాం. వీటితో పాటు మూడు ఆర్గానిక్ క్లస్టర్లను కూడా ఏర్పాటు చేశాం. అకాల వర్షాల వల్ల పంట నష్టంపై అంచనా వేసేందుకు చేపట్టిన ఎన్యుమరేషన్ శరవేగంగా జరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలో నివేదికలు ఖరారు చేసి, రెండో వారానికి నష్టపోయిన రైతుల జాబితాలను విడుదల చేస్తాం.
- ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, వ్యవసాయ, ఉద్యాన శాఖల సలహాదారులు తిరుపాల్ రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, ఏపీ ఆగ్రోస్ చైర్మన్ బి.నవీన్ నిశ్చల్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయ, ఉద్యాన శాఖ కమిషనర్లు చేవూరు హరికిరణ్, ఎస్.ఎస్. శ్రీధర్, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్‌పాండే, ఏపీ సీడ్స్, ఆగ్రోస్ ఎండీలు డాక్టర్ శేఖర్ బాబు, ఎస్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ తరహాలో ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్: సీఎం



- ఫ్యామిలీ డాక్టర్ తరహాలోనే ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్‌ను వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి దశల వారీగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి. ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పరీక్షలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలి.
- జూన్‌లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి పరీక్షా ఫలితాలు వచ్చేలా చూడాలి. వాటి ఆధారంగానే రైతులకు సాగులో పాటించాల్సిన పద్ధతులపై పూర్తి వివరాలు, అవగాహన కల్పించాలి. భూ పరీక్ష కోసం నమూనాల సేకరణ, పరీక్షలు, ఫలితాలు, వాటి ఆధారంగా సాగు పద్ధతులు, రైతులకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై ఒక సమర్థవంతమైన ఎస్‌ఓపీ రూపొందించుకోవాలి. ఈ పరీక్ష ఫలితాల ఆధారంగానే శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు పంటలకు అవసరమైన స్థాయిలో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలి. అప్పుడే ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్.. ఆర్బీకే సేవలు మరో దశకు వెళ్తాయి.
- ఉద్యాన వన పంటల సాగు విస్తీర్ణం ఏటా పెరగడం వల్ల దిగుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి. కొత్త తరహా ఉత్పత్తులు వస్తున్నాయి. అందుకు తగినట్టుగా మార్కెటింగ్ ఉండాలి. రైతులు తాము పండించిన పంటలను విక్రయించుకోవడానికి ఏ దశలోనూ ఇబ్బంది పడకూడదు. ఆ విధంగా మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఉద్యాన పంటలు పండించే రైతులను మార్కెటింగ్‌కు అనుసంధానం చేయాలి. అప్పుడే వారికి మంచి ఆదాయం వస్తుంది.

కదులుతున్న ఓటుకు కోట్లు 2.0 డొంక

- టీడీపీ అగ్రనేతలు తననూ ప్రలోభపెట్టారన్న ఎమ్మెల్యే ఆర్థర్
- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున తన కుమారుడికి ఫోన్ చేశారని వెల్లడి.. టీడీపీ అభ్యర్థికి ఓటు వేస్తే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్
- రూ.200 కోట్లు ఇచ్చినా సీఎం వైఎస్ జగన్ వెంటేనని స్పష్టీకరణ
- ఎమ్మెల్యేలు రాపాక, మద్దాళి ద్వారా ఇప్పటికే టీడీపీ ప్రలోభాలు బహిర్గతం.. టీడీపీ ప్రలోభాల పర్వంపై సర్వత్రా మండిపాటు

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పాల్పడిన ఓటుకు కోట్లు 2.0 కుంభకోణం డొంక కదులుతోంది. ఓటు వేస్తే కోట్లు ఇస్తామని టీడీపీ నేతలు తమను ప్రలోభపెట్టారంటూ ఇప్పటికే ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాద్, మద్దాళి గిరిధర్‌లు ఆధారాలతో బహిర్గతం చేశారు. తననూ టీడీపీ అగ్రనేతలు ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజు కూడా తన కుమారుడికి టీడీపీ అగ్రనేతలు ఫోన్ చేసి.. టీడీపీ అభ్యర్థికి ఓటు వేస్తే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చారని వివరించారు. రూ.200 కోట్లు ఇచ్చినా, తాను టీడీపీ అభ్యర్థికి ఓటేయనని.. సీఎం వైఎస్ జగన్ వెంటే నడుస్తానని స్పష్టం చేశానని ఎమ్మెల్యే ఆర్థర్ తెలిపారు. వీటిని బట్టి.. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలోనే రాష్ట్ర శాసనమండలి ఎన్నికల్లోనూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమంగా దోచేసిన సొమ్మును వెదజల్లి ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నించినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్ర శాసనసభలో మొత్తం స్థానాల సంఖ్య 175. ఇందులో వైఎస్సార్‌సీపీకి 151 మంది సభ్యులు ఉండగా.. టీడీపీకి 23 మంది, జనసేనకు ఒక సభ్యుడు ఉన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ నలుగురు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వ్యవహారశైలి నచ్చక ఉన్న ఒక ఎమ్మెల్యే ఆ పార్టీకి దూరమయ్యారు. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు సీఎం వైఎస్ జగన్ వెంట నడుస్తున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ బలం 156.. టీడీపీ బలం 19 అన్నది స్పష్టమవుతోంది. శాసనమండలిలో ఖాళీ అయిన ఏడు స్థానాలకు ఎన్నికలు నిర్వహించిన తరుణంలో ఒక్కో ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుపొందాలంటే 22 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉండటంతో ఏడు స్థానాలకు అభ్యర్థులను పోటీకి పెట్టింది.

ప్రలోభాలు, కుతంత్రాలే బాబు విధానం

గెలిచే బలం లేకున్నప్పటికీ.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించడాన్ని బట్టి చూస్తుంటే.. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలోనే ఓటుకు రూ.కోట్లు ఎర వేసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి చంద్రబాబు వ్యూహం రచించారని ఆదిలోనే వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఆ పార్టీ నేతలు చెప్పారు. పోలింగ్ అనంతరం టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధకు 23 ఓట్లు రావడాన్ని బట్టి చూస్తే.. ఆ పార్టీకి ఉన్న 19 మంది ఎమ్మెల్యేల కంటే అదనంగా నలుగురు ఓట్లేసినట్లు స్పష్టమవుతోంది. ఆ నలుగురు ఎమ్మెల్యేలు ఒక్కొక్కరికి రూ.15 నుంచి రూ.20 కోట్లు ఇచ్చి కొనుగోలు చేసినట్లు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల ఆరోపించారు. టీడీపీ అగ్రనేతల ప్రలోభాల పర్వాన్ని ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాద్, మద్దాళి గిరిధర్, ఆర్థర్‌లు బట్టబయలు చేయడంతో ఓటుకు కోట్లు 2.0 కుంభకోణం లోగుట్టు ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన చంద్రబాబు.. ఇప్పటికీ అదే సూత్రాన్ని అమలు చేస్తుండటాన్ని ప్రజలు, రాజకీయ పరిశీలకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల మనసులు గెలుచుకోవడం ద్వారా కాకుండా ఎప్పటిలాగే కుట్రలు, కుతంత్రాలు.. ఎత్తుగడలు, ప్రలోభాలతో అధికారంలోకి రావాలనే చంద్రబాబు విధానాన్ని తీవ్రంగా తప్పు పడుతూ మండిపడుతున్నారు.

ఆస్తి పన్ను రూ.1,849 కోట్లు వసూలు

సాక్షి, అమరావతి: పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో ఈ ఏడాది ఆస్తి పన్ను వసూళ్లు పెరిగినట్టు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మి తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 29 నాటికి రూ.1,849.31 కోట్లు పన్నుల రూపంలో వసూలు చేసినట్టు తెలిపారు. ఇదే కాలానికి గతేడాది రూ.1,334.98 కోట్లు వసూలు కాగా.. ఈసారి అదనంగా రూ.514.33 కోట్లు వసూలైందని వివరించారు. ఈనెల 31లోగా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించేవారికి వడ్డీ మినహాయింపు ఇవ్వడంతో చెల్లింపులు పెరిగాయని తెలిపారు.

వివేకా కేసు విచారణకు నూతన సిట్

మొదటి పేజీ తరువాయి

నూతన సిట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా జస్టిస్ ఎంఆర్ షా తెలిపారు. ఈ సందర్భంగా దర్యాప్తు ఆలస్యం అవుతోందని అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం వేగంగా పూర్తి చేయాలని పేర్కొంది. భారీ కుట్ర కారణంగా ట్రయల్ కోర్టులో అదనపు చార్జిషీటు దాఖలు చేసేందుకు స్వేచ్ఛ కావాలని సీబీఐ కోరడంతో ఇలా ఎంతకాలం సాగదీస్తారని జస్టిస్ సీటీ రవికుమార్ ప్రశ్నించారు. 'విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు, సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించాయి. మేం మరోసారి అదే చెబుతున్నాం. బెయిలు పిటిషన్ దరఖాస్తు చేసుకునేందుకు ఏ5 (శివశంకర్‌రెడ్డి) భార్య అనుమతి కోరారు. ఈరోజు నుంచి ఆర్నెల్ల వరకూ విచారణ ప్రారంభం కాకుంటే రెగ్యులర్ బెయిల్‌కు ఏ 5 దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలు వర్తించవు. కేవలం మెరిట్స్ ప్రకారమే హైదరాబాద్‌లోని ట్రయల్ కోర్టు విచారిస్తుంది. ఈ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నాం' అని ధర్మాసనం ఆదేశాల్లో పేర్కొంది.

తెలంగాణ

నేడు భద్రాద్రి రాముడి కల్యాణం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/భద్రాచలం: పట్టాభిరాముడి కల్యాణానికి భద్రాచలం సిద్ధమైంది. గోదావరి తీరంలో భద్రగిరిపై మిథిలా స్టేడియంలో ఏర్పాటుచేసిన కల్యాణ మండపంలో అభిజిత్ లగ్నంలో సీతమ్మ వారిని శ్రీరాముడు వివాహమాడనున్నారు. గురువారం జరగనున్న ఈ వేడుకను కనులారా చూసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు భద్రాచలానికి చేరుకుంటున్నారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఏటా వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అందులో భాగంగా చైత్రశుద్ధ నవమిన సీతారాములకు కల్యాణం జరిపిస్తారు. ఈసారి గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపంలో వైభవంగా వేడుకలు జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ సంస్థలు సుమారు 420 బస్సులను భద్రాచలానికి నడిపిస్తున్నాయి.

రేపు పట్టాభిషేకం

గురువారం కల్యాణం జరగనుండగా, శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు కోదండ రాముడికి పుష్కర పట్టాభిషేకం చేయనున్నారు. పట్టాభిషేక ఘట్టానికి గవర్నర్ తమిళిసై ప్రత్యేక అతిథిగా హాజరవుతారు.

జీవనాడికి సహకరించండి

- పోలవరానికి రూ.10 వేల కోట్లు మంజూరు చేయండి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి
- నేడు మరికొందరు మంత్రులను కలిసే అవకాశం



ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో భేటీ అనంతరం అధికారిక నివాసానికి వెళ్తున్న సీఎం జగన్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అడ్‌హక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని విభజన హామీల నోడల్ ఏజెన్సీ అయిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లయినా ప్రధాన సమస్యలు అలాగే ఉన్నాయని, వాటిపై దృష్టిసారించాలని కోరారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని వివరించారు. బుధవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన ఆయన రాత్రి సుమారు 40 నిమిషాల పాటు అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు పెండింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. 'అశాస్త్రీయ విభజన వల్ల ఏపీకి ఆర్థికంగా, ఆదాయాల పరంగా, అభివృద్ధి పరంగా, వివిధ సంస్థల రూపేణా తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నష్టాల నుంచి కాపాడేందుకు పార్లమెంట్ సాక్షిగా విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చింది. అది జరిగి తొమ్మిదేళ్లు కావొస్తున్నా రాష్ట్రానికి నెరవేర్చాల్సిన అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిపై వెంటనే దృష్టి సారించాలి' అని సీఎం కోరారు. ఇంకా అమిత్ షా దృష్టికి తీసుకెళ్లిన అంశాలు ఇలా ఉన్నాయి.

వేగం పెరగాలంటే నిధులివ్వాలి

- అనూహ్య వరదల కారణంగా పోలవరం డయా ఫ్రం వాల్ దెబ్బతింది. ఆ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు రూ.2,020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని డీడీఆర్‌ఎంపీ అంచనా వేసింది. ఈ సొమ్ములు వెంటనే విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సొంత ఖజానా నుంచి రూ.2,600.74 కోట్లు ఖర్చు చేసింది. రెండేళ్లుగా ఈ సొమ్ము పెండింగ్‌లో ఉంది. వెంటనే చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలి. పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ.55,548 కోట్లుగా నిర్ధారించింది. ఈ మొత్తానికి వెంటనే ఆమోదం తెలపాలి. తాగునీటి సరఫరా అంశాన్ని కూడా పోలవరం ప్రాజెక్టులో భాగంగా చూడాలి. ప్రాజెక్టు నిర్మాణంలో కాంపోనెంట్ వారీ నిబంధనలను సడలించాలి. ముంపు బాధితులకు వీలైనంత త్వరగా పరిహారం ఇవ్వాలి. డీబీటీ పద్ధతిలో ఈ సహాయం అందిస్తే జాప్యాన్ని నివారించవచ్చు. ఈ నేపథ్యంలో పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలి.
- 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద పెండింగ్‌లో ఉన్న రూ.36,625 కోట్లు వెంటనే విడుదలయ్యేలా చూడాలి.
- రాష్ట్రంలో ఈ ప్రభుత్వం కన్నా ముందున్న ప్రభుత్వం పరిమితికి మించి రుణాలు వాడుకుందన్న కారణంతో ఇప్పుడు ఆంక్షలు విధించారు. నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారు. 2021–22లో రూ.42,472 కోట్ల రుణ పరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లు తగ్గించారు. ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి.
- తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు, 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. వీటిని వెంటనే ఇప్పించాలి.
- జాతీయ ఆహార భద్రతా చట్టం కింద లబ్ధిదారుల ఎంపికలో హేతు బద్ధత పాటించక పోవడం వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోంది. పీఎంజీకేఏవై కార్యక్రమం కిందకు రాని, 56 లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా రేషన్ ఇవ్వడం వల్ల దాదాపు రూ.5,527 కోట్ల భారాన్ని మోయాల్సి వస్తోంది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తి సరైనదేనని నీతి ఆయోగ్ కూడా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం నెలకు వినియోగించని రేషన్ దాదాపు 3 లక్షల టన్నులు ఉంటుంది. ఇందులో 77 వేల టన్నులు రాష్ట్రానికి కేటాయిస్తే సరిపోతుంది. దీనిపై దృష్టి సారించాలి.
- రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. దీని వల్ల రాష్ట్రానికి గ్రాంట్లు, పన్ను రాయితీలు లభిస్తాయి. ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడమే కాకుండా, సేవా రంగం విస్తరిస్తుంది. స్వయం శక్తి దిశగా రాష్ట్రం అడుగులేసేందుకు తోడ్పడుతుంది. అందువల్ల రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతున్నాం.
- కొత్తగా కేంద్రం మంజూరు చేసిన మూడు మెడికల్ కాలేజీలతో కలిపి మొత్తంగా రాష్ట్రంలో 14 మాత్రమే ఉన్నాయి. మిగిలిన 12 కాలేజీలకు వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయాలి. (జిల్లాకు ఒక కాలేజీ చొప్పున మాత్రమే కేంద్రం సాయం చేస్తుంది.. రాష్ట్రంలో మరో రెండు కాలేజీలు అదనం) ఈ కాలేజీలకు సంబంధించిన పనులు అత్యంత వేగంగా ముందుకు సాగుతున్నాయి. వీటికి సంబంధించి కేంద్రం తగిన విధంగా సహాయ పడాలి.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ఢిల్లీ పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌కు వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి నేతృత్వంలో ఎంపీలు మిథున్‌రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వంగా గీత, తలారి రంగయ్య, శ్రీకృష్ణదేవరాయలు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, అనూరాధ, మాధవి, బీవీ సత్యవతి, ఆర్.కృష్ణయ్య, కోటగిరి శ్రీధర్, బీద మస్తానరావులు ఢిల్లీ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. రాత్రి అధికారిక నివాసంలో బస చేశారు. గురువారం కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షెకావత్ తదితరులతో సమావేశమయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

ఘనంగా ఐఐఎం విశాఖ 7వ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (విశాఖపట్నం) 7వ స్నాతకోత్సవం బుధవారం విశాఖలో ఘనంగా జరిగింది. దీనికి కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు హాజరై విద్యార్థులకు డిగ్రీలు, పతకాలను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్ గురించి ఆందోళన వద్దని, గతాన్ని మరువరాదని, వాస్తవిక సమాజంలో జీవించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రైల్వేశాఖ మంత్రిగా ప్రయాణికులకు జీవిత కాలం గుర్తుండే ప్రయాణం అందించడానికి పనిచేసిన విధానాన్ని వివరించారు. కోచ్‌లను మార్పు చేయడం, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యమిచ్చిన నిర్ణయాలను విద్యార్థులకు తెలియజేశారు. భారత్‌లో సమృద్ధిగా మానవ వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. సహజ వనరులు లేకుండా ఏ వ్యాపారం అభివృద్ధి చెందదన్నారు. ఐఐఎం(విశాఖ) బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యుడు రఘునాథ్ మాట్లాడుతూ 21 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఐఐఎం విశాఖలో విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. వైవిధ్యం, సమ్మిళిత తత్వానికి ఇది నిదర్శనమని చెప్పారు. ఐఐఎం (విశాఖ) సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు.

ఐఎన్‌టీఎస్‌వో ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య ప్రతిభ

అమరావతి: దేశవ్యాప్తంగా 3–10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌వో పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య విజయకేతనం ఎగురవేసింది. ఆలిండియా లెవల్‌లో ఐఎన్‌టీఎస్‌వో ల్యాప్‌ట్యాప్‌లను ప్రకటించగా అత్యధికంగా 96 (64%)మంది శ్రీచైతన్య విద్యార్థులు 750 ల్యాప్‌టాప్‌లను గ్రాండ్ ప్రైజ్‌లుగా సాధించారు. అంతేకాకుండా ఐఎన్‌టీఎస్‌వో 750 ట్యాబ్‌లను ప్రకటించగా అత్యధికంగా 472 (63%) మంది శ్రీచైతన్య విద్యార్థులు ట్యాబ్‌లను సాధించినట్లు విద్యా సంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. ఐఎన్‌టీఎస్‌వో ప్రకటించిన టాప్ 5 ర్యాంకుల్లో 58 శాతం ర్యాంకులు, మెడల్స్‌లో 61 శాతం తమకు వచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు, అధ్యాపకులను విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు అభినందించారు.

నా వల్లే డిజిటల్ కరెన్సీ

- మోదీ అడిగితే రిపోర్టు ఇచ్చా
- టీడీపీ ఆవిర్భావ సభలో చంద్రబాబు



సాక్షి, హైదరాబాద్: "ఐటీ విషయంలో నీకు బాగా అనుభవం ఉంది. డిజిటల్ కరెన్సీ మీద రిపోర్టు ఇవ్వు అని ప్రధాని మోదీ అడిగితే రిపోర్టు ఇచ్చాను. నేనిచ్చిన రిపోర్టు ఆధారంగానే డిజిటల్ కరెన్సీని తెచ్చారు. అలాగే 500, వెయ్యి, రెండు వేల నోట్లు రద్దు చేసి డిజిటల్ కరెన్సీని డెవలప్ చేద్దామని చెప్పాను. అది వస్తే దేశ ఆదాయం పెరుగుతుంది.." అని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పుకొచ్చారు. తెలుగుదేశం పార్టీ 41వ వ్యవస్థాపక దినం సందర్భంగా హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎప్పటిలాగానే తన గురించి చెప్పుకునేందుకే ప్రాధాన్యత ఇచ్చారు. దేశంలో పెద్దనోట్లను రద్దు చేసి, డిజిటల్ కరెన్సీని అభివృద్ధి చేయాలని, అప్పుడే అవినీతి పోతుందని చెప్పారు.

నా వల్లే సెల్‌ఫోన్లు వచ్చాయి

గతంలో తాను ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే వాజ్‌పేయి టెలికం రంగంలో సంస్కరణలు తెచ్చారని, సెల్‌ఫోన్లు వచ్చాయని అన్నారు. ఇటీవల ఓ సమావేశంలో ప్రధాని మోదీని కలిసినప్పుడు విజన్–2027 రిపోర్టు తయారు చేయాలని.. దానితో ప్రపంచంలో భారత్ నంబర్ వన్ అవుతుందని చెప్పానని వివరించారు. మొదటి నేషనల్ హైవే తెలుగుదేశం హయాంలోనే వచ్చిందన్నారు. త్వరలో రాజమండ్రిలో మహానాడు నిర్వహిస్తామని, ప్రపంచవ్యాప్తంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఇక హిందూపురం ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తెలుగు సినీ రంగానికి, రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు.



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో థ్యాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు



ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మహిళలు



విశాఖపట్నం 46వవార్డు శాంతినగర్ సచివాలయం వద్ద సీఎం జగన్ చిత్రపటంతో మహిళలు



శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మహిళలు

ఊరూరా 'ఆసరా'

ప్రజాప్రతినిధులకు కోలాటాలతో స్వాగతం పలికిన మహిళలు

ప్రతిచోట సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

సాక్షి, అమరావతి: 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన బుధవారం రాష్ట్రంలోని 79 మండలాల్లో సందడిగా సాగాయి. పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల్లో ఉండే అప్పు మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో నేరుగా ఆయా మహిళలకు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేస్తూ లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల ఆసరా నగదు అందజేసిన ప్రభుత్వం తాజాగా మూడో విడత పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాలకు వస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలకు మహిళలు ఘన స్వాగతం పలికారు. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల మహిళల పేరిట బ్యాంకుల్లో రూ.25,571 కోట్ల రుణాలు ఉండగా.. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మొదటి, రెండు విడతల్లో ప్రభుత్వం రూ.12,758 కోట్లను మహిళలకు అందజేసింది. మూడో విడతలో 7,98,395 స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని78,94,169 మంది మహిళలకు రూ.6,419.89 మొత్తం అందజేస్తోంది. ఐదు రోజులుగా 263 మండలాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూ సీఎం వైఎస్ జగన్ సందేశాన్ని లబ్ధిదారులకు తెలియజేస్తున్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 79 మండలాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆసరా మూడో విడత పంపిణీ సంబరాల్లో పాల్గొన్నట్టు సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్ తెలిపారు.



కృష్ణా జిల్లా కప్పలదొడ్డి గ్రామంలో డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి జోగి రమేష్

పోలీసులపై జనసేన శ్రేణుల దాడి

రణరంగంగా మారిన 'రహదారి వివాదం' | **సీఐ, ఏఎస్ఐలకు గాయాలు**

ఏర్పేడు/శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చిందేపల్లి రోడ్డు సమస్యపై జనసేన చేపట్టిన నిరాహార దీక్ష రణరంగమైంది. దీక్ష చేస్తున్న వారిని ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు యత్నించడంతో జనసైనికులు రాళ్లతో దాడి చేశారు. దాడిలో ఓ సీఐ, ఓ ఏఎస్ఐ గాయపడ్డారు. బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఏర్పేడు మండలంలోని చిందేపల్లి గ్రామస్తులు వెళుతున్న రోడ్డుకు అడ్డంగా శ్రీకాళహస్తి ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ కర్మాగారం యాజమాన్యం ఈ నెల 18న గోడ నిర్మించింది. దీంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మూడు రోజుల క్రితం కంపెనీ ఎదుట ఆందోళన చేసిన జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత ఆ తర్వాత గ్రామస్తులతో కలిసి చిందేపల్లి శివాలయం వద్దదీక్ష చేపట్టారు.





సీఐ ఆరోహణరావుపై రాళ్లు విసురుతున్న జనసేన శ్రేణులు

దీక్ష విరమింపజేసేందుకు యత్నించగా..

వినూత చేపట్టిన నిరాహార దీక్ష మూడో రోజుకు చేరడంతో వైద్యులు పరీక్షించి ఆస్పత్రికి తరలించాలని సూచించారు. పోలీసులు బుధవారం సాయంత్రం దీక్షా శిబిరానికి చేరుకున్నారు. దీక్షను విరమించాలని విజ్ఞప్తి చేస్తుండగా.. పక్కనున్న జనసేన కార్యకర్తలు కొందరు పోలీసులపైన, వారి వాహనాలపైన రాళ్లు రువ్వుతూ ఇక్కడ నుంచి వెళ్లాలని నినాదాలు చేశారు. దాడిలో పోలీసులు గాయపడటంతో పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అనంతరం జనసేన నాయకురాలు వినూతను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గాయపడిన సీఐ ఆరోహణరావు, ఏఎస్ఐ శివకుమార్ అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పలువురు ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, ఈసీఎల్ కంపెనీ యాజమాన్యాన్ని డబ్బులు కోసం జనసేన నాయకులు డిమాండ్ చేశారని, కంపెనీ ప్రతినిధుల నుంచి స్పందన రాకపోవడంతో నిరాహార దీక్ష పేరుతో రాద్ధాంతం చేసేందుకు దీక్ష చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సీఐ ఆరోహణరావు

ఒంటిమిట్టకు బ్రహ్మోత్సవ శోభ



విద్యుత్ కాంతుల్లో ఒంటిమిట్ట కోదండ రామాలయం

నేడు కోదండ రాముని వేడుకలకు అంకురార్పణ

ఏప్రిల్ 5న పండు వెన్నెల్లో శ్రీ సీతారాముల కల్యాణం

హాజరుకానున్న గవర్నర్, సీఎం, మంత్రులు

సాక్షి, రాయచోటి: శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు ఏకశిలా నగరం ముస్తాబైంది. టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. శ్రీ రామ నవమిని పురస్కరించుకుని కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ జరగనుంది. ఏప్రిల్ 9వ తేదీ పుష్పయాగంతో వేడుకలు ముగుస్తాయి.

ఏప్రిల్ 5న పౌర్ణమి వెలుగుల్లో.. సీతారాముల కల్యాణం

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టం కల్యాణ మహోత్సవం ఏప్రిల్ 5న జరుగనుంది. ఇక్కడ ప్రత్యేకంగా పౌర్ణమి చంద్రుని సాక్షిగా కల్యాణం జరపడం ఆనవాయితీ. అందుకే ప్రతి యేడు పౌర్ణమి వెన్నెల్లో చంద్రుడు చూసేలా శ్రీ సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ తరుణంలోనే ఏప్రిల్ 5న స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. కల్యాణోత్సవానికి సుమారు 80 వేల నుంచి లక్షమంది వరకు భక్తులు వస్తారని అధికారులు అంచనా వేసి అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏకశిలానగరంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి సీఎం వైఎస్ జగన్ హాజరై స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి గవర్నర్, ఇతర మంత్రులు రానున్నారు.

వెన్నుపోటు పొడిచి కట్టుకథలా?

చంద్రబాబుపై ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజం



సాక్షి, అమరావతి: టీడీపీని స్థాపించిన ఎన్టీఆర్‌కు చంద్రబాబు ఎందుకు వెన్నుపోటు పొడిచారో పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజైనా సమాధానం చెప్పాలని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) నిలదీశారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలు, పథకాలకు తూట్లు పొడిచి ఆయన ఆశయాలతో టీడీపీ నడుస్తోందంటూ చంద్రబాబు కట్టుకథలు చెబుతూ డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

బాబు అంటే గుర్తుకొచ్చేది వెన్నుపోటే

బడుగులు, పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీని చంద్రబాబు పెత్తందార్ల పార్టీగా మార్చారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రూ.2కే కిలో బియ్యం, పేదలకు పక్కా ఇళ్లు, హార్స్‌పవర్ రూ.50కే కరెంట్ పథకాలకు మంగళం పాడారు. మద్యపాన నిషేధాన్ని ఎత్తివేశారు. రాజ్యసభ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ టికెట్లు అమ్ముకుని టీడీపీని వ్యాపారసంస్థగా మార్చారు. ఎన్టీఆర్ తర్వాత అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తులు వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం వైఎస్ జగన్. వైఎస్సార్‌ను తలచుకుంటే ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు ఇళ్లు లాంటి అనేక పథకాలు గుర్తొస్తాయి. సీఎం వైఎస్ జగన్ పేరు చెబితే అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత లాంటి ఎన్నో పథకాలు గుర్తుకొస్తాయి. చంద్రబాబు పేరు చెబితే గుర్తుకొచ్చేది వెన్నుపోటే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం జగన్ నైతిక విలువలతో కూడిన రాజకీయం చేయడం రాష్ట్ర ప్రజలంతా చూశారు. కొందరు ఎమ్మెల్యేలు సీఎం జగన్ వద్దకు వెళ్లి 2024 ఎన్నికల్లో మళ్లీ సీటిస్తే ఓటేస్తామని చెప్పినా ప్రజాదరణ కోల్పోయిన వారికి ఇవ్వలేనని దృఢంగా చెప్పారు. అంతేగానీ చంద్రబాబులా రూ.ఐదు, పది కోట్లిస్తానని చెప్పలేదు. ఇప్పుడు నలుగురు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో నాలుగు సీట్లు మాత్రమే దక్కేలా దేవుడు స్క్రిప్టు రాస్తాడు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసి రూ.371 కోట్లు కొట్టేసిన చరిత్ర చంద్రబాబుది.

ముప్పు పొంచి ఉన్నందునే భరత్ యాదవ్‌కు గన్ లైసెన్స్

పులివెందుల కాల్పుల ఘటనపై డీఎస్పీ శ్రీనివాసులు

పులివెందుల: పులివెందులలో మంగళవారం కాల్పుల ఘటనపై కొన్ని పత్రికలు అవాస్తవాలు ప్రచురించాయని డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. భరత్ యాదవ్‌కు ముప్పు ఉన్నందునే గన్ లైసెన్స్ ఇచ్చామన్నారు. తాను సిఫారసు చేయకపోయినా ఉన్నతాధికారులు అతనికి లైసెన్స్ ఇచ్చారనడం అవాస్తవమన్నారు. బుధవారం సాయంత్రం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భరత్ యాదవ్‌పై 2019లో పట్టణానికి చెందిన వంశీ అనే వ్యక్తి హత్యాయత్నం చేశాడన్నారు. అంతేకాక ఒక కీలకమైన కేసులో భరత్ యాదవ్ సాక్షిగా ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందని భరత్ యాదవ్ సీబీఐ అధికారులకు, కడప ఎస్పీకి గన్ లైసెన్స్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నాడన్నారు. భరత్ యాదవ్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేనందువల్ల, గతంలో ఇతనిపై హత్యాయత్నం జరిగినందువల్ల, కీలకమైన కేసులో సాక్షిగా ఉన్నందువల్ల అన్ని కోణాల్లో విచారించి గన్ లైసెన్స్‌ను తానే సిఫార్సు చేశానన్నారు. కాల్పుల ఘటనపై అన్ని కోణాల్లోనూ పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం

దిలీప్‌కుమార్ వివాహ సమయంలో భరత్ యాదవ్ కొంత నగదు అప్పుగా ఇచ్చాడని డీఎస్పీ తెలిపారు. ఈ ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో భరత్‌కు.. దిలీప్, దిలీప్ బావ మహబూబ్ బాషాతో గొడవ జరిగిందన్నారు. దీంతో భరత్ తన లైసెన్స్ రివాల్వర్‌తో వారిద్దరిపై మూడు రౌండ్లు కాల్పులు జరిపాడని చెప్పారు. తీవ్రంగా గాయపడిన దిలీప్‌కుమార్‌ను కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడన్నారు. బాషా చిత్తూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. భరత్ యాదవ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతున్నామన్నారు. భరత్ నుంచి రివాల్వర్, ఘటనా స్థలంలో ఖాళీ తూటాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. డీఎస్పీ వెంట సీఐలు బాలమద్దిలేటి, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు చిరంజీవి, గోవిందరెడ్డి ఉన్నారు.

● తెలంగాణ

శంషాబాద్‌లో 3 కేజీల బంగారం పట్టివేత

నలుగురు సుడాన్ మహిళల నుంచి స్వాధీనం

శంషాబాద్ (హైదరాబాద్):నలుగురు సుడాన్ మహిళల నుంచి 3 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి. సుడాన్‌కు చెందిన నలుగురు మహిళలు దుబాయ్ నుంచి ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఈకే–524 విమానంలో బుధవారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వీరి కదలికలను అనుమానించిన అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మలద్వారంలో క్యాప్సుల్స్ రూపంలో బంగారం తీసుకొచ్చినట్లు మహిళలు అంగీకరించడంతో.. వైద్యుల సాయంతో వాటిని బయటికి తీయించారు. మొత్తం 13 క్యాప్సుల్స్‌లో 3175 గ్రాముల బంగారం ఉన్నట్లు గుర్తించారు. బంగారం విలువ రూ.1.94 కోట్లు ఉంటుందని నిర్ధారించారు. ఈ మేరకు మహిళలను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరంతా బంగారం స్మగ్లర్లకు క్యారియర్లుగా వ్యవహరించినట్టు అనుమానిస్తున్నారు. బంగారం ఎవరికి సరఫరా చేస్తారనే విషయమై అధికారులు ఆరా తీస్తున్నారు.

బీసీల అభ్యున్నతికి పాటు పడింది టీడీపీనే..

ముఖాముఖిలో నారా లోకేశ్



పెనుకొండ: బీసీల అభ్యున్నతికి పాటు పడింది టీడీపీనే అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. పాదయాత్రలో భాగంగా బుధవారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో బోయ, కురుబ సామాజిక వర్గాల నాయకులు, వ్యాపారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు పెద్దఎత్తున ప్రాధాన్యత కల్పించి.. వారిని అన్ని విధాలా అభివృద్ధి పరిచిందన్నారు. బోయలను ఎస్టీల్లో చేర్చడానికి 2017లోనే చంద్రబాబు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. వాల్మీకి ఫెడరేషన్‌కు రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కురుబ కమ్యూనిటీ భవనాలు కట్టేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు రూ.10 కోట్లు చంద్రబాబు కేటాయిస్తే నేడు 10 శాతం కూడా వాటిని పూర్తి చేయలేదన్నారు. బీసీలపై ప్రభుత్వం అధికంగా కేసులు పెడుతోందని ఆరోపించారు. బీసీలను కాపాడేందుకు బీసీ అట్రాసిటీ చట్టం తెస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామన్నారు. కురుబలను బీసీ కేటగిరీ నుంచి ఇతర కేటగిరీలోకి మార్చడానికి కృషి చేస్తామన్నారు.

శత్రువులు, మిత్రులు, మానావమానాలు, శీతోష్ణాలు, సుఖదుఃఖాలు – వీటియందు సమంగా ఉండేవాడు నాకు ఇష్టుడు.
– భగవద్గీత

దారుణాలు జరిగిన...'నాడు' నోరెత్తని రామోజీ...

బాబు కోసం...దళిత రాగం

దళితులపై దాడుల కేసు దర్యాప్తునకు బాబు హయాంలో సగటున 611 రోజులు

ఇప్పుడు వేగంగా కదులుతున్న సర్కారు... సగటున 83 రోజుల్లోనే పరిష్కారం

'ఈనాడు' ఓ వార్త రాస్తుంది. దానికి మరిన్ని అబద్ధాలు జోడించి తెలుగుదేశం పార్టీ ఆరోపణలు గుప్పిస్తుంది. నిజాలనుకునేలా జనాల్లోకి బలంగా తీసుకెళ్లటానికి ఆ ఆరోపణలనే పుస్తకాలుగా కూడా వేస్తుంది. మళ్లీ ఆ పుస్తకాల్లోని అంశాలను 'ఈనాడు' యథాతథంగా బ్యానర్ కథనాలుగా వండి వారుస్తుంది. దానిపై మళ్లీ టీడీపీ ప్రెస్‌మీట్లు షరా మామూలే. నిజానికిదంతా ఓ సైకిల్. మాఫియాలా మారిన ఎల్లో మీడియా నడిపించే చక్రం. ప్రత్యామ్నాయ మీడియా లేనన్నాళ్లూ ఈ చక్రమే రాష్ట్రాన్నేలింది. ఆర్థిక అరాచకాలతో రామోజీరావు వ్యాపార సామ్రాజ్యాలు సృష్టించినా.. సింగిల్‌గా గెలిచే సత్తా లేకున్నా చంద్రబాబు నాయుడు ఏకంగా తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నా... పనికిమాలిన అనుయాయుల్ని అందలాలెక్కించి వ్యవస్థలను భ్రష్టు పట్టించినా... అదంతా ఈ మాఫియావల్లే సాధ్యమైంది. కాకపోతే ఇపుడు ప్రత్యామ్నాయ మీడియా ఉంది. సంఘటనల వెనక వాస్తవాలను క్షణాల్లో వివరించే సోషల్ మీడియా ఉంది. అయినా రామోజీ మాత్రం మారలేదు. క్షుద్ర ప్రచారం మానలేదు. 'దళితులపై దమనకాండ' అంటూ మంగళవారం వేసిన కథనం అలాంటిదే. దాన్లో నిజానిజాల్ని చెప్పే ప్రయత్నమిది...



చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పెందుర్తిలో దళిత మహిళ మీద దాడి చేసి వివస్త్రను చేస్తున్న అప్పటి టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అనుచరులు

చంద్రబాబు అండతో కీచకపర్వం

పెందుర్తిలో దళిత మహిళను వివస్త్రను చేసి కొట్టిన టీడీపీ నేతలు


సాక్షి, అమరావతి: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో దళితులు భయం భయంగా బతకాల్సిన దుర్భర పరిస్థితులు ఉండేవి. దళిత మహిళలకు ఏమాత్రం రక్షణ ఉండేది కాదు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం పెందుర్తి నియోజకవర్గంలో పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో జరిగిన అమానుష దుర్ఘటన. అక్కడి సర్వే నంబర్ 77లో దాదాపు 80 సెంట్ల స్థలంలో రంజా దుర్గమ్మ, దువ్వాడ అక్కమ్మ సహా 14 దళిత కుటుంబాలు సాగు చేస్తున్నాయి. కొన్ని కుటుంబాలు ఇదే స్థలంలో నివాసం కూడా ఉంటున్నాయి. ఈ విలువైన స్థలంపై టీడీపీ అధికారంలోకి వచ్చాక స్థానిక టీడీపీ నాయకుల కన్ను పడింది. 2017 డిసెంబర్ 19వ తేదీన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు అప్పటి మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అనుచరులు, టీడీపీ నాయకులు తెగబడ్డారు. వారి దుశ్చర్యను అడ్డుకునే ప్రయత్నం చేసిన దళిత మహిళ రంజా దుర్గమ్మ వస్త్రాలు చింపేసి బయటకు ఈడ్చేశారు. ఇతర దళితులపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. మహిళ అనే కనికరం లేకుండా అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి అండ చూసుకుని టీడీపీ నేతలు కీచకుల్లా వ్యవహరించారు.

ఏది నిజం?

ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన డబ్బులు తీసుకుని వైఎస్సార్ సీపీకి ద్రోహం చేశారు ఓ ఎమ్మెల్యే. పైపెచ్చు ఆమె మీడియా ముందుకొచ్చి.. తన నియోజకవర్గానికి వెళ్లాలంటే భయంగా ఉందని, రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపణలు చేసింది. 'ఈనాడు' దృష్టిలో అది... 'దళితులపై దమనకాండ'. ఔరా!! మరీ ఇంత దిగజారుడా రామోజీ?

కడప వెటర్నరీ ఆసుపత్రిలో డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్న అచ్చెన్నకు... అక్కడి అసిస్టెంట్ సర్జన్ సుభాష్ చంద్రబోస్‌తో విభేదాలున్నాయి. బోస్‌ను సరెండర్ చేశారు అచ్చెన్న. దీంతో కక్ష పెంచుకున్న బోస్.. మరో ఇద్దరితో కలిసి అచ్చెన్నను అపహరించి, హతమార్చినట్లు పోలీసులు కనుగొన్నారు. నిందితుల్ని అరెస్టు చేశారు కూడా. అచ్చెన్న దళితుడు కాబట్టి దీన్ని దళితులపై జరిగిన దమనకాండగా రాసేశారు రామోజీ!!. అసలు ఈ సంఘటనతో ప్రభుత్వానికి గానీ, అధికార పార్టీకి గానీ ఏం సంబంధం? ఎందుకీ నీచపు రాతలు?

ఈ రెండు సంఘటనలూ చాలవూ... 'ఈనాడు' ఏ స్థాయిలో తెలుగుదేశం ఎజెండాను మోస్తోందో చెప్పటానికి!. ఇవి చాలవూ అబద్ధాలే ఆయుధాలుగా రాష్ట్ర ప్రభుత్వంతో రామోజీ ఏ రకమైన యుద్ధం చేస్తున్నారో తెలియటానికి? ఒక్కటైతే నిజం! తమకు న్యాయం చేస్తున్నందుకు బీసీలు, దళితులు, ఆర్థికంగా వెనకబడిన వర్గాలు అంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తున్నారు. ఇది నారా వారికి నిద్రను దూరం చేస్తోంది. సేమ్ టు సేమ్ ఆయన ఎజెండాను మోస్తున్న రామోజీకి కూడా. అందుకే ఈ రాతలు. విచిత్రమేంటంటే 2021లో దేశవ్యాప్తంగా ఎస్సీలపై జరిగిన నేరాల్లో 3.95 శాతం ఏపీలోనే జరిగాయంటారు రామోజీ. పైపెచ్చు దానికి ముందటేడాదితో పోలిస్తే 3.28 శాతం పెరిగాయంటారు కూడా. కానీ దేశంలో ఏపీ ఏ స్థానంలో ఉంది? చంద్రబాబు హయాంతో పోలిస్తే తగ్గాయా... పెరిగాయా... అనే విషయాలు రాయరు. ఎందుకంటే అసత్యాలు, అర్ధసత్యాలే తమకు అనుకూలంగా ఉంటాయి కనక!!.



ఇది కాదూ... దమనకాండకు అర్థం!

'దళితులుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా?' అనేది ముఖ్యమంత్రిగా ఉన్నపుడు సాక్షాత్తూ చంద్రబాబు నాయుడు వేసిన ప్రశ్న. ఈ ఒక్కటి చాలు... చంద్రబాబు మనసులో దళితులకున్న స్థానమేంటో చెప్పడానికి. చేతల్లోనూ బాబు హయాంలో దళితులపై ఏ స్థాయిలో దమనకాండ జరిగిందో సాక్షాత్తూ కేంద్ర హోం శాఖ వెల్లడించే నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికే చెబుతోంది. కాకపోతే... దీన్లోని వాస్తవాలను 'ఈనాడు' చెప్పదంతే!. అవేంటంటే...

టీడీపీ హయాంలో కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో దళితులపై దాడులు తగ్గాయని, రాష్ట్రంలో ప్రస్తుతం దళితుల భద్రతకు పూర్తి భరోసా లభిస్తోందని ఎన్‌సీఆర్‌బీ గణాంకాలతో నివేదించింది. దీనిప్రకారం చూస్తే...

నాడు... టీడీపీ హయాంలో...

2014– 2018 మధ్య రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై 17,091 నేరాలు జరిగాయి. అంటే... సగటున ఏడాదికి 3,418 ఘటనలు. అంతేకాదు! మొత్తం ఘటనల్లో ఎస్సీ, ఎస్టీలపై జరిగినవి ఏకంగా 31 శాతం!!. రాష్ట్రంలో దళితులపై 2014లో 4,114 దాడులు, 2015లో 4,415 దాడులు, 2016లో 2,335 దాడులు జరగడం నాటి దారుణ పరిస్థితికి నిలువుటద్దం.

ప్రస్తుత ప్రభుత్వ హయాంలో...

రాష్ట్రంలో 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాటి నుంచి 2021 వరకు తీసుకుంటే... ఈ మూడేళ్లలో దళితుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడంతో పాటు.. రాష్ట్రంలో హోంశాఖ బాధ్యతలనూ దళిత మహిళకే అప్పగించారు సీఎం వైఎస్ జగన్. ఫలితం.. 2019– 21 మధ్య మూడేళ్లలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరిగిన దాడుల సంఖ్య 7,046. అంటే... సగటున ఏడాదికి 2,348 ఘటనలు. టీడీపీ హయాంతో పోలిస్తే దాదాపు 32 శాతం తగ్గుదల. రాష్ట్రంలో మొత్తం నేర ఘటనల్లో ఎస్సీ, ఎస్టీలపై జరిగిన ఘటనల శాతం కూడా 31 నుంచి 21 శాతానికి తగ్గింది. ఈ పచ్చి నిజాన్ని రామోజీ చస్తే చెప్పరు.

క్రైమ్ రేట్‌లో నాడు... నేడు

- టీడీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై జరిగిన నేరాల శాతం రాష్ట్రంలో అత్యధికం. 2014లో దేశంలో మొత్తం నేరాల్లో దళితులపై జరిగినవి 23.4 శాతం కాగా... ఏపీలో ఇది ఏకంగా 48.7 శాతం. ఇక 2015లో దేశంలో ఇది 22.3 శాతం కాగా... ఏపీలో ఏకంగా 52.3 శాతం. బాబు హయాంలో దళితుల దుస్థితిని చెప్పటానికి ఇంతకన్నా లెక్కలు అక్కర్లేదేమో!!.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దళితులపై క్రైమ్‌రేట్ గణనీయంగా తగ్గింది. 2020లో దేశంలో దళితులపై క్రైమ్‌రేట్ 25 శాతం కాగా ఏపీలో ఇది 23 శాతం. ఇక 2021లో దేశంలో ఇది 25.3 శాతం కాగా... ఏపీలో 23.8 శాతం.

ఏపీలో నేరాలు తగ్గినా కనిపించవా..?

- దేశం మొత్తమ్మీద ఎస్సీ, ఎస్టీలపై జరిగిన నేరాల్లో ఏపీ వాటా చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అత్యధికం. 2014లో దేశవ్యాప్తంగా ఎస్సీలపై జరిగిన నేరాల్లో 8.1 శాతం ఏపీలోనే జరిగాయి. ఇక 2015లో ఇది 9.2 శాతం.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2019లో ఇది 4.4శాతం, 2020లో 3.9 శాతం, 2021లో 3.95 శాతంగా ఉన్నాయి. కాకపోతే 'ఈనాడు' ఇవేమీ రాయదు. 2021లో దేశవ్యాప్తంగా ఎస్సీలపై జరిగిన నేరాల్లో ఏపీలోనే 3.95 శాతం జరిగాయని, ఇది అత్యంత దారుణమని రాసేస్తారు. బాబు హయాంలో ఇది ఏకంగా 9.2 శాతం ఉందని మాత్రం చెప్పరు. మరీ ఇంత దారుణమా రామోజీ?

నాడు రెండో స్థానం... నేడు పదో స్థానం

టీడీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్... దళితులపై దాడుల్లో ఏకంగా దేశంలో తొలి రెండు స్థానాల్లో ఉండేది. 2014లో ఏపీది మూడో స్థానం కాగా... 2015లో రెండోస్థానం. కానీ వైఎస్ జగన్ హయాంలో 2019లో ఏపీ 9 స్థానంలోను... 2020, 2021లలో పదో స్థానంలోనూ ఉంది. దీనర్థం దళితులపై దాడులు పూర్తిగా తగ్గాయని. మరి దీన్నెందుకు 'ఈనాడు' రాయదు?

నాడు నిర్లక్ష్యం... నేడు సత్వర దర్యాప్తు

ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసుల్ని బాబు ప్రభుత్వం పట్టించుకుంటే ఒట్టు. దాడులకు తెగబడే వారి కొమ్ముకాస్తూ దర్యాప్తును ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేసేది. 2014లో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరిగిన దాడుల దర్యాప్తునకు సగటున 611 రోజులు పడితే... 2015లో 518రోజులు, 2016లో 453 రోజులు పట్టాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇది గణనీయంగా తగ్గింది. ఈ కేసుల దర్యాప్తునకు సగటున 2019లో 259 రోజులు, 2020లో 163రోజులు, 2021లో 97 రోజులు పట్టాయంటే... ఈ ప్రభుత్వ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. 2021లో ఎస్సీ, ఎస్టీలపై దాడుల ఘటన విచారణకు సగటున 83 రోజులే పట్టాయి కూడా!!.

ఛార్జిషీట్లు దాఖలు చేయటంలోనూ అంతే!. కేంద్రం నిర్దేశించిన 60 రోజుల గడువులోగా... 2014, 2015లో 15శాతం కేసుల్లో, 2016లో 16శాతం, 2017లో 20 శాతం కేసుల్లో మాత్రమే చార్జిషీట్లు వేయగలిగారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2020లో 60 శాతం కేసుల్లో , 2021లో 61 శాతం కేసుల్లో 60 రోజుల్లోనే చార్జిషీట్లు వేశారంటే పరిస్థితి అర్థంకాక మానదు.

బాధితులకు పరిహారంలోనూ...

దాడుల బాధితులైన ఎస్సీ, ఎస్టీలకు నష్టపరిహారం ఇవ్వటంలోనూ చంద్రబాబు ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించలేకపోయింది. టీడీపీ ప్రభుత్వంలో 2014 నుంచి 2019 వరకు బాధిత ఎస్సీ, ఎస్టీలకు రూ.52.32 కోట్ల నష్టపరిహారం అందించగా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ మూడేళ్లలోనే 2019–21 మధ్య పరిహారాన్ని గణనీయంగా పెంచి బాధితులకు రూ.87.70కోట్ల పరిహారం పంపిణీ చేసింది. ఇలా ఏ రకంగా చూసినా... దమనకాండ ఎవరి హయాంలో జరిగిందో, దగ్గరకు తీసుకుంటున్నదెవరో తేలిగ్గానే తెలుస్తుంది. తెలియనట్టు నటించేదల్లా ఒక్క రామోజీరావు మాత్రమే!!.

టీడీపీ నేతల బరితెగింపు

- రాత్రి సమయంలో బలహీన వర్గాలకు చెందిన వారి ఇంట్లోకి చొరబాటు
- మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మాజీ ఎమ్మెల్యే ఉన్నం కుమారులు
- అడ్డొచ్చిన దళిత యువకుడిపై దాడి
- గ్రామస్తుల తిరుగుబాటుతో వెనుదిరిగిన వైనం
- ఉన్నం బ్రదర్స్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



అనంతపురం జిల్లా శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో మంగళవారం రాత్రి దౌర్జన్యానికి వచ్చిన టీడీపీ నేత ఉన్నం మారుతీచౌదరి

కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ నేతలు బరి తెగించారు. మంగళవారం రాత్రి బలహీన వర్గాలకు చెందిన వారి ఇళ్లల్లోకి బలవంతంగా చొరబడి దౌర్జన్యం చేశారు. అడ్డొచ్చిన మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ నానా దుర్భాషలాడారు. సోషల్ మీడియాలో వచ్చిన కథనాన్ని సాకుగా తీసుకుని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారులు ఉన్నం మారుతీ చౌదరి, ఉన్నం ఉదయ్ భాస్కర్ చౌదరితో పాటు పలువురు ఆ పార్టీ నాయకులు అలజడి సృష్టించారు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 2019 సంవత్సరంలో రైతులకు ఉచితంగా సబ్‌మెర్సిబుల్ మోటార్లు పంపిణీ చేశారు. అప్పట్లో మిగిలిపోయిన మోటార్లు ప్రస్తుతం కర్ణాటకకు తరలుతున్నాయంటూ తాజాగా సోషల్‌మీడియాలో ఓ పోస్టు వచ్చింది. దీంతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారులు ఉన్నం మారుతీ చౌదరి, ఉన్నం ఉదయ్ చౌదరితో పాటు ఆ పార్టీ నాయకులు హైడ్రామాకు తెర తీశారు. మోటార్లు తరలుతున్న వాహనాన్ని ఉన్నం మారుతీ చౌదరి వెంబడించినట్లు, అది కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని శెట్టూరు మండలం లక్ష్మంపల్లికి వెళ్లినట్లు కట్టుకథ అల్లారు. సోదరుడు ఉన్నం ఉదయ్ భాస్కర్ చౌదరి, మరికొందరు టీడీపీ నాయకులతో కలసి మారుతీ చౌదరి నేరుగా లక్ష్మంపల్లిలోని బలహీన వర్గానికి చెందిన వడ్డే శారదమ్మ ఇంటి వద్దకు చేరుకున్నాడు. దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడుతున్న టీడీపీ నేతలను శారదమ్మ, కుటుంబ సభ్యులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వారిని టీడీపీ నేతలు అసభ్య పదజాలంతో దూషిస్తూ లోపలికి చొరబడ్డారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన స్థానిక దళిత యువకుడు విరుపాక్షిని కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. గాయపడిన అతను ప్రస్తుతం ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు శారదమ్మ ఇంటి వద్దకు చేరుకుని టీడీపీ నేతలను నిలదీశారు. రాత్రి సమయంలో ఇంట్లోకి ఎలా చొరబడతారని, మహిళల పట్ల ఎలా ప్రవర్తించాలో కూడా తెలియదా అంటూ మండిపడ్డారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. దీంతో వారు అక్కడి నుంచి వెనుదిరిగారు. కాగా, కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, ఎస్‌ఐ యువరాజ్ బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి లక్ష్మంపల్లిలో పర్యటించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉన్నం బ్రదర్స్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



పోలీసుల అదుపులో ఉన్నం మారుతీ చౌదరి, నేతలు

ఉన్నం మారుతీ చౌదరి, ఉన్నం ఉదయ్ భాస్కర్ చౌదరితో పాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ బి.శ్రీనివాసులు వెల్లడించారు. మంగళవారం రాత్రి జరిగిన ఘటనపై వడ్డే శారదమ్మ, హరిజన విరుపాక్షి ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు ఉన్నం మారుతీ చౌదరి, ఉన్నం ఉదయ్ భాస్కర్ చౌదరి, యర్రంపల్లి సత్తి, గొల్ల వెంకటేశులు, కైరేవు తిమ్మరాజు, కరిడిపల్లి రంగప్పలతో పాటు మరో పదిమందిపై 147, 148, 354, 422 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఉన్నం మారుతీ చౌదరితో పాటు టీడీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కాగా, తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ నాయకులు కౌంటర్ కేసుకు తెర తీశారు. ఉన్నం మారుతీ చౌదరి ఆదేశాల మేరకు టీడీపీ నాయకుడు కరిడిపల్లి రంగప్ప తననూ కులం పేరుతో దూషించి, దాడికి యత్నించారంటూ బాధితులపైనే బుధవారం మధ్యాహ్నం శెట్టూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

దుష్ప్రచారమే 'ఈనాడు' అజెండా

అసత్యాలు, అర్ధసత్యాలే 'ఈనాడు' ఎజెండా అన్నది తెలియనిదేమీ కాదు. దీన్ని కొనసాగిస్తూ 'దళితులపై దమనకాండ' కథనంలోనూ పలు సంఘటనలను ప్రస్తావించారు రామోజీరావు. కాకపోతే ఆ సంఘటనలన్నిట్లోనూ వాస్తవాలను తనకు నచ్చినట్లుగా వక్రీకరించారు. ప్రభుత్వానికి సంబంధం లేకున్నా... అంతా ప్రభుత్వ తప్పిదమే నన్నట్లుగా రాసి విషంగక్కారు. ఆయా సంఘటనల్లోని వాస్తవాలు ఇవీ...

- శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం కాలపర్తికి చెందిన దళితుడు మురపాక మహేశ్ భార్య శ్రీదేవి కుటుంబ కలహాలతో 2022 సెప్టెంబరు 4న ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు మహేశ్‌ను విచారించారు. భార్య ఆత్మహత్యతో మనస్తాపానికి గురైన మహేశ్ 2022 సెప్టెంబరు 6న తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి ప్రభుత్వంతో ముడి పెట్టడం ఎంత వరకు కరెక్టు?
- చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం బోయకొండలో దళిత దంపతులు ఆవుల నరసమ్మ, కృష్ణమూర్తి టీడీపీ కార్యకర్తలు. బీసీ వర్గానికి చెందిన పాళెం శ్రీనివాసులు, రమణమ్మ దంపతులు కూడా టీడీపీ వారే. ఆ రెండు కుటుంబాల మధ్య భూవివాదం ఉంది. ఒకరోజు పాళెం శ్రీనివాసులు దంపతులు... నరసమ్మ, కృష్ణమూర్తిలపై రోడ్డుపైనే దాడికి పాల్పడ్డారు. ఇక్కడ దాడికి గురైంది, దాడి చేసిందీ టీడీపీ వారే. కానీ వైఎస్సార్‌సీపీ వర్గీయులు దళితులపై దాడి చేశారనే తన మార్కు అబద్ధంతో 'ఈనాడు' కథనాన్ని వండేసింది.
- సామర్లకోట బలుసులపేటకు చెందిన మహిళ దువ్వా మల్లిక వార్డు వలంటీర్‌గా చేస్తున్నారు. 2022, జనవరి 1న ఆమె పింఛన్ల పంపిణీకి వెళుతుండగా ఆలపు గిరిశ్ బాబు అనే దళితుడు దారిలో అడ్డగించి అసభ్యంగా ప్రవర్తించాడు. పింఛన్ సొమ్మును లాక్కోబోవటంతో మల్లిక ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో సురేశ్‌బాబు జనవరి 5న ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై దళిత సంఘాలు ఆందోళన చేయడంతో సీఐ, ఎస్సైలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇందులో వైఎస్సార్‌సీపీ నేతల ప్రమేయం ఏమీలేదు. ఆరోపణలొచ్చిన పోలీసులు సస్పెండ్ అయ్యారు. కానీ వైఎస్సార్‌సీపీ నేతల ఒత్తిడితోనే గిరీశ్‌ను పోలీసులు వేధించారని ఈనాడు అభూతకల్పనలను ప్రచురించింది.
- ప్రకాశం జిల్లా ములగంపాడులో యువకుల మధ్య ఘర్షణను దళితులపై దాడిగా ఈనాడు వక్రీకరించింది. ఎందుకంటే దాడి చేసిన వారిలోనూ దళితులున్నారు. వెంకటేశ్వర కాలనీలో 2022, జూలైలో యువకుల మధ్య బైక్ మీద ఫీట్స్‌తో చెలరేగిన వివాదం తీవ్రమైంది. ఇరు వర్గాల యువకులూ పరస్పరం దాడులు చేసుకున్నారు. 14 మంది యువకులు తమ ప్రత్యర్థి యువకులపై తెల్లవారుజామున కర్రలతో దాడి చేసి 10మందిని గాయపరిచారు. దాడి చేసిన వారిలో ఐదుగురు దళితులు, ఇద్దరు ముస్లింలు, ఐదుగురు బీసీలు, ఒక బలిజ, ఒక రెడ్డి సామాజికవర్గానికి చెందినవారు ఉన్నారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇది రెండు బ్యాచ్‌లకు చెందిన యువకుల మధ్య ఘర్షణే తప్ప...దళితులపై దాడి కాదు.
- ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలం ఏకునాంపురం గ్రామానికి చెందిన దాసరి వెంకటరమణ హత్యకు పూర్తిగా వ్యక్తిగత విభేదాలే కారణం. అదే గ్రామానికి చెందిన ఆది లక్ష్మమ్మతో పొలం వివాదం ఉంది. చింతకాయలు కోసారని తరచూ గొడవ పడుతుండేవారు. ఓ సారి ఘర్షణ తీవ్రమై ఆది లక్ష్మమ్మ ముగ్గురు కొడుకులు గురువర్ధన్(18), ఏడుకొండలు(17), భాను చంద్ర(12) రమణయ్యపై దాడి చేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన రమణయ్య మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు. ఇది పూర్తిగా వ్యక్తిగత వివాదం. అయినా సరే ఈ ఉదంతాన్ని వక్రీకరించి ఈనాడు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు యత్నించింది.
- అనకాపల్లి జిల్లాలో వివాహేతర సంబంధంతో జరిగిన హత్యను కూడా ప్రభుత్వానికి ఆపాదించడం 'ఈనాడు' దిగజారుడుతనానికి పరాకాష్ఠ. పాయకరావుపేట మండలం పిఎల్ పురంలో 2022 మార్చి 28న వల్లమూరి నాగేంద్ర అనే దళిత యువకుడు హత్యకు గురయ్యాడు. నాగేంద్ర ఒక మహిళను వేధిస్తుండటంతో ఆమెతో సన్నిహిత సంబంధం కలిగిన మరో వ్యక్తి అతన్ని హత్య చేశాడు. నిందితులను అరెస్ట్ చేశారు కూడా.
- విశాఖపట్నం జిల్లా పెందుర్తిలోని సుజాత నగర్‌లో నివసించే బిగ్‌బాస్ ఫేమ్ నూతన్‌నాయుడు... తన సెల్‌ఫోన్ దొంగతనం చేశాడనే కారణంతో డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత యువకుడు కర్రి శ్రీకాంత్‌కు శిరోముండనం చేశారు. ఫిర్యాదు రావడంతో పోలీసులు తక్షణం స్పందించి నూతన్ నాయుడిని, ఆయన భార్యను 12 గంటల్లోనే అరెస్టు చేశారు. మరి దీన్లో ప్రభుత్వ తప్పిదం ఎక్కడుంది?
- పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన దళిత ఆక్వా రైతు బూరగ నాగేశ్వరరావు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నారు. తాహతుకు మించి అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. నాగేశ్వరరావు దగ్గర పనిచేసే దళిత యువకుడు సురేష్‌కు.. పిట్టలు కాల్చే తుపాకి చేతిలో పేలి గాయమైంది. అతని వైద్యం కోసం నాగేశ్వరరావు రూ.70వేలు ఖర్చు పెట్టారు. తనకు 10 లక్షలు పరిహారం ఇవ్వాలని నాగేశ్వరరావుపై సురేశ్ కేసు పెట్టారు. గ్రామ పెద్దల ద్వారా సమస్య పరిష్కారం కాకపోవటంతో అంత డబ్బు చెల్లించలేక నాగేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిక్కూడా వక్ర భాష్యాలా?
- దళితులను టీడీపీ నేతలు హత్య చేసినా సరే వైఎస్సార్‌సీపీకి ఆపాదించేందుకు బరితెగించడం ఈనాడు దుర్నీతికి నిదర్శనం. గుంటూరు జిల్లా పొన్నూరులో బర్న బసు అనే దళితుడిని టీడీపీ నేతలు హత్య చేయించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కుర్రా వాసు, రెండో నిందితుడు తాళ్లపాలెం శ్రీను టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అనుచరులు. వారిద్దరిని కోర్టులో హాజరుపరిచినప్పుడు 250మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు అక్కడకు వచ్చారు. వాస్తవం అలా ఉంటే... వైఎస్సార్‌సీపీ నేతలు ఈ హత్య చేశారని రాయడం ఈనాడు పన్నాగం.

> నెల్లూరు జిల్లా కావలికి చెందిన దళిత యువకుడు దుగ్గిరాల కరుణాకర్ ఆత్మహత్యపైనా ఈనాడు అవాస్తవాలే వండివార్చింది. కరుణాకర్‌కు అప్పులిచ్చిందీ... తరవాత అప్పు తీర్చలేదని ఆయన ఇంటిని రాయించుకుని వేధించిందీ టీడీపీ నేతలే. కావలిలోని మందాటి చెరువులో చేపలు పట్టుకునేందుకు వీలుగా నీటిని కిందకు వదలటానికి రైతులు సమ్మతించలేదు. వాస్తవానికి ఆ చేపల చెరువులో చేపల పెంపకానికి లక్ష్మీపురం గ్రామానికి చెందిన మత్స్యకారుల సొసైటీ ప్రభుత్వం నుంచి అనుమతి పొందింది. సొసైటీలో కరుణాకర్ సభ్యుడు కాదు. కానీ ఆ చెరువులో చేపలు పట్టేందుకు వీలుగా నీటిని కిందకు విడిచిపెట్టాలని ఆయన రైతులను కోరారు. వారు కాదన్నారు. ఇక టీడీపీ నేతలకు అప్పు చెల్లించలేననే ఆందోళనతో కరుణాకర్ ఆత్మహత్య చేసుకున్నారు. దీన్ని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరి దీన్లో వైఎస్సార్‌సీపీ నేతల ప్రమేయమెక్కడుంది?

> నెల్లూరు జిల్లా కావలికి చెందిన పైడి హర్ష అనే దళితుడి రేషన్ దుకాణాన్ని తొలగించడంతో అతను ఆత్మహత్యకు యత్నించినట్టు ఈనాడు ప్రచురించిన కథనం పూర్తిగా అబద్ధం. ఎందుకంటే అతనికి రేషన్ దుకాణమే లేదు. టీడీపీ నేతలు తమ కార్యకర్త పైడి హర్షతో ఈ డ్రామా ఆడించారు. టీడీపీ నేతల డ్రామా మేరకు... అతను వైఎస్సార్ సీపీలో చేరేందుకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని కలిశారు. కానీ స్థానిక నేతలు సమ్మతించలేదు. దాన్నే ఎమ్మెల్యే అతనికి చెప్పారు. అప్పటికే అతనిపై బిట్రగుంట పోలీస్ స్టేషన్లో పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన కేసు నమోదైంది. దీంతో చంద్రబాబు కావలికి రానున్నారని తెలిసి... టీడీపీ నేతల ఎదుట పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు డ్రామా ఆడారు. టీడీపీ నేతలు వారించినట్లు నటించారు. ఇదంతా స్క్రిప్టు ప్రకారం నడిచిన కథ. దీన్ని కూడా రాసేస్తే ఎలా రామోజీ?

> నెల్లూరు జిల్లా కందమూరుకు చెందిన దళితుడు ఉదయగిరి నారాయణ ఆత్మహత్యనూ ఈనాడు వక్రీకరించింది. ఓ దొంగతనం కేసులో నిందితుడైన నారాయణను పోలీసులు విచారించారు. అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని చెప్పి పంపేశారు. మరోసారి పిలుస్తారన్న భయంతో నారాయణ ఆత్మహత్య చేసుకున్నారు. దళిత సంఘాల ఫిర్యాదు మేరకు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్ జి. సునీల్‌కుమార్ గత ఏడాది ఆగస్టులో విచారణ జరిపారు. నారాయణను పోలీసులు కొట్టలేదని విచారణలో తేలింది. దాంతో పోలీసులపై ఎలాంటి చర్యలనూ కమిషన్ సిఫార్సు చేయలేదు.

- వైఎస్సార్ జిల్లా లింగాల మండలంలో హత్యకు గురైన ఓ దళిత మహిళపై అత్యాచారం జరిగినట్టుగా టీడీపీ నేతలు రాద్ధాంతం చేశారు. అత్యాచారం జరగలేదని పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. టీడీపీ నేతలు మాత్రం అత్యాచారం జరిగిందని ప్రచారం చేస్తూ ధర్నా చేయడంతో తాము తీవ్ర మనస్తాపానికి గురైనట్లు హతురాలి కుటుంబీకులు టీడీపీ నేతలపై కేసు పెట్టారు. దాంతో పోలీసులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డితోపాటు ధర్నా చేసిన 14మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆ 14మందిలో ఉన్న ఇద్దరు దళితులకు ఆ సెక్షన్లు వర్తించవని కూడా పేర్కొన్నారు. ఇదేమీ చెప్పకుండా... టీడీపీకి చెందిన ఇద్దరు దళిత నేతలపైనే అట్రాసిటీ కేసు పెట్టారంటూ 'ఈనాడు' శివాలెత్తింది.
- దళితులు, మహిళలపై దాడికి పాల్పడిన టీడీపీ నేతలపై కేసు పెట్టడం కూడా తప్పన్నట్టుగా ఈనాడు వాదించడం విడ్డూరమే. 2020 అక్టోబరు 11న మంగళగిరి మండలంలోని కృష్ణాయపాలెంలో ఆ గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా ర్యాలీ చేస్తున్న దళితులు, మహిళలపై కృష్ణాయపాలెం వద్ద మూకుమ్మడి దాడికి తెగబడ్డారు. కులం పేరుతో దూషిస్తూ, మహిళలపై దాడి చేశారు. దళితులు, మహిళల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి 18మంది టీడీపీ నేతలు, కార్యకర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అందులో తప్పేముందో మరి ఈనాడుకే తెలియాలి.

విజయవంతంగా సారెక్స్ - 2023

- మాక్ డ్రిల్‌తో సత్తా చాటిన తీరప్రాంత రక్షణ దళం



అధిక పీడనంతో ప్రమాదం వాటిల్లో నీటిలో పడిపోయిన వారిని హెలికాప్టర్ ద్వారా రక్షించేందుకు సముద్రంలోకి దిగుతున్న కోస్ట్‌గార్డ్

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లా సముద్ర తీరంలో సారెక్స్–2023 పేరిట మాక్ డ్రిల్‌ను భారత తీరప్రాంత రక్షణ దళం (ఇండియన్ కోస్ట్ గార్డ్) బుధవారం విజయవంతంగా నిర్వహించింది. సముద్రపు ఒడ్డుకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో చమురు నౌకలో అగ్ని ప్రమాదం జరిగితే మంటలను అదుపులోకి తెచ్చి సిబ్బందిని రక్షించడం, సముద్రపు నీటిలో అధిక పీడనంతో ప్రమాదం సంభవించి నౌకపైకి వెదజల్లడంతో సముద్రంలో పడిపోయిన వారిని స్పీడ్ బోట్లతో రక్షించడం, చేతక్ హెలికాప్టర్‌తో గజ ఈతగాళ్లను సముద్రంలోకి దింపి వారిని మెడికల్ నౌకలోకి చేర్చడం వంటి విన్యాసాలు ప్రదర్శించారు. రిమోట్‌తో పనిచేసే లైఫ్ బోట్లు ఆకర్షణగా నిలిచాయి. ఇండియన్ కోస్ట్‌గార్డ్–రీజనల్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఎక్సర్‌సైజ్ (సారెక్స్–2023) మాక్ డ్రిల్ విజయవంతమయ్యిందని కాకినాడ కోస్ట్ గార్డ్ స్టేషన్ కమాండెంట్ టీఆర్‌కే రావు తెలిపారు. ఎక్సర్ సైజ్‌లో ఐసీజీఎస్ సముద్ర పహెరెదార్, ఐసీజీఎస్ విగ్రహ, ఐసీజీఎస్ కనకలత బారువా, ఐసీజీఎస్ ప్రియదర్శిని, చార్లీ 430, చార్లీ 438, చార్లీ 449 నౌకలు పాల్గొన్నట్లు తెలిపారు. సారెక్స్–2023 ఎక్సర్‌సైజ్‌లు వివిధ శాఖల సమన్వయంతో విజయవంతమయ్యాయని డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

విజయవాడ-కువైట్ విమాన సర్వీస్ ప్రారంభం



కువైట్‌కు బయలుదేరిన విమానం

గన్నవరం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) నుంచి కువైట్‌కు ఎయిరిండియా విమాన సర్వీస్‌లు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తిరుచినాపల్లి నుంచి ఇక్కడికి వచ్చిన బోయింగ్ 737–800 విమానం ఉదయం 9.55 గంటలకు బయలుదేరి కువైట్ వెళ్లింది. ఈ విమానం కువైట్ నుంచి రాత్రి 8.35 గంటలకు ఇక్కడికి చేరుకుంది. ఈ విమానం ప్రతి బుధవారం తిరుచినాపల్లి నుంచి వయా గన్నవరం మీదుగా కువైట్‌కు వెళ్లి వస్తుందని ఎయిరిండియా ప్రతినిధులు తెలిపారు.

ప్రయాణికులకు 'ఎయిరిండియా' షాక్

ఈ విమాన సర్వీస్‌లో కువైట్ వెళ్లాల్సిన 17 మందికి ఎయిరిండియా షాక్ ఇచ్చింది. తొలుత ఈ సర్వీస్‌కు బుక్ చేసుకున్న ప్రయాణికులకు విమానం బయలుదేరే సమయం మధ్యాహ్నం 1.10 గంటలుగా తెలిపింది. తర్వాత విమానం బయలుదేరే సమయాన్ని ఆ సంస్థ ఉదయం 9.55 గంటలకు రీషెడ్యూల్ చేసింది. రిషెడ్యూల్ చేసిన విషయం తెలియకపోవడంతో వారంతా మధ్యాహ్నం 11 గంటలకు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. అప్పటికే విమానం కువైట్‌కు బయలుదేరిన విషయం తెలుసుకుని షాక్‌కు గురయ్యారు. దీనిపై ఎయిరిండియా ప్రతినిధులను గట్టిగా ప్రశ్నించారు. కువైట్‌కు వెళ్లడానికి తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. అయితే విమాన ప్రయాణ సమయం రీషెడ్యూల్ చేసిన విషయాన్ని సమాచారం రూపంలో సదరు ప్రయాణికుల సెల్‌ఫోన్లకు పంపినట్లు ఎయిరిండియా ప్రతినిధులు తెలిపారు. అయితే సదరు ప్రయాణికులు సెల్ నంబర్లు బుకింగ్ ఏజెంట్లు, కువైట్ నంబర్లు ఇవ్వడం వల్ల సమాచార లోపం ఏర్పడిందన్నారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు వచ్చే వారం కువైట్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రతినిధులు తెలిపారు.

కాణిపాకం ఆలయంలోకి సెల్‌ఫోన్‌లు అనుమతి లేదు

- అధికారులు, సిబ్బందితో పాటు ఎవరూ తీసుకెళ్లరాదు
- ఏప్రిల్ 1 నుంచి అమలు



యాదమరి (చిత్తూరు జిల్లా): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు ఎవరికి అనుమతులు ఉండవని ఆలయ ఈవో వెంకటేశు తెలిపారు. దీన్ని ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్నట్లు బుధవారం చెప్పారు. ప్రస్తుతం ఆలయంలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్లు తమ వెంట తీసుకెళ్తున్నారు. దీంతో కొందరు భక్తులు ఆలయంలో విధులు నిర్వహించే వారికి ఒక నిబంధన, భక్తులకు ఒక నిబంధనా అని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తిరుమల తరువాత జిల్లాలో కాణిపాక ఆలయం ప్రముఖ ప్రసిద్ధి దేవాలయంగా విరాజిల్లుతోందని, ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి ఆలయంలోకి ఎవరు సెల్‌ఫోన్లు తీసుకరాకూడదని ఆంక్షలు పెడుతున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది, ఎవ్వరైనా ఆలయం లోపల ఫోన్ మాట్లాడుతున్నట్లు సీసీ కెమెరాల్లో నమోదైతే రూ.500 అపరాధం వేస్తామని తెలిపారు. ఆతర్వాత మళ్లీ ఆలయంలో సెల్‌ఫోన్లు ఉపయోగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారం నమ్మొద్దు

- ఎస్టీలకు వైఎస్సార్‌సీపీ నేత హనుమంతు నాయక్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానంపై టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఎస్టీలకు వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్ విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బోయ, వాల్మీకి కులాలు సీఎం జగన్ వెంట నిలుస్తాయనే అక్కసుతో ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తూ.. ఎస్టీలను రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. ప్రస్తుతం ఎస్టీలుగా ఉన్న వారికి అన్యాయం జరగకుండా చూస్తానని సీఎం జగన్ చెప్పారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు కనీసం గిరిజన సలహా మండలి కూడా ఏర్పాటు చేయలేదని.. గిరిజనుల అభివృద్ధిపై తీవ్ర నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. తన పాలనా కాలంలో చివరి వరకు కూడా గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వలేదని దుయ్యబట్టారు. కానీ వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఎస్టీ మహిళకు మంత్రివర్గంలో చోటు కల్పించడమే కాకుండా ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని చెప్పారు. గిరిజన సలహా మండలితో పాటు మెడికల్ కాలేజీ ఏర్పాటు.. ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

మిత్రుడికి ముప్పు!

ఏటా 1 - 2 శాతం క్షీణిస్తున్న కీటకాలు

- ప్రమాదపు అంచుల్లో 40 శాతం జాతులు
- మిత్ర కీటకాలతోనే ఆహార పంటల పరాగ సంపర్కం
- పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర



సాక్షి, అమరావతి: పర్యావరణ పరిరక్షణ, ఆహార ధాన్యాల ఉత్పత్తిలో కీటకాల పాత్ర కీలకం. మానవాళి కంటే దాదాపు 17 రెట్లు అధికంగా ఉండే కీటకాల జనాభా ప్రస్తుతం ముప్పు ఎదుర్కొంటోంది. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం కీటక జాతులు తగ్గిపోతున్నాయని, మూడో వంతు అంతరించిపోతున్నట్లు బయోలాజికల్ కన్జర్వేషన్ నివేదిక వెల్లడిస్తోంది. జనావాసాల పెరుగుదల, విచ్చలవిడిగా పురుగు మందులు, ఎరువుల వాడకం, కాలుష్యం, వాతావరణ మార్పుల కారణంగా మిత్ర కీటకాలు నశిస్తున్నాయి. పర్యావరణ నిపుణులు దీన్ని 'కీటకాల అపోకలిప్స్'గా అభివర్ణిస్తున్నారు.

ఆహార చక్రంలో ఎంతో కీలకం



ప్రపంచవ్యాప్తంగా 5.5 మిలియన్ జాతుల కీటకాలు ఉన్నట్లు అంచనా వేయగా ఇప్పటివరకు కేవలం ఒక మిలియన్ జాతులను మాత్రమే గుర్తించారు. భూమిపై జంతు జాలంలో 80 శాతం కీటకాలే ఉండటం గమనార్హం. ఆహార పంటల పరాగ సంపర్కంతో పాటు తెగుళ్ల నియంత్రణ వ్యవస్థలుగా, భూమిని రీసైక్లింగ్ చేసే డీకంపోజర్లుగా పర్యావరణాన్ని కీటకాలు కాపాడుతున్నాయి. ఫిష్ అండ్ వైల్డ్‌లైఫ్ సర్వీస్ నివేదిక ప్రకారం భూమిపై ఉన్న 2.50 లక్షల రకాల పుష్పించే మొక్కలను పరాగ సంపర్కం చేయడంలో లక్ష కంటే ఎక్కువ కీటక జాతుల పాత్ర కీలకం. ఇందులో తేనెటీగలు, కందిరీగలు, సీతాకోక చిలుకలు, ఈగలు, బీటిల్స్ లాంటివి ఉన్నాయి. ఆహార చక్రంలో కీలక పాత్ర పోషించే కీటకాలు ఒక్క అమెరికాలోనే ఏటా 70 బిలియన్ డాలర్ల విలువైన సేవలను అందిస్తున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



ఏటా 1-2 శాతం క్షీణత..

ప్రపంచవ్యాప్తంగా ఏటా 1 నుంచి 2 శాతం కీటకాలు నశిస్తున్నట్లు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. గత 30 ఏళ్లలో కీటకాల సంఖ్య దాదాపు 25 శాతం తగ్గింది. పక్షులు, క్షీరదాలు, సరీసృపాల కంటే కీటకాలు అంతరించిపోయే రేటు ఎనిమిది రెట్లు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. కీటకాల సంఖ్య క్షీణిస్తే ఆహార సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 35 శాతం ఆహార పంటలకు పరాగ సంపర్కమే ఆధారం కావడం కీటకాల మనుగడ ఆవశ్యకతను సూచిస్తోంది.

- మానవులు దాదాపు 2 వేల కీటకాలను ఆహారంగా భుజిస్తారు.
- 75 శాతం కంటే ఎక్కువ కీటకాలు పరాగ సంపర్కంతో ఆహార చక్రాన్ని పరిరక్షిస్తాయి.
- దీని విలువ ఏటా 577 బిలియన్ల డాలర్లు ఉంటుంది.
- ప్రకృతిలో దాదాపు 80 శాతం అడవి మొక్కలు పరాగ సంపర్కం కోసం కీటకాలపై ఆధారపడతాయి.
- గత 150 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 2.50 లక్షల నుంచి 5 లక్షల కీటక జాతులు అంతరించాయి.



ఆస్తి కోసం బాలుడి హత్యకు కుట్ర

- తప్పించుకొని హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించిన బాలుడు
- నిందితులపై చర్యలకు హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు
- వారితోపాటు పల్నాడు కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు జారీ

కర్నూలు(సెంట్రల్): ఆస్తి కోసం 9వ తరగతి చదువుతున్న బాలుడిని హత్య చేసేందుకు ప్రయత్నించిన బంధువుల దుర్మార్గమిది. వారి నుంచి ఆ బాలుడు తప్పించుకుని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ)ను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. వివరాలు ఇవీ..

పల్నాడు జిల్లా వినుకొండలో పామిశెట్టి డేవిడ్ గవర్నమెంట్ బాయ్స్ హైస్కూలులో 9వ తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడి తల్లిదండ్రులు మరణించడంతో గుంటూరులో అమ్మమ్మ దగ్గర పెరిగాడు. ఆమెకు ముగ్గురు సంతానం. అందులో డేవిడ్ తల్లి ఒకరు. మిగిలిన ఇద్దరు కుమారులు. అయితే కుమారులు తల్లిదండ్రులను సరిగా చూసుకోలేదు. సరికదా వారు మంచం పట్టినా పట్టించుకోలేదు. ఆ సమయంలో వారికి మనుమడు డేవిడ్ కొండంత అండగా నిలిచాడు. చుట్టుపక్కల వారి సాయంతో వారిని ఆస్పత్రులకు తీసుకెళ్లడం.. మందులు ఇప్పించడంతోపాటు పరిచర్యలు చేసేవాడు. దీంతో ఆమె తనకున్న పూరింటిని డేవిడ్ పేరిట రాయడంతోపాటు కొంత నగదును బ్యాంకులో డిపాజిట్ చేసింది. దీన్ని సహించలేని ఆమె చిన్న కుమారుడు శ్రీను తల్లి చనిపోవడానికి ముందు తెల్లపేపర్లపై సంతకం చేయించుకోవడమేగాక.. ఆ బాలుడి పేరిట ఉన్న బ్యాంకు పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డు, ఇంటి పట్టాను సైతం తీసుకుని వెళ్లాడు. ఇంటిని అమ్మడానికి ప్రయత్నించగా.. డేవిడ్ సంతకం పెట్టాల్సి ఉండడంతో వీలు పడలేదు. దాంతో బాలుడిపై ఒత్తిడి తెచ్చాడు.. కానీ ఆ బాలుడు ఒప్పుకోకపోవడంతో అతన్ని బలవంతంగా గుంటూరు నుంచి తాముంటున్న వినుకొండకు తీసుకెళ్లి స్కూలులో చేర్పించాడు. అయితే ఆస్తి తమ పేరిట పెట్టాలంటూ బాలుడిని శ్రీను కుటుంబంతోపాటు అతని అన్న కుటుంబం కలసి తీవ్రంగా వేధించారు. దీంతో ఆ బాలుడు వినుకొండ పోలీసులను ఆశ్రయించి.. వారి సాయంతో హాస్టల్‌లో చేరి చదువుకుంటున్నాడు. దీంతో కక్ష గట్టిన బంధువులు శ్రీను, కలశమ్మ, శివ, యశ్వంత్, శివకుమారి, మల్లేశ్వరిలు ఇటీవల బాలుడిని కారుతో గుద్ది చంపేందుకు ప్రయత్నించగా తప్పించుకున్నాడు. నిన్ను విడిచిపెట్టేది లేదని చంపేది ఖాయమంటూ వారు బెదిరించారు. దీంతో ఆ బాలుడు బుధవారం కర్నూలులోని హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించి ప్రాణ రక్షణతోపాటు చదువుకోవడానికి అవకాశం కల్పించాలని వేడుకున్నాడు. బాలుడి పిటిషన్‌ను విచారణకు తీసుకున్న హెచ్‌ఆర్‌సీ చైర్మన్ మంధాత సీతారామమూర్తి, జ్యుడీషియల్ సభ్యుడు దండే సుబ్రమణ్యం నిందితులతోపాటు వినుకొండ పోలీసులు, పల్నాడు జిల్లా ఎస్పీ, కలెక్టర్‌తో పాటు మహిళా అభివృద్ధి, పిల్లల సంరక్షణ శాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. తక్షణమే ఆ బాలుడి సంరక్షణ, రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎవరికీ పట్టని దేవుడి భూములు

- భూములను పరిరక్షించకుండా అధికారులు పాపం చేస్తున్నారు
- 22ఏ నుంచి భూములను తొలగించే అధికారం కమిషనర్‌కు లేదు
- తేల్చి చెప్పిన హైకోర్టు ధర్మాసనం
- కమిషనర్ ఉత్తర్వులు రద్దు.. ట్రిబ్యునల్‌కు వెళ్లాలని ప్రైవేటు వ్యక్తికి స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: దేవుడి భూముల పరిరక్షణ విషయంలో దేవదాయశాఖ అధికారుల తీరును హైకోర్టు తప్పుపట్టింది. దేవుడి భూములను రక్షించాల్సిన అధికారులే వాటిని భక్షించే పరిస్థితి వచ్చిందని ఘాటుగా వ్యాఖ్యానించింది. దేవుడి భూములు ఎవరికీ పట్టకుండా పోయాయంది. దేవుడి భూముల విషయంలో అధికారులు పాపం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసింది. గుంటూరులో ఓ దేవస్థానం భూమిని నిషేధిత భూముల జాబితా (22ఏ) నుంచి తొలగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దుచేసింది. అలాంటి ఉత్తర్వులు జారీచేసే పరిధి కమిషనర్‌కు లేదని స్పష్టం చేసింది. ఒకవేళ ఆ భూములపై తమకు హక్కులున్నాయని ప్రైవేటు వ్యక్తులు భావిస్తుంటే, ఆ హక్కుల కోసం దేవదాయ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. పాత గుంటూరులోని కంచికామాక్షి ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన రెండెకరాల భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హేమందగ గుప్తా, మరో ముగ్గురు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై పలుమార్లు విచారించిన సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కమిషనర్ తీరును తప్పుపట్టింది. నిషేధిత భూముల జాబితా నుంచి దేవదాయ భూములను తొలగించే అధికారం కమిషనర్‌కు లేదని, ఆ విషయం తెలిసి కూడా తనకు లేని పరిధిని ఉపయోగించి కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారని ధర్మాసనం తెలిపింది. కొందరు మంత్రులకు, రాజకీయ నాయకులకు ప్రయోజనం చేకూర్చేలా కమిషనర్ తీరు ఉందని, కమిషనర్‌గా కొనసాగేందుకు ఆయన ఎంతమాత్రం అర్హులు కాదని ఘాటుగా వ్యాఖ్యానించింది. దేవదాయశాఖ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ.. కమిషనర్ ఉత్తర్వులను ఇప్పటికే అబయన్స్‌లో ఉంచామన్నారు. న్యాయసలహా తీసుకున్న తరువాతే కమిషనర్ ఉత్తర్వులు జారీచేసి ఉండాల్సిందని తెలిపారు. దేవదాయ భూముల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగా అధికారులకు మరిన్ని అదనపు అధికారాలు కట్టబెడుతున్నామని, ఇందుకు సంబంధించి మంత్రిమండలి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం స్పందిస్తూ.. రెండెకరాల భూమి విషయంలో కమిషనర్ ఉత్తర్వులను రద్దుచేస్తున్నామని, ఆ భూమిపై హక్కుల కోసం ప్రైవేటు వ్యక్తి దేవదాయ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని స్పష్టం చేసింది.

వైఎస్సార్ జిల్లాలో చుక్కల భూములకు విముక్తి

- నిషేధిత ఆస్తుల జాబితా నుంచి 30,839 ఎకరాల తొలగింపు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లాలో వేలాది మంది రైతులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వం చుక్కల భూములకు విముక్తి కల్పించింది. 30,839 ఎకరాల చుక్కల భూములను 1908 రిజిస్ట్రేషన్ల చట్టంలోని నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ భూములను నిషేధిత ఆస్తుల జాబితా 22 ఏ (1) ఇ (చుక్కల భూములు) నుంచి తొలగిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వివిధ స్థాయిల్లో విచారించి, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత చేసిన ప్రతిపాదనల ఆధారంగా ఈ తొలగింపు చేసినట్లు తెలిపారు. నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించడం వల్ల సంబంధిత భూముల క్రయవిక్రయాలకు ఎటువంటి ఆటంకం ఉండదు. అలాగే వాటిపై బ్యాంకుల నుంచి రుణం పొందేందుకు ఇబ్బందులు ఉండవు. ఇప్పటికే పార్వతీపురం మన్యం, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, శ్రీ సత్యసాయి, తిరుపతి, అనంతపురం జిల్లాల్లోని వేలాది ఎకరాల చుక్కల భూములకు ప్రభుత్వం విముక్తి కల్పిస్తూ జీఓలు జారీ చేసింది.

సేవా మార్గంతోనే సార్థకత

- హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



బాపట్ల అర్బన్: ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆత్మీయత కలిగి ఉండాలని, ఆత్మీయత నుంచే ఆధ్యాత్మికత వస్తుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ద్వేషం, ఈర్ష్యలు మనిషి పతనానికి దారి తీస్తాయని, ధనం, అహంకారం కూడా ఇలాంటివేనని వ్యాఖ్యానించారు. బుధవారం బాపట్ల జిల్లాలోని జిల్లెళ్లమూడి అమ్మవారి శత జయంతి ఉత్సవాలకు దత్తాత్రేయ హాజరయ్యారు. ధనాన్ని మంచికి, చెడుకి రెండిటికి ఉపయోగించవచ్చని, ఆ ధనాన్ని సేవా మార్గంలో నడిపించాలని, అప్పుడే సార్థకత వస్తుందన్నారు. సామాజిక అభివృద్ధే అసలైన అభివృద్ధిగా అభివర్ణించారు. లక్షలాది మంది పేదలకు అన్నం పెట్టిన అన్నపూర్ణ క్షేత్రమైన జిల్లెళ్లమూడి క్షేత్రానికి రావడం తనకెంతో సంతోషం కలిగించిందన్నారు. 70 ఏళ్ల క్రితమే విద్య, వైద్యం ఉచితంగా అందించాలనే సంకల్పం గొప్పదని కొనియాడారు. అమ్మ అనుభవాలు అనే పుస్తకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, విశ్వ యోగి విశ్వంజీ, శ్రీ విశ్వ జననీ పరిషత్ ట్రస్ట్ అధ్యక్షుడు కుమ్మమూరి నరసింహ మూర్తి, మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల కరస్పాండెంట్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సత్సంకల్పంతో దైవ కార్యాలు చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్



జస్టిస్ కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న పూనూరు గౌతంరెడ్డి, గజల్ శ్రీనివాస్

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): సత్సంకల్పంతో దైవ కార్యాలు చేయాలని, లోక కల్యాణార్థం తలపెట్టిన కోటి రుద్రాక్ష అభిషేకంలో పాల్గొనటం తనకు ఆనందంగా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. విజయవాడ ముత్యాలంపాడు షిర్డీసాయి మందిరంలో కోటి రుద్రాక్ష అభిషేకం బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ కృష్ణమోహన్ బాబాకు పూజలు చేసి హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన కోటి రుద్రాక్షలను నేపాల్ నుంచి సేకరించి అభిషేకం చేయడం అభినందనీయమని కొనియాడారు. మందిరం గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతం రెడ్డి మాట్లాడుతూ.. తాము లోక కల్యాణార్థం తలపెట్టిన కోటిరుద్రాక్ష అభిషేకాన్ని విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. ముగింపు కార్యక్రమం జస్టిస్ కృష్ణమోహన్ చేతులమీదుగా జరగడం సంతోషంగా ఉందన్నారు. గజల్ శ్రీనివాస్, ఆలయ కమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

పాలనా వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి

- 913వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పాలనా వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయని, ఓ సామాజిక వర్గం, ఓ ప్రాంతం మాత్రమే ఎదిగితే మిగిలిన ప్రాంతాలు వెనుకబాటుకు గురై రాష్ట్రాభివృద్ధికి విఘాతం తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 913వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. బహుజనుల హక్కులను అడ్డుకుంటున్న బాబుకు వత్తాసు పలుకుతున్న రామోజీ మోసాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని చెప్పారు. బాబును అవినీతి కేసుల్లో అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులపై ఏదో జరిగిపోతున్నట్లు సృష్టిస్తూ ఈనాడులో దళితులపై దమనకాండ పేరుతో కథనాలు ప్రచురించి విషప్రచారం చేస్తున్న రామోజీ రాష్ట్రంలో ఉన్నది లేనట్లు ప్రచారం చేస్తుండడం ఆయన కులగజ్జికి నిదర్శనమన్నారు. భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని సంచలన నిర్ణయాలతో బహుజనులకు సంక్షేమం, అభివృద్ధి చేరువ చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని తెలిపారు. బాబు అండ్ కో చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికీ నమ్మరని గుర్తుంచుకుంటే మంచిదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల: శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో ఈ నెల 30న ఘనంగా ఆస్థానం జరగనుంది. ఆ రోజు సాయంత్రం శ్రీరాములవారు హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతారు. 31న శ్రీవారి ఆలయంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తారు. శ్రీరామనవమి సందర్భంగా గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం హనుమంత వాహనసేవ, రాత్రి బంగారు వాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానాన్ని నిర్వహిస్తారు. ఈ కారణంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. 31న శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సీతారామ లక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవమూర్తులకు సహస్రదీపాలంకార సేవ జరుగుతుంది.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 70,605 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.79 కోట్లను సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 14 గంటల్లో, ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా, శ్రీవారిని బుధవారం రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు దర్శించుకున్నారు.

కాల్పుల్లో గాయపడ్డ వ్యక్తికి చిత్తూరులో చికిత్స



చికిత్స పొందుతున్న మహబూబ్ బాషా

చిత్తూరు అర్బన్: వైఎస్సార్ జిల్లా పులివెందులలో రెండు రోజుల క్రితం జరిగిన కాల్పుల ఘటనలో గాయపడ్డ రాగిపాటి మహబూబ్ బాషా చిత్తూరు నగరంలో చికిత్స తీసుకుంటున్నారు. ఆర్థిక లావాదేవీల కారణంగా భరత్ యాదవ్ అనే వ్యక్తి పులివెందులలో దిలీప్ కుమార్, మహబూబ్ బాషా అనే ఇద్దరిపై మంగళవారం కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో దిలీప్‌కుమార్ మృతిచెందగా.. చేతికి, కాలికి బుల్లెట్ గాయాలు తగిలిన బాషాకు రిమ్స్‌లో చికిత్స అందించారు. అయితే చిత్తూరులో తనకు తెలిసిన వైద్యులు ఉండడంతో బాషాను మంగళవారం అర్ధరాత్రి అక్కడకు తీసుకొచ్చి ఓ ప్రైవేట్ క్లినిక్‌లో చేర్చారు. బుధవారం అతనికి చికిత్స చేసిన వైద్యుడు కాలి భాగంలో ఉన్న పెల్లెట్స్‌ను తొలగించారు. మోచేతికి బుల్లెట్ తీవ్రంగా తగలడంతో ఎముక విరిగినట్లు వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం బాషా కోలుకుంటున్నాడు.

బంగారంపై హెచ్‌యూఐడీ లేకపోతే జైలు శిక్ష, జరిమానా



విజయకుమార్

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏప్రిల్ 1 నుంచి ప్రతి బంగారం వస్తువుపై హెచ్‌యూఐడీ (హాల్‌మార్కు యునిక్ ఐడెంటిఫికేషన్) ఆరు అంకెలు గల నంబరును వ్యాపారస్తులు అందరూ ముద్రించాలని ఏపీ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.విజయకుమార్ చెప్పారు. లేని పక్షంలో ఏడాది జైలుశిక్ష, రూ.1 లక్ష జరిమానాలకు వ్యాపారులు సిద్ధం కావాలని హెచ్చరించారు. బుధవారం ఎలాపల్నాడు జిల్లా నరసరావుపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2 గ్రాముల బరువు లోపు వస్తువులకు హాల్‌మార్కు నంబరు అవసరం లేదన్నారు. వెసులుబాటు కోసం వారం క్రితం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను జాతీయ అసోసియేషన్ ప్రతినిధులు కలిసినా దీన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారని తెలిపారు. మార్చి 31లోపు గల పాత బంగారం వస్తువులపై కూడా హెచ్‌యూఐడీ నంబర్ వేయాలని కేంద్రం సూచించిందన్నారు.

విశాఖలో స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ

సాక్షి, అమరావతి: విశాఖలోని రీజనల్ ఫుడ్ ల్యాబొరేటరీని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీగా నోటిఫై చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు కాలేదు. దీంతో ఆహార తనిఖీల్లో సీజ్ చేసిన నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపుతూ వస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.14.55 కోట్లతో రీజనల్ ల్యాబొరేటరీని స్టేట్ ల్యాబొరేటరీగా అభివృద్ధి చేస్తున్నాయి. ఇందుకోసం గతేడాది ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) రాష్ట్ర ఫుడ్ కమిషన్‌తో ఎంవోయూ కుదుర్చుకుంది.

క్లుప్తంగా..

బెంగాల్‌పై కేంద్రం వివక్ష

మమతా బెనర్జీ ధర్నా



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌పై మోదీ సర్కారు దారుణమైన వివక్ష చూపుతోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. కేంద్ర పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులివ్వడం లేదని ఆరోపించారు. ఇందుకు నిరసనగా బుధవారం కోల్‌కతాలో ఆమె రెండు రోజుల ధర్నా ప్రారంభించారు. పార్టీ సీనియర్ నేతలు ఇందులో పాల్గొన్నారు. పార్టీ తరఫున ధర్నా చేస్తున్నట్టు మమత తెలిపారు.

కేంద్రంలో ఉద్యోగ ఖాళీలు... 9.79 లక్షల పై చిలుకు!

న్యూఢిల్లీ: కేంద్రంలో పలు విభాగాల్లో 9.79 లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉందని ప్రభుత్వం బుధవారం తెలిపింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ''2021 మార్చి 1 నాటికి అన్ని శాఖలు, విభాగాలు, సంస్థల్లో 9.79 లక్షలకుపైగా ఖాళీలున్నాయి. రైల్వేశాఖలోనే 2.93 లక్షలున్నాయి. రక్షణ శాఖలో 2.64 లక్షలు, హోం శాఖలో 1.43 లక్షలు, రెవెన్యూలో 80,243, ఆడిట్–అకౌంట్ విభాగంలో 25,934, అణు ఇంధన శాఖలో 9,460 ఖాళీలున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని ఆదేశించాం'' అన్నారు.

జైపూర్ పేలుళ్ల కేసులో నలుగురు దోషులకు విముక్తి

జైపూర్: 2008 మే 13న జరిగిన జైపూర్ వరుస బాంబు పేలుళ్ల కేసులో కిందికోర్టులో మరణ శిక్ష పడిన నలుగురికి రాజస్తాన్ హైకోర్టు బుధవారం విముక్తి కలిగించింది. దర్యాప్తు సంస్థలు సక్రమంగా విచారణ చేపట్టలేదని ఆక్షేపించింది. ఐదో నిందితుడికి ట్రయల్ కోర్టులో ఇప్పటికే లభించిన విముక్తిని కోర్టు సమర్థించింది. ఐదేళ్ల క్రితం జైపూర్‌లో వరుస బాంబు పేలుళ్లలో 71 మంది మృతిచెందారు. 185 మంది గాయపడ్డారు. ఈ కేసులో 2019 డిసెంబర్‌లో ప్రత్యేక న్యాయస్థానం మొహమ్మద్ సైఫ్, మొహమ్మద్ సల్మాన్, సైఫుర్, మొహమ్మద్ సర్వర్ అజ్మీకి మరణ శిక్ష విధించింది. షహబాజ్ హుస్సేన్ అనే నిందితుడిని నిర్దోషిగా తేల్చింది. మరణ శిక్షను సవాలు చేస్తూ నలుగురు దోషులు రాజస్తాన్ హైకోర్టును ఆశ్రయించారు.

3 కర్ణాటకలో ముక్కలాట!



బీజేపీ..

అనుకూలం..

- ప్రధాని మోదీ ఇమేజ్. కేంద్ర నేతలు చేస్తున్న పర్యటనలు. డబుల్ ఇంజిన్ నినాదం.
- సంఘ పరివార్ సంస్థాగత బలం.
- లింగాయత్ సామాజిక వర్గం మద్దతు, వక్కలిగ అనుకూల వైఖరితో మైసూర్ ప్రాంతంలో పెరుగుతున్న పట్టు.
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు.
- డిజిటల్ మీడియా ప్రచారంలో పార్టీకున్న పట్టు.

వ్యతిరేకం..

- ప్రభుత్వ వ్యతిరేకత, బొమ్మై ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు.
- 40% కమీషన్ల ప్రభుత్వమన్న విపక్షాల ఉధృత ప్రచారం.
- ఎన్నికలకు ముందు మైనార్టీల ఓబీసీ కోటా రద్దుతో ముస్లింలు పార్టీకి మరింత దూరం.
- టికెట్ దక్కే అవకాశం లేని ఆశావహుల అసమ్మతి.

జేడీ(ఎస్)

అనుకూలం..

- వక్కలిగ సామాజిక వర్గం మద్దతు.
- కన్నడ ఆత్మగౌరవం నినాదం మిన్నంటుతున్న వేళ ప్రాంతీయ పార్టీగా ఉన్న ఇమేజ్.
- రైతు అనుకూల విధానాలతో గ్రామీణ ప్రాంతాల్లో పట్టు.
- హంగ్ వస్తే బీజేపీ, కాంగ్రెస్‌ల్లో ఎవరికైనా మద్దతివ్వగల వైఖరి.

వ్యతిరేకం..

- కుటుంబ పార్టీ ముద్ర.
- వక్కలిగ మినహా మిగతా సామాజిక వర్గాల ఆధిపత్యమున్న ప్రాంతాల్లో ఎదగకపోవడం.
- సొంత బలంపై పార్టీ అధికారంలోకి వచ్చే సత్తా లేకపోవడం.. చాలాచోట్ల గెలుపు గుర్రాలు లేకపోవడం.
- 2018 నుంచి పార్టీ నుంచి కొనసాగుతున్న వలసలు.

కాంగ్రెస్

అనుకూలం

- బలమైన స్థానిక నాయకత్వం.
- బీజేపీ హిందుత్వ ఎజెండాను ఎదుర్కోవడానికి అనుసరిస్తున్న అహిందా (మైనార్టీలు, వెనుకబడిన తరగతులు, దళితుల) సోషల్ ఇంజనీరింగ్ విధానంతో. తద్వారా వర్గాల ఓటు బ్యాంకును ఆకట్టుకునే ప్రయత్నం.
- బీజేపీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలపై పేసీఎం, 40% కమీషన్ అంటూ చేస్తున్న ప్రచారం.
- కర్నాటకకు చెందిన దళిత నేత మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడయ్యాక వస్తున్న తొలి ఎన్నికలు కావడంతో ఆ వర్గం ఓటు బ్యాంకును కొల్లగొట్టే అవకాశం.
- గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్రాడ్యుయేట్లకు రూ.3,000 నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,000 ఆర్థిక సాయం వంటి హామీలు.

వ్యతిరేకం

- శివకుమార్, సిద్దరామయ్య వర్గాల మధ్య పోరు.
- జి.పరమేశ్వర, హెచ్.కె.పాటిల్, కె.హెచ్.మునియప్ప వంటి నేతల్ని పక్కన పెట్టడంతో అసమ్మతి. కీలకమైన లింగాయత్ సామాజిక వర్గంలో ఓటు బ్యాంకును పెంచుకోలేకపోవడం.
- ప్రధాని మోదీ ఇమేజ్‌కి దీటైన కేంద్ర నాయకత్వం లేకపోవడం.
- ఆశావహులు ఎక్కువవటంతో అసమ్మతి భగ్గుమనే ఆస్కారం.


అధికార వ్యతిరేకతకు ఎదురొడ్డి 40 ఏళ్ల చరిత్రను తిరగరాయాలని తహతహలాడుతూ బీజేపీ..
కన్నడ నాట పార్టీ జెండా ఎగురవేసి 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని పొందాలని కాంగ్రెస్..
కన్నడ ఆత్మగౌరవ నినాదాన్ని మరింత రాజేసి కింగ్‌మేకర్ స్థాయి నుంచి కింగ్‌గా మారాలని జేడీ(ఎస్)..


పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలతో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు రసకందాయంలో పడ్డాయి

సాక్షి, నేషనల్ డెస్క్

కర్ణాటక ఓటర్లు ప్రతీసారి ఒకే తీర్పు ఇవ్వడం లేదు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. 1985 నుంచి ఏ పార్టీ కూడా వరసగా రెండోసారి గెలవలేదు. ఈసారీ అదే సంప్రదాయం కొనసాగుతుందా, అధికార బీజేపీకి మళ్లీ పట్టం కడతారా అన్నది ఉత్కంఠగా మారింది. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రభుత్వంపై అధికార వ్యతిరేకతను ప్రధాని మోదీ ఇమేజీతో ఎదుర్కొనే వ్యూహంతో బీజేపీ ముందుకు వెళుతోంది. మొత్తం 224 అసెంబ్లీ స్థానాల్లో 150 సీట్లు గెలవడం లక్ష్యంగా పెట్టుకుంది. బలహీనంగా ఉన్న పాత మైసూరు (ఉత్తర కర్ణాటక)లో బలపడటంపై దృష్టి పెట్టింది. 89 స్థానాలున్నా ప్రాంతంలో మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తరచూ పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర బీజేపీ అంతగా బలంగా లేకపోవడం, బొమ్మై ప్రభుత్వంపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదాన్నే వారు నమ్ముకున్నారు. 100 సీట్లలో కీలకమైన లింగాయత్ ఓటు బ్యాంకును నమ్ముకుంది. బీజేపీ ఇలా కేంద్ర నాయకత్వాన్ని నమ్ముకుంటే, కాంగ్రెస్‌కు స్థానిక నాయకత్వమే బలంగా ఉంది. పీసీసీ చీఫ్ డి.కె శివకుమార్, సీనియర్ నేత సిద్దరామయ్య కుడి, ఎడమ భుజాలుగా ఉన్నారు. ముస్లింల 4 శాతం రిజర్వేషన్ల రద్దు, ధరల పెరుగుదల, హిజాబ్ వంటివాటిపై పార్టీ దృష్టి పెట్టింది. ప్రభుత్వ అవినీతిని ప్రధానాస్త్రంగా మలచుకుంటోంది. జేడీ(ఎస్) కన్నడ ఆత్మగౌరవ నినాదంతో ఉనికిని కాపాడుకునే పనిలో ఉంది. మాజీ సీఎం హెచ్.డి.కుమారస్వామి అంతా తానై నడుపుతున్నారు. ముక్కోణ పోరులో విజయం ఎవరిదోనన్న ఉత్కంఠ నెలకొంది....

జనాభాలో ఎవరెంత?





కాంగ్రెస్‌దే అధికారం..!

కర్ణాటక ఎన్నికల నగారా మోగిన రోజే విడుదలైన ఏబీపీ–సీఓటర్ ఎన్నికల సర్వే కాంగ్రెస్ పార్టీయే అధికారాన్ని హస్తగతం చేసుకుంటుందని అంచనా వేసింది. కాంగ్రెస్‌కు 115 నుంచి 127 సీట్లు వస్తాయని, బీజేపీ 68–80 సీట్లు గెలుచుకుంటే జేడీ (ఎస్) 23–25 సీట్లతో సరిపెట్టుకుంటుందని సీ ఓటర్ సర్వేలో తేలింది. బసవరాజ్ బొమ్మై పరిపాలన అసలు బాగోలేదని సర్వేలో పాల్గొన్న ఏకంగా 50.5%మంది తేల్చి చెప్పారు. 57శాతం మంది ప్రస్తుత ప్రభుత్వం మారిపోవాలని అభిప్రాయపడినట్టు ఆ సర్వే వెల్లడించింది.

మే 10న కర్ణాటక ఎన్నికలు

షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ, కాంగ్రెస్ మధ్య మరో కీలక ఎన్నికల పోరుకు తెర లేచింది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. మే 10న ఒకే దశలో రాష్ట్రంలో పోలింగ్ ముగియనుంది. ఫలితాలు మే 13న వెల్లడవుతాయి. ఈ మేరకు రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఆ వెంటనే రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియామవళి కూడా అమల్లోకి వచ్చింది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బుధవారం పోలింగ్ జరపాలని నిర్ణయించినట్టు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ చెప్పారు. షెడ్యూల్ విడుదల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సోమ, శుక్రవారాల్లో పోలింగ్ ఉంటే ఆ రోజు సెలవు వీకెండ్‌తో కలిసిపోయి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపకపోవచ్చని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా రూ.80 కోట్ల నగదు జప్తు చేశామని వివరించారు.

- కర్ణాటకలో మొత్తం ఓటర్లు 5.24 కోట్లు.
- మొత్తం 58,282 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు.
- సగం పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్.
- 1,320 పోలింగ్ స్టేషన్లలో మహిళా సిబ్బంది.
- అత్యంత వెనకబడ్డ గిరిజన జాతుల కోసం 40 ఎత్నిక్ పోలింగ్ స్టేషన్లు.
- థర్డ్ జెండర్ ఓటర్లు కూడా పోలింగ్‌లో భారీగా పాల్గొనేలా చర్యలు.

కర్ణాటక ఎన్నికల ముఖచిత్రం

- ✔ నోటిఫికేషన్ విడుదల: ఏప్రిల్ 13
- ✔ నామినేషన్ల దాఖలుకు గడువు: ఏప్రిల్ 20
- ✔ నామినేషన్ల పరిశీలన: ఏప్రిల్ 21న
- ✔ ఉపసంహరణకు చివరి తేదీ: ఏప్రిల్ 24
- ✔ పోలింగ్: మే 10
- ✔ ఫలితాలు: మే 13

వయనాడ్‌పై తొందరేమీ లేదు: ఈసీ

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహించిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించే విషయంలో తామేమీ తొందర పడటం లేదని ఈసీ పేర్కొంది. ఫిబ్రవరి నాటికి ఖాళీ అయిన నియోజకవర్గాల ఎన్నికలపై మాత్రమే ప్రస్తుతానికి నిర్ణయం తీసుకున్నట్టు సీఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. 'మోదీ ఇంటిపేరు' వ్యాఖ్యలపై పరువు నష్టం కేసులో రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించడం, ఆ వెంటనే ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దవడం తెలిసిందే. ''అప్పీలుకు రాహుల్‌కు నెల రోజుల గడువున్నందున వేచి చూస్తాం. ఆ తర్వాత ఓ నిర్ణయానికి వస్తాం'' అని సీఈసీ సీఈసీ చెప్పారు.

లక్షద్వీప్ ఎంపీ సభ్యత్వం పునరుద్ధరణ

- లోక్‌సభ సచివాలయం నిర్ణయం • సభకు హాజరైన ఫైజల్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు జాతీయ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. హత్యాయత్నం కేసులో పదేళ్ల కఠిన కారాగార శిక్ష నేపథ్యంలో రద్దు చేసిన లక్షద్వీప్ ఎన్సీపీ ఎంపీ మొహమ్మద్ ఫైజల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పది వారాల అనంతరం లోక్‌సభ పునరుద్ధరించింది. శిక్ష అమలుపై కేరళ హైకోర్టు జనవరి 25న స్టే ఇచ్చింది. తన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని అప్పటినుంచీ ఆయన లోక్‌సభ స్పీకర్‌ను కోరుతున్నారు. కేంద్ర న్యాయ శాఖ కూడా ఆ మేరకు సిఫార్సు చేసింది. అయినా లాభం లేకపోవడంతో ఫైజల్ మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బుధవారం దానిపై విచారణకు కొద్ది గంటల ముందు వేటును ఎత్తేస్తూ లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది! దీన్ని ఎన్సీపీ స్వాగతించింది. ఈ పని ఎప్పుడో చేసుండాల్సిందని పేర్కొంది. ఫైజల్ బుధవారం లోక్‌సభ సమావేశాలకు హాజరయ్యారు. ఈ నిర్ణయాన్ని తానూహించలేదన్నారు. విషయాన్ని ఇంతకాలం సాగదీయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఫైజల్ లోక్‌సభ సభ్యత్వం రద్దు నేపథ్యంలో లక్షద్వీప్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక జరపనున్నట్టు జనవరి 18న ఎన్నికల సంఘం ప్రకటించింది! కేరళ హైకోర్టు స్టే నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని జనవరి 30న వెనక్కు తీసుకుంది.

ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి భారత్

- పాలకులను ఎన్నుకొనే ఆలోచన ఇక్కడే పుట్టింది
- 'ప్రజాస్వామ్యం కోసం శిఖరాగ్ర' సదస్సులో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యానికి భారత్ తల్లిలాంటిదని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ''అంతర్జాతీయంగా ఎన్నో ప్రతికూలతలు ఉన్నా, వేగంగా ఎదుగుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ప్రజాస్వామ్యంతో సత్ఫలితాలు లభిస్తాయనడానికిదే నిదర్శనం'' అన్నారు. గురువారం నిర్వహించిన 'ప్రజాస్వామ్యం కోసం శిఖరాగ్ర సదస్సు–2023'లో మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు దేశ ప్రజల సమ్మిళిత ప్రయత్నాలే తగిన బలాన్ని ఇస్తున్నాయని చెప్పారు. పాలకులను ప్రజలంతా కలిసి ఎన్నుకొనే ఆలోచన ప్రపంచ దేశాల కంటే చాలా ఏళ్ల ముందే భారత్‌లో ఆవిర్భవించిందని గుర్తుచేశారు. ప్రజల ప్రథమ విధి పాలకులను ఎన్నుకోవడమేనని మహాభారతంలో ఉందని తెలిపారు. ప్రాచీన భారతదేశంలో ఎన్నో గణతంత్ర రాజ్యాలుండేవని చెప్పడానికి చారిత్రక ఆధారాలున్నాయని వివరించారు. ''గణతంత్ర రాజ్యాల్లో పాలనాధికారం వారసత్వంగా దక్కేది కాదు. పాలకులను ప్రజలు ఎన్నుకునేవారు'' అని వెల్లడించారు. ప్రజాస్వామ్యం అనేది కేవలం ఒక నిర్మాణం కాదని, అదొక స్ఫూర్తి అని మోదీ పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యం కోసం శిఖరాగ్ర సదస్సు–2023'కు అమెరికా, కోస్టారికా, జాంబియా, నెదర్లాండ్స్, దక్షిణ కొరియా దేశాల అధినేతలు ఆతిథ్యం ఇస్తున్నారు.

'అవినీతిపరులూ పారిపోండి' పథకం !

ప్రధాని మోదీపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విసుర్లు



న్యూఢిల్లీ: అవినీతిపరులంతా ఒక్కటవుతున్నారంటూ విపక్షాలపై ప్రధాని మోదీ చేసిన విమర్శలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఘాటుగా స్పందించారు. 'అదానీ షెల్ కంపెనీల్లో ఎవరు రూ.20,000 కోట్లు పెట్టుబడి పెట్టారు? లలిత్ మోదీవా, నీరవ్ మోదీవా?మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతావా? భారత్‌లో వేలకోట్లు ఎగొట్టి విదేశాలకు పారిపోయిన 'అవినీతిపరులూ, పారిపోండి' పథకం సభ్యులా? ఈ కూటమికి మీరే కన్వీనర్‌గా ఉన్నారా?'' అంటూ బుధవారం ట్వీట్ చేశారు.

అదే కోలార్ నుంచి కాంగ్రెస్ సత్యమేవ జయతే

బెంగళూరు: 'దొంగలందరి ఇంటి పేరు మోదీ' అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాలుగేళ్ల క్రితం చేసిన వివాదాస్పద ప్రసంగానికి వేదికైన కర్ణాటకలోని కోలార్ నుంచే 'సత్యమేవ జయతే' పేరిట ఏప్రిల్ 5న జాతీయ స్థాయి నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రీకారం చుడుతోంది. ఆ వ్యాఖ్యలపై నేరపూరిత పరువునష్టం కేసులో రాహుల్‌పై ఎంపీగా అనర్హత వేటు పడటం తెల్సిందే. ''రాహుల్ ప్రసంగంతో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం మొదలవుతుంది. అలా కోలార్ మార్పుకు వేదిక కానుంది'' అని పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ చెప్పారు.

మత రాజకీయాలు ఆపితేనే... విద్వేష ప్రసంగాలకు తెర: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: విద్వేష ప్రసంగాలపై సుప్రీంకోర్టు కన్నెర్రజేసింది. రాజకీయ నాయకులు మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం ఆపినప్పుడే వాటికి అడ్డుకట్ట పడుతుందని పేర్కొంది. ''దేశం ఎటు పోతోంది? విద్వేష ప్రసంగాలు ఓ విషవలయం. రాజకీయాలను మతంలో కలపడం పెను సమస్యకు దారి తీస్తోంది. విచ్ఛిన్న శక్తులే ఇందుకు పాల్పడుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం. దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం తక్షణం ఓ మార్గం చూడాలి'' అని న్యాయమూర్తులు కె.ఎం.జోసెఫ్, బి.వి.నాగరత్న ధర్మాసనం బుధవారం అభిప్రాయపడింది. ఇటీవలి తీర్పులోనూ సుప్రీంకోర్టు ఇదే విషయాన్ని నొక్కిచెప్పిందని గుర్తు చేసింది. ''టీవీల్లో, మీడియాలో, బహిరంగ వేదికలపై రోజూ ఇలాంటి శక్తులు ఇతరులపై విద్వేష వ్యాఖ్యలకు పాల్పడుతూనే స్తూనే ఉన్నాయి. ఎంతమందిపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టగలం? తోటివారిపై, సామాజిక వర్గాలపై విద్వేష వ్యాఖ్యలు చేయబోమని ప్రజలే ప్రతినబూనితే బాగుంటుంది'' అని సూచించింది. దివంగత ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటివారి ప్రసంగాలు ఎంతో హుందాగా ఉండేవంటూ గుర్తు చేసింది.

వాడీవేడి వాదనలు

''విద్వేష ప్రసంగాలపై సకాలంలో చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాలు నిస్తేజంగా మారాయి. అందుకే కోర్టులకు పని పడుతోంది'' అంటూ ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఇలా మౌనంగా ఉండే పక్షంలో ప్రభుత్వాల ఉనికికి అర్థమేముందని ప్రశ్నించింది? రాష్ట్రాల సంగతేమోగానీ ఈ వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వానికి వర్తించవని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. కేరళ, తమిళనాడుల్లో నేతల విద్వేష ప్రసంగాల ఉదంతాలను కూడా ఈ పిటిషన్‌తో కలిపి విచారించాలని కోరారు. వాటికి సంబంధించిన వీడియో క్లిప్‌ల ప్రదర్శనకు అనుమతించాలని కోరడంతో దీన్నో డ్రామాగా మార్చొద్దని ధర్మాసనం పేర్కొంది. ''దేనికైనా ఓ పద్ధతుంటుంది. మేం వీడియో క్లిప్‌లు చూడాలని మీరు భావిస్తే దాన్ని మీ పిటిషన్లో చేర్చండి'' అని సూచించింది. విచారణను ఏప్రిల్ 28కి వాయిదా వేసింది.

క్రైస్తవులపై దాడులపై నివేదిక సమర్పించండి

కేంద్ర హోంశాఖకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: దేశంలో క్రైస్తవ సంస్థలు, క్రైస్తవ మతపెద్దలు, క్రైస్తవులపై దాడులపై నివేదిక సమర్పించాలని కేంద్ర హోం శాఖను సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. వీటిని అరికట్టడానికి గతంలో తాము జారీ చేసిన మార్గదర్శకాల అమలుపైనా నివేదిక ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దివాలా ధర్మాసనం పేర్కొంది. విచారణను రెండు వారాల పాటు వాయిదా వేసింది.



మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్కులో కనువిందు చేస్తున్న నాలుగు బుల్లి చీతాలు. నమీబియా నుంచి తీసుకొచ్చిన చీతాల్లో ఒకటి తాజాగా వీటికి జన్మనిచ్చింది.

పార్లమెంట్‌లో అదే రచ్చ

అదానీపై జేపీసీ నియమించాలని విపక్షాల డిమాండ్

- లోక్‌సభ, రాజ్యసభలో నినాదాలు, నిరసనలు
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా
- లోక్‌సభలో కాంపిటీషన్ (సవరణ) బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ: పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష సభ్యులు తమ డిమాండ్లపై ఏమాత్రం పట్టు వీడడం లేదు. బుధవారం సైతం ఎంపీల నినాదాలు, నిరసనల కారణంగా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. కేంద్రం తీరుకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు నల్లదుస్తులతో హాజరయ్యారు. అదానీ ఉదంతంపై జేపీసీ విచారణకు డిమాండ్ చేశారు. దాంతో సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. రెండో విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13న ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఉభయ సభల్లో రగడ కొనసాగుతూనే ఉంది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు జేపీసీ కోసం నినాదాలు ప్రారంభించారు. 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. దాంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 దాకా వాయిదా వేశారు. మళ్లీ ప్రారంభమయ్యాక సభ్యుల నినాదాల మధ్యే కేంద్ర పర్యావరణ శాఖ భూపేంద్ర యాదవ్ అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు–2023ను ప్రవేశపెట్టారు. తర్వాత కాంపిటీషన్(సవరణ) బిల్లు–2022 ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందింది. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతి స్థానంలో ఉన్న రమాదేవి ప్రకటించారు. గురువారం శ్రీరామ నవమి సందర్భంగా సెలవు కాగా, పలువురు సభ్యుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం సభ నిర్వహించవద్దని నిర్ణయించారు.



రాజ్యసభలోనూ ఉదయం సమావేశం ప్రారంభం కాగానే 'మోదీ–అదానీ భాయి భాయి' అంటూ కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు మొదలుపెట్టారు. అదానీ గ్రూప్‌పై ఆరోపణపై విచారణకు జేపీసీకి డిమాండ్ చేశారు. దాంతో సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు. సభ పునఃప్రారంభమైన తర్వాత అటవీ(సంరక్షణ) సవరణ బిల్లు–2023పై జాయింట్ కమిటీని

అదానీ–మోదీ భాయి భాయి

ఏర్పాటు చేస్తూ కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ కమిటీలో బీజేపీ ఎంపీలు అశోక్ బాజ్‌పాయ్, అనిల్ బలూనీ, సమీర్ ఓరావాన్, సీఎం రమేశ్, ఏఐటీసీ ఎంపీ జవహర్ సిర్కార్, బీజేడీ ఎంపీ ప్రశాంత్ నందా, ఎడీఎఫ్ ఎంపీ హిషే లాచూంగ్‌పా, ఏజీపీ ఎంపీ బిరేంద్ర ప్రసాద్ బైష్యాను సభ్యులుగా నియమించారు. మూజువాణి ఓటుతో తీర్మానం ఆమోదం పొందింది. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ వెల్లడించారు.

అమెరికా వీసాకు తగ్గిన ఎదురుచూపులు

వాషింగ్టన్: అమెరికా వీసా ఇంటర్వ్యూలకు వెయిటింగ్ పీరియడ్ భారీగా తగ్గిందని ఆ దేశ విదేశాంగ శాఖ డెప్యూటీ అసిస్టెంట్ (వీసా సేవలు) జూలీ స్టఫ్ వెల్లడించారు. పర్యాటక వీసా ఇంటర్వ్యూల వెయిటింగ్ 60 శాతం తగ్గిపోయిందని పీటీఐ వార్తా సంస్థతో చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు దౌత్య సేవలను పెంచినట్టు వివరించారు. కోవిడ్ ఆంక్షలు ఎత్తేశాక అమెరికా వీసాల కోసం భారత్ నుంచి దరఖాస్తులు వెల్లువెత్తడం తెలిసిందే. దాంతో బిజినెస్, టూరిస్ట్ వీసాల వెయిటింగ్ పిరియడ్ 2022 అక్టోబర్‌లో ఏకంగా 1,000 రోజులకు పెరిగింది. ఈ ఏడాది విద్యార్థి, ఉద్యోగి సహా అన్ని కేటగిరీల్లో 10 లక్షల వీసాలు జారీ చేయాలన్నది లక్ష్యమని స్టఫ్ చెప్పారు. 'వందకు పైగా దౌత్య మిషన్ల ద్వారా భారతీయులకు వీసాలు జారీ చేస్తున్నాం. బ్యాంకాక్, ఫ్రాంక్‌ఫర్ట్, లండన్, అబూదాబీల్లోనూ దరఖాస్తులను ప్రాసెస్ చేస్తున్నాం. భారత్‌లో వీసాల జారీ ప్రక్రియ 40 శాతం పెరిగింది. గత నెలలో గరిష్టాన్ని తాకింది. కొన్ని విభాగాల్లో ఇంటర్వ్యూలను ఎత్తేయడంతో ప్రాసెసింగ్ ప్రక్రియ వేగవంతమైంది. రెన్యువల్‌కు కోసం అమెరికాలోనే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాం. ఇది భారత టెకీలకు పెద్ద ఊరట'' అని చెప్పారు.



భోపాల్‌లో ఫౌజీ మేళాలో సెల్ఫీ పాయింట్ వద్ద సైనిక కటౌట్‌తో ఫొటో దిగుతున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివ్‌రాజ్ సింగ్ చౌహాన్

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం ׀ 30 ׀ మార్చి ׀ 2023



గాలీవాన బీభత్సం

బుధవారం సాయంత్రం మైసూరులో ఆకస్మిక గాలీ వాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు, కరెంటు స్తంభాలు కూలిపోయాయి. సీతా విలాస్ రోడ్డులో చెట్టు పడడంతో తుక్కయిన కారు

న్యూస్‌రీల్

ఏడేళ్ల నుంచి పరారీ.. వంచకుడు పట్టివేత

బనశంకరి: ప్రజలకు నకిలీ స్థలాలను విక్రయించి కోట్లాది రూపాయలు వంచనకు పాల్పడి, గత ఏడేళ్లుగా పరారీలో ఉన్న వ్యక్తిని బుధవారం నగర సీసీబీ పోలీసులు అరెస్ట్‌చేశారు. పట్టుబడిన వ్యక్తి అష్ఫాక్ అహ్మద్. ఇతడు 2009–2010 లో గ్రానిటి ప్రాపర్టీస్ పేరుతో ఆఫీసును తెరిచి హొసకోటె వద్ద వ్యవసాయ భూములను రెవెన్యూ స్థలాలు అని ప్రజలను నమ్మించి విక్రయించాడు. ఇతనిపై ఇందిరానగర, రామ్మూర్తినగర, అశోకనగర పోలీస్ స్టేషన్లలో మొత్తం 108 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. సీసీబీ పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. 2016 నుంచి విచారణకు హాజరు కాకుండా పరారయ్యాడు. గాలింపు జరిపి పట్టుకున్నారు. సీసీబీ జాయింట్ కమిషనర్ ఎస్‌డీ.శరణప్ప మాట్లాడుతూ ఇతనిపై 30 వరకు జామీను రహిత వారెంట్లు ఉన్నాయని తెలిపారు.

ఇవే నా చివరి ఎన్నికలు: సిద్దు



మాట్లాడుతున్న సిద్దు

మైసూరు: నేను పోటీ చేసే చివరి ఎన్నికలు ఇవే. తరువాత పోటీ చేయను. రాజకీయాల నుంచి పూర్తిగా రిటైరవుతానని సీఎల్పీ నాయకుడు సిద్దరామయ్య అన్నారు. ఈ ఎన్నికలో తాను పుట్టి పెరిగిన ఊరు అయిన వరుణ నుంచి పోటీ చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం మైసూరుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో తాను చాముండేశ్వరి నియోజకవర్గంలో పోటీ చేయగా, కొంచెం అనుమానం ఉండడంతో, బాదామిలోనూ పోటీకి దిగినట్లు చెప్పారు. ఈసారి ఎలాంటి అనుమానం లేదని, వరుణలో గెలుస్తానని అన్నారు. కాగా గత ఎన్నికలప్పుడు కూడా సిద్దరామయ్య ఇవే నా చివరి ఎన్నికలని చెప్పడం గమనార్హం.

ప్రభుత్వ వాహనం స్వాధీనం

కోడ్ అమలులోకి రావడంతో సిద్దరామయ్య ఉపయోగిస్తున్న ప్రభుత్వ కారును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాంతో ఆయన వేరే కారులో ప్రయాణించారు. కోడ్ వచ్చాక ఎమ్మెల్యేలు, మంత్రులు అందరూ ప్రభుత్వ వాహనాలను వదిలి సొంత వాహనాలను ఉపయోగించాలి.

అందరి భాగస్వామ్యం ఉండాలి



సాక్షి, బెంగళూరు: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త విద్యా విధానం (ఎన్‌ఈపీ–2020) బృందంలో తాను ఒక భాగం అయినందుకు చాలా సంతోషంగా ఉందని కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. నగరంలో రేవా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో రేవా బిజినెస్ స్కూల్ కొత్త బ్లాక్‌ను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు స్మృతి ఇరానీ సమాధానాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యం వల్లే దేశం శక్తివంతంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తేజస్వీ సూర్య, వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యామరాజు పాల్గొన్నారు.

మహా సమరానికి కౌంట్‌డౌన్

దక్షిణాదిన మహా యుద్ధానికి క్షణ గణన ఆరంభమైంది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు జరిగే ఈ సెమీ ఫైనల్స్ ఫలితాలు అత్యంత నిర్ణయాత్మకమైనవి. ఈ ఫలితాలను శాంపిల్‌గా భావించే అవకాశముంది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, జేడీఎస్‌లు ప్రచారాన్ని ఎప్పుడో షురూ చేశాయి. ఇక అభ్యర్థులు, నామినేషన్ల సందడి మిన్నంటబోతోంది. ఓటరు దేవున్ని ప్రసన్నం చేసుకోవడానికి చేయని విన్యాసాలు ఉండవు.



రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- పోలింగ్‌కు కొత్త ఓటింగ్ యంత్రాలు: సీఈఓ మనోజ్ మీనా
- తక్షణం ఎన్నికల కోడ్ వర్తింపు
- ఎమ్మెల్యేలు, మంత్రుల సర్కారీ వాహనాలు స్వాధీనం
- అధికారిక కార్యక్రమాలపై ఆంక్షలు

సాక్షి, బెంగళూరు/ శివాజీనగర: రాష్ట్రంలో మొత్తం 224 అసెంబ్లీ స్థానాల ఎన్నికలకు ముహూర్తం ఖరారు కాగా, రాష్ట్రంలో కొత్త ఓటింగ్ యంత్రాలనే ఉపయోగిస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి (సీఈఓ) మనోజ్‌కుమార్ మీనా తెలిపారు. బుధవారం బెంగళూరులోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన




సంస్థ కొత్తగా తయారు చేసిన ఓటింగ్ యంత్రాలను మే 10న జరిగే పోలింగ్‌లో వినియోగిస్తామని చెప్పారు. మొత్తం బ్యాలెట్ యూనిట్‌లు 1,15,709, కంట్రోల్ యూనిట్‌లు 82,543, వీవీ ప్యాట్‌లు 89,379 ఉంటాయి. ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో వాడిన ఈవీఎంలను ఈ ఎన్నికల్లో ఉపయోగించరాదని పలు పార్టీల ప్రతినిధులు ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు విన్నవించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

అమల్లోకి నియమావళి

ఎన్నికల కోడ్ బుధవారం నుంచే అమలులోకి వచ్చినట్లు మీనా తెలిపారు. అక్రమాల నివారణకు 2,040 సంచార తనిఖీ బృందాలు, 2,605 స్థానిక పర్యవేక్షణా బృందాలు, 631 వీడియో పర్యవేక్షణా బృందాలను నియమించారు. రాష్ట్రంలో మొత్తం 942 చెక్ పోస్టులు ఏర్పాటు కాగా, ఇందులో 171 అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు. అభ్యర్థుల ఖర్చులపై నిఘా కోసం 234 మంది పరిశీలకులను నియమించారు.

ఇప్పటికి రూ.57 కోట్ల సొత్తు సీజ్

గత వారం రోజుల్లో తనిఖీల్లో రూ.57.72 కోట్ల విలువ చేసే మద్యం, నగదు, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు సీఈఓ తెలిపారు. ఇందులో నగదు రూ.14.24 కోట్లు, 15 కిలోల బంగారు, 135 కిలోలు వెండి ఉన్నాయని చెప్పారు. ఎక్సైజ్ శాఖ మొత్తం రూ.1.16 కోట్లు విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకొంది. ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రభుత్వ వాహనాలను వెనక్కి తీసుకున్నారు.



మాట్లాడుతున్న సీఈఓ మనోజ్‌మీనా

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు

రాష్ట్రంలో తొలిసారి ఇంటి నుంచి ఓటు విధానాన్ని తీసుకువచ్చింది. 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి దగ్గరే బ్యాలెట్ విధానంలో ఓటు వేయవచ్చు. అటువంటివారు 12 డీ ఫారం భర్తీ చేయాలి. ఏప్రిల్ 13న ఈసీ నోటిఫికేషన్ వెల్లడించిన తరువాత ఎన్నికల తేదీకి ఐదు రోజుల్లోగా ఈ ఫారం ద్వారా దరఖాస్తు చేస్తే పోలింగ్ రోజున సిబ్బంది ఇంటికి వచ్చి పోస్టల్ బ్యాలెట్ పత్రంలో ఓటును సేకరిస్తారు. ఇక గుర్తింపు పొందిన పాత్రికేయులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవచ్చు.

మే 10 పోలింగ్, 13 కౌంటింగ్

ఎన్నికల షెడ్యూల్‌లో ముఖ్య తేదీలు ఇవీ

ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్	ఏప్రిల్ 13 (గురువారం)
నామినేషన్ల సమర్పణకు ఆఖరి రోజు	ఏప్రిల్ 20 (గురువారం)
నామినేషన్ల పరిశీలన	ఏప్రిల్ 21 (శుక్రవారం)
నామినేషన్ల ఉపసంహరణ	ఏప్రిల్ 24 (సోమవారం)
పోలింగ్	మే 10 (బుధవారం)
ఓట్ల లెక్కింపు	మే 13 (శనివారం)
ఎన్నికల ప్రక్రియ ముగింపు	మే 15 (సోమవారం)

రాష్ట్ర అసెంబ్లీలో సీట్లు, బలబలాలు..

మొత్తం నియోజకవర్గాలు	224
ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన సీట్లు	113
ప్రస్తుతం బీజేపీ బలం	118
కాంగ్రెస్ పార్టీ	69
జేడీఎస్	32
బీఎస్పీ	1
స్వతంత్రులు	2
ఎస్సీ రిజర్వుడ్ స్థానాలు	36
ఎస్టీ రిజర్వుడ్ స్థానాలు	15

రాష్ట్రంలో ఓటర్ల వివరాలు

మొత్తం	5,21,76,579 మంది
ఇందులో పురుషులు	2,62,42,561 మంది
మహిళలు	2,59,26,319 మంది
దివ్యాంగ ఓటర్లు	5,55,073
ట్రాన్స్‌జెండర్లు	4,699
సాయుధ సర్వీసుల్లో	47,779 మంది



విధానసౌధ వరించేది ఎవరినో!

తల్లయిన 9వ తరగతి బాలిక

- కామాంధునికి 30 ఏళ్ల జైలుశిక్ష

మైసూరు: బాలికపైన అత్యాచారం చేసిన మృగాడికి మైసూరులోని పోక్సో కోర్టు 30 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ముద్దాయి నంజనగూడు తాలూకాలోని అలక గ్రామానికి చెందిన మల్లేష్. వివరాలు.. మల్లేష్ తండ్రి 2020లో కరోనా లాక్‌డౌన్ సమయంలో స్కూలు మూసివేయడంతో 9వ తరగతి చదివే తన చెల్లెలి కుమార్తెని ఇంటికి తీసుకువచ్చాడు. జూన్ నుంచి డిసెంబర్ వరకు వారి ఇంట్లోనే ఉన్నది. తల్లిదండ్రులు పొలానికి వెళ్లిన సమయంలో మల్లేష్ బాలికపై తరచూ అత్యాచారం చేసేవాడు. దాంతో బాలిక గర్భం దాల్చి 2021న మార్చి 17వ తేదీన ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇది తెలిసి బాలిక తల్లిదండ్రులు హల్లహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో 30 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధిస్తూ జడ్జి షామా ఖమ్రోజ్ తీర్పు చెప్పారు.



మృగానికి దేహశుద్ధి

మతిస్థిమితం లేని బాలిక మీద అత్యాచార యత్నం చేసిన వ్యక్తికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. హుణసూరు తాలూకాలోని ఉయిగొడనహళ్లి గ్రామంలో జరిగింది. మతిస్థిమితం లేని బాలిక ఒంటరిగా ఉండడం చూసి మహదేవ(57) అనే వ్యక్తి ఆమె మీద అత్యాచారం చేయబోయాడు. బాలిక కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి అతన్ని స్తంభానికి కట్టి వేసి దేహశుద్ధి చేశారు. హుణసూరు పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు.

వైభవంగా సీతారామ కల్యాణోత్సవం



సీతారామ కల్యాణోత్సవ దృశ్యం

కోలారు: శ్రీరామ నవమి నేపథ్యంలో నగరంలో వక్కలేరిలోని కోదండరామ స్వామి ఆలయంలో సీతారామ కల్యాణోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా జరిపారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో గణపతి హోమం, గంగాపూజ, శ్రీరామ తారక హోమం తదితరాలను నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్న సంతర్పణ జరిగింది.

మనోహర వర్ణ వైవిధ్యం



ప్రదర్శనలో పాల్గొన్న వర్ధమాన చిత్రకారులు

- చిత్రకళా పరిషత్‌లో పెయింటింగ్స్ షో

బనశంకరి: నగరంలో చిత్రకళాపరిషత్‌లో ఫ్లోయింగ్ కలర్స్ పేరుతో చిత్ర ప్రదర్శన నగరవాసులకు కనువిందు చేస్తోంది. సీనియర్ కళాకారుడు కే.మాల్యాద్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెయింటింగ్స్ సందర్శకులను అబ్బురపరుస్తాయి. కే.మాల్యాద్రి గీసిన పలు చిత్రలేఖనాలను ప్రదర్శనలో ఉంచారు. సమాజంలో మహిళల సవాళ్లు, ప్రకృతి సౌందర్యం, కళలు, సంస్కృతిని ఇతివృత్తంగా చేసుకుని పలువురు కళాకారులు గీసిన చిత్రలేఖనాలు ఆకట్టుకుంటాయి. ఇందులో పలువురు యువ మహిళా చిత్రకారులు ఉండడం విశేషం. ఈ ప్రదర్శన ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగుతుంది.



పెయింటింగ్స్ గురించి వివరిస్తున్న ఓ చిత్రకారిణి

నేతల పోస్టర్లు, బ్యానర్లు తీసేయాలి



బుధవారం బెళగావిలో పోస్టర్లను తొలగించిన దృశ్యం

- నగర జిల్లా ఎన్నికల అధికారి

బనశంకరి: శాసనసభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులతో పాటు ఇతర సార్వజనిక స్థలాల్లో ప్రజాప్రతినిధుల పేర్లతో ఉన్న ఫొటోలు, ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించాలని నగర జిల్లా ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ అధికారులకు సూచించారు. బుధవారం బీబీఎంపీ పరిధిలోని జాయింట్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో సమావేశం జరిపారు. ప్రభుత్వ ఆఫీసులు, ఆస్తులతో పాటు ఇతర బహిరంగ స్థలాల్లో నాయకుల పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు, గోడరాతలు ఉండరాదని తెలిపారు. ఎవరైనా పోస్టర్లు, బ్యానర్లు కడితే వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధుల అధికారిక కార్యక్రమాలను తక్షణం రద్దుచేయాలని, ఎన్నికలు ముగిసే వరకు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు.

నేతల ఫోటోలు కనబడరాదు

తాగునీటి కేంద్రాలు, ఉద్యానవనాలతో పాటు ఇతర స్థలాల్లో అమర్చిన బోర్డుల్లో ప్రజాప్రతినిధుల పేర్లు, ఫోటోలు ఉండరాదని, ఒకవేళ ఉంటే కనబడకుండా మూసివేయాలని చెప్పారు. రోడ్ల పక్కన బోర్డుల్లో ప్రజాప్రతినిధుల పేర్లును మూసివేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక కమిషనర్ ఉజ్వల్‌కుమార్ ఘోష్, జయరామ్ రాయపుర పాల్గొన్నారు. కాగా నగరంతో పాటు రాష్ట్రమంతటా అప్పుడే అన్ని పార్టీల నేతల బ్యానర్లు, పోస్టర్లు తదితరాల తొలగింపును మున్సిపల్ సిబ్బంది చేపట్టారు.


నగరంలో చెక్‌పోస్టులు

బెంగళూరు నగరంలోని 28 నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ), సహాయక ఆర్‌ఓలను నియమించామని తుషార్ గిరినాథ్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇద్దరు అధికారులు పర్యవేక్షకులుగా ఉంటారని చెప్పారు. యశవంతపుర, రాజరాజేశ్వరి నగర, శివాజీనగర, శాంతినగరతో పాటు 19 నియోజకవర్గాల్లో ధన ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని చెప్పారు. నగరంలో 2,217 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, సిటీకి ఆనుకుని తమిళనాడు సరిహద్దులో 11 చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామని తెలిపారు. బ్యాటరాయనపురలో రూ.3 కోట్ల 66 లక్షల విలువచేసే వస్తు సామగ్రిని సీజ్ చేశామన్నారు. ఎన్నికలకోడ్ పకడ్బందీగా అమలుచేస్తామని బెంగళూరు నగర జిల్లా కలెక్టర్ దయానంద్ తెలిపారు.




బెంగళూరు విజయనగరలో చెక్‌పోస్టు ఏర్పాటు


వసతులు కల్పిస్తేనే ఓటేస్తాం



ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు బ్యానర్ ప్రదర్శిస్తున్న గ్రామస్తులు



దోనహళ్లి వద్ద నదిని దాటాలంటే అవస్థలు



సన్నబిజ్జూరులో గుడిసెలే గతి

- హాసన్ జిల్లాలో రెండు గ్రామాల ప్రజల డిమాండ్

దొడ్డబళ్లాపురం: దశాబ్దాలు గడుస్తున్నా ప్రభుత్వాలు కనీస వసతుల్ని కల్పించలేకపోయినట్లు ఆరోపిస్తూ పలు గ్రామాల ప్రజలు ఈసారి ఎన్నికలను బహిష్కరించాలని తీర్మానించారు. హాసన్‌లోని బాచనహళ్లి, దోనహళ్లి గ్రామాల ప్రజలు ఈ మేరకు ఎన్నికలను వెలివేస్తున్నట్లు బుధవారం బ్యానర్లు ప్రదర్శించారు.

రోడ్లు లేక అవస్థలు

ఇరు గ్రామాలకు రోడ్లు లేకపోవడంతో అడవిలో నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. జీపులు తప్ప ఎటువంటి వాహనాలు ఇక్కడ ప్రయాణించవు. బంధువులు కూడా తమ గ్రామాలకు రావడంలేదని, గ్రామాల్లో ఎవరికైనా అనారోగ్యం కలిగి అత్యవసరంగా ఆస్పత్రులకు తీసికెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది కలుగుతోందని, ఆస్పత్రికి వెళ్లేలోపు తమ ప్రాణాలే పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, అధికారులు ఎందరికి మనవి చేసుకున్నా సమస్యలను తీర్చలేదని తెలిపారు.

నదిని దాటడం సాహసం

దోనహళ్లి నుంచి ముఖ్య రహదారికి చేరుకోవాలంటే నది కాలువ దాటాల్సి ఉందని, వర్షాకాలం వస్తే నది దాటడమే పెద్ద సాహసంగా మారిందన్నారు. నది కాలువపై వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా ఏ ప్రయోజనం లేదన్నారు. రెండు గ్రామాల్లో మొత్తం 500మందికి పైగా నివసిస్తున్నారని, పెద్దలయినా పిల్లలయినా నిత్యం 6 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిందేనన్నారు. రోడ్లు లేకపోవడం వల్ల తమ గ్రామాల్లో యువకులకు ఎవ్వరూ ఆడపిల్లను కూడా ఇవ్వడం లేదని వాపోయారు. తమ డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇస్తేనే ఈసారి ఎన్నికల్లో ఓటు వేస్తామని తెలిపారు.

50 ఏళ్లుగా గుడిసెలే

వారంతా గంగావళి నది తాకిడికి ప్రతిసారి ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యేవారు. ప్రభుత్వం వరద బాధితులుగా గుర్తించి వేరే చోట ఇళ్లు కట్టుకోవడానికి సహాయం చేస్తామని హామీ ఇచ్చింది. కానీ 5 దశాబ్దాలు గడుస్తున్నా హామీలు నెరవేరలేదు, గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించలేదు. ఉత్తర కన్నడ జిల్లాలో ప్రసిద్ధ పర్యాటక స్థలంగా చెప్పుకునే గోకర్ణ నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న సన్నబిజ్జూరు గ్రామ ప్రజల కష్టాలు ఇవి. గంగావళి నది వర్షాకాలంలో పొంగిపొర్లి గ్రామంలోని ఇళ్లు కొట్టుకుపోయేవి. 1970లలో గ్రామం సమీపంలోనే ఇళ్లు కట్టిస్తామని అప్పటి ప్రభుత్వం ప్లాట్లను కేటాయించింది కానీ పట్టాలు ఇవ్వలేదు. నీరు,లైట్లు, డ్రైనేజీ, తాగునీరు లాంటి సౌకర్యాలు కల్పించలేదు. ఇప్పటికీ అక్కడి జనం టార్పాళ్లు,బ్యానర్లతో గుడిసెల్లో బతుకీడుస్తున్నారు. అందరూ నిరక్షరాస్యులు, కూలీ పనులు చేసుకుంటూ జీవించేవారే కావడంతో గట్టిగా ప్రశ్నించే సాహసం చేయలేకపోయారు. తమ సమస్యలను తీర్చకుంటే ఈసారి ఓటు వేయబోమని చెప్పారు.

క్లుప్తంగా

వాడీవేడిగా నగరసభ భేటీ



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: నగర సమస్యలు ఎప్పటికి పరిష్కరిస్తారు అని సభ్యులు ప్రశ్నించడంతో నగర సభ సామాన్య సమావేశం ఘాటుగా సాగింది. నగరసభ అధ్యక్షురాలు రూపా, కమిషనర్ గీత, అధికారులపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. నామినేటెడ్ సభ్యుడు డిజె చంద్రమోహన్ మాట్లాడుతూ నగరంలో నీటి సమస్య, విద్యార్థి ఉపకార వేతనాలు, ట్రాఫిక్ సమస్య తదితరాలను పరిష్కరించాలని కోరారు. 5 వ వార్డులో విపరీతంగా నీటి సమస్య ఉందని సభ్యుడు ఆర్‌పి గోపీనాథ్ ప్రశ్నించారు. అనేకమంది సభ్యులు తమ వార్డుల్లో సమస్యలను లేవనెత్తగా అన్నింటినీ పరిష్కరిస్తామని అధ్యక్షురాలు రూపా తెలిపారు. ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ, గాయత్రీ, అమర్, నగరసభ అధికారులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ నవమికి ఏర్పాట్లు

రాయచూరు రూరల్: జిల్లాలో గురువారం శ్రీరామ నవమికి అన్ని ఏర్పాట్లు చేశారు. పంచముఖి గాణదాళ ఆంజనేయ స్వామి ప్రాణదేవర ఆలయం, రైల్వేస్టేషన్ సమీపంలోని రామాలయం, కోటలోని బాలాంజనేయ, పాతాళాంజనేయ, బెట్టద రామాలయం, మంగళవార పేటె మారుతి ఆలయంలో శ్రీరాముడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం పంచముఖిలో రథోత్సవం జరుగనుంది.

బళ్లారిఅర్బన్: నగరంలోని సీతారామ ఆలయాలు గురువారం శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. నగరంలోని వివిధ ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించి శ్రీరామనవమి ఉత్సవాలను జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



మహిళా కూలీ కార్మికులతో దీపా సురేష్‌బాబు మాటామంతీ

కంప్లి: వచ్చే ఎన్నికల్లో తన భర్తను గెలిపిస్తే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే భార్య టీహెచ్.దీపా సురేష్‌బాబు తెలిపారు. ఆమె బుధవారం మధ్యాహ్నం క్షేత్ర పరిధిలోని గ్రామాల్లో పర్యటించి పొలాల్లో మిరపను ఆరబోసి శుభ్రం చేస్తున్న కూలీ కార్మికుల చెంతకు చేరి వారి యోగక్షేమాలను ఆలకించి మాట్లాడారు. స్పందించిన మహిళా కూలీలు మీ వెన్నంటే ఉంటామని ఆమెను ఆశీర్వదించారు.

నిందితులను శిక్షించాలని ధర్నా

కంప్లి: వీరశైవ లింగాయత మైనర్ బాలికపై హత్యాచారానికి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వీరశైవ సంఘం తాలూకా అధ్యక్షులు పీ.మూకయ్య స్వామి ఒత్తిడి చేశారు. బుధవారం ఏపీఎంసీ ద్వారం నుంచి భారీ నిరసన ర్యాలీ చేపట్టి తహసీల్దార్ కార్యాలయం ముందు సంఘం పదాధికారులు సాంకేతిక ధర్నా జరిపి తహసీల్దార్ గౌసియాబేగంకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామనగర జిల్లా కగ్గలిపుర పోలీసు స్టేషన్ పరిధిలోని తాతగుణి ప్రాంతంలో నివాసముంటున్న మైనర్ బాలికపై నలుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడి హత్య చేశారన్నారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం అందించాలన్నారు. ఈసందర్భంగా పదాధికారులు మరిశెట్ర విజయలక్ష్మి, పార్వతమ్మ, పుష్ప, రూపా పాటిల్, నీరజ, మహంతమ్మ, నాగరాజ్, వాలి కొట్రప్ప, నాగరాజ్, అక్కళ్లి వీరేష్, చెన్నయ్యస్వామి, కరిబసవగౌడ, ఆనందరెడ్డి, బళె మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులే నా గెలుపునకు సోపానాలు

- ఎమ్మెల్యే సోమలింగప్ప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప: తాలూకాలో తన అధికారావధిలో రూ.10 వేల కోట్లతో చేసిన అభివృద్ధి పనులే తన విజయానికి దోహదపడతాయని ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం నగరంలోని అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. రారావి వద్ద వేదావతి నదిపై రూ.33 కోట్లతో వంతెన నిర్మాణం, రూ.25 కోట్లతో నగరానికి, రూ.13.80 కోట్ల వ్యయంతో శానవాసపురం, కురువళ్లి, నాడంగ, కరూరుల్లో తాగునీటి చెరువుల నిర్మాణం, మొరార్జి దేశాయి, ఝాన్సిరాణి వసతి పాఠశాలల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అంకితమిచ్చామన్నారు. ఇంకా తెక్కలకోటలో ఎస్టీ సముదాయ భవనానికి శంకుస్థాపన చేశామని, నడువిలో రూ.3.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టామన్నారు. తాలూకా ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించి అఖండ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తాలూకా బీజేపీ అధ్యక్షులు పంపనగౌడ, భూ న్యాయ మండలి సభ్యులు గంగప్ప, నగరసభ సభ్యులు మేకలి సణ్ణవీరేశ, మహాదేవ, సుకువాయి మల్లికార్జున, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బళ్లారి నగర మేయర్‌గా త్రివేణి

- ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నిక
- కాంగ్రెస్ తరఫున ముగ్గురు పోటీ

సాక్షి,బళ్లారి: బళ్లారి నగర మేయర్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా ముగిసింది. బుధవారం సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో నగర మేయర్, ఉపమేయర్ ఎన్నిక జరిగింది. రెండో అవధి కింద నగర మేయర్ స్థానం ఎస్సీ జనరల్‌కు, ఉపమేయర్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వ్ కావడంతో మేయర్ స్థానం కోసం కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు పోటీ పడ్డారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 4వ కార్పొరేటర్ త్రివేణి సూరి, 7వ కార్పొరేటర్ ఉమాదేవి శివరాజ్, 35వ వార్డు కార్పొరేటర్ కుబేరాతో పాటు బీజేపీకి చెందిన 16వ వార్డు కార్పొరేటర్ నాగరత్న ప్రసాద్‌లు మేయర్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ చెందిన ముగ్గురిలో హైకమాండ్, స్థానిక ఎమ్మెల్యే నాగేంద్ర 4వార్డు కార్పొరేటర్ త్రివేణి ఎంపికకు కార్పొరేటర్లతో కలిసి మద్దతు సూచించడంతో పార్టీ సూచన మేరకు పోటీలో నిలిచిన కుబేరా, ఉమాదేవిలు ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

బీజేపీ తరఫున బరిలో నాగరత్న ప్రసాద్

ఇక మేయర్ స్థానానికి కాంగ్రెస్ తరఫున త్రివేణి సూరి, బీజేపీ తరఫున నాగరత్న ప్రసాద్ పోటీలో ఉండగా ఎన్నికల అధికారి, నగర కమిషనర్, అధికారులు ఎన్నికను నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి త్రివేణి సూరికి సిటీ కార్పొరేషన్‌లోని 39 వార్డులకు గాను 21 మంది కాంగ్రెస్, 5 మంది స్వతంత్ర కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యే నాగేంద్ర, రాజ్యసభ సభ్యుడు నాసీర్ హుస్సేన్‌ల ఓటు హక్కుతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు 28 మంది చేయి ఎత్తి మద్దతు తెలిపారు. ఇక 13 మంది కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్, లోక్‌సభ సభ్యుడు దేవేంద్రప్ప ఓటు హక్కుతో బీజేపీ అభ్యర్థినికి 16 మంది మద్దతు దక్కింది. దీంతో మేయర్‌గా కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కమేలా త్రివేణి సూరి ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.



విజయచిహ్నం చూపుతున్న నూతన ఉపమేయర్ జానకి, మేయర్ త్రివేణి

ఉపమేయర్‌గా జానకి ఏకగ్రీవం

ఇక ఉపమేయర్ స్థానానికి ఒకే ఒకరు 33వ కార్పొరేటర్ జానకి నామినేషన్ వేసిన నేపథ్యంలో ఆమె ఉపమేయర్‌గా ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. మేయర్ స్థానం కోసం ఉదయం నుంచి ఉత్కంఠత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు పోటీ చేయడంతో చివరి క్షణం వరకు ముగ్గురు తమకే మేయర్ స్థానం కావాలని భీష్మించుకుని కూర్చొన్నారు. అయితే ఎట్టకేలకు కుబేరా, ఉమాదేవిల నామినేషన్ ఉపసంహరించుకునే విధంగా నేతలు చేసిన ప్రయత్నాలు సఫలమయ్యాయి. నూతన మేయర్, ఉపమేయర్లను ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు అధికారులు, కార్పొరేటర్లు అభినందించారు.

చిన్న వయస్సులో మేయర్‌గా ఎన్నికైన త్రివేణి

బళ్లారి నగర మేయర్‌గానే కాకుండా రాష్ట్రంలోని మహానగర పాలికెల్లో ఇప్పటి వరకు అతి పిన్న వయస్సులో మేయర్‌గా ఎన్నికై త్రివేణి సూరి రికార్డు సృష్టించారు. 10వ తరగతి స్థానిక సెయింట్‌ఫిలోమినా స్కూలులో పూర్తి చేసిన అనంతరం పారా మెడికల్ కోర్సు పూర్తి చేసిన తర్వాత అనూహ్యంగా తల్లిదండ్రుల సూచనతో 21 ఏళ్లకే 4వ వార్డు కార్పొరేటర్‌గా ఎన్నికైన త్రివేణి 23వ ఏట బళ్లారి నగర ప్రథమ పౌరురాలుగా బాధ్యతలు తీసుకున్నారు. బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో చిన్న వయస్సులో త్రివేణి సూరికి అదృష్టం వరించి మేయర్ స్థానం దక్కించుకున్నారు. పలువురు ప్రముఖులు పోటీ చేసినా ఆమెనే మేయర్ పదవి వరించింది.

తల్లీకూతుళ్లిద్దరినీ వరించిన మేయర్ పదవి

మరో విశేషం ఏమిటంటే నూతన మేయర్‌గా ఎన్నికైన త్రివేణి తల్లి సుశీలబాయి కూడా 2018–19లో నగర మేయర్‌గా పని చేశారు. తల్లీ కూతుళ్లిద్దరినీ మేయర్ పదవి వరించడం నగరంలో చర్చనీయాంశమైంది. అనంతరం నూతన మేయర్ విలేకరులతో మాట్లాడుతూ నగర మేయర్ అవుతానని తన కలలో కూడా ఊహించలేదన్నారు. తన తండ్రి ప్రోత్సాహంతో గతంలో తన తల్లి సుశీలాబాయి ఐదేళ్లు కార్పొరేటర్‌గా, ఒక ఏడాదిపాటు నగర మేయర్‌గా సేవ చేసిందని గుర్తు చేశారు. మళ్లీ తండ్రి కమేలా సూరి తనను రాజకీయాల్లోకి రావాలని సూచించడంతో ఉద్యోగానికి వెళ్లకుండా నగర కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలుపొందానన్నారు. ప్రస్తుతం మేయర్ పట్టం వరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్పొరేటర్లందరి సహకారంతో మేయర్‌గా నగరాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మేయర్ తండ్రి సూరి మాట్లాడుతూ గతంలో తన భార్యకు, ప్రస్తుతం తన కుమార్తెకు మేయర్ పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా వార్తా శాఖాధికారిగా మురళీధర్



రాయచూరు రూరల్: జిల్లా వార్త ప్రచార శాఖాధికారిగా మురళీధర్ నియమితులయ్యా రు. బుధవారం నగరంలోని వార్తా శాఖాధికారి కార్యాలయంలో ఆయన అధికార బాధ్యతలు స్వీకరించారు. గత పదేళ్లుగా నగరంలో వార్తా శాఖాధికారి లేకపోవడంతో ఎన్నికల సమయంలో మురళీధర్‌ను ప్రభుత్వం నియమించింది.

పంటల సాగుపై అవగాహన కల్పించండి



జ్యోతి వెలిగిస్తున్న వీసీ హన్మంతప్ప

రాయచూరు రూరల్: ఆహార పంటల సాగుపై రైతులకు తగిన అవగాహన కల్పించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ హన్మంతప్ప పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ వర్సిటీ భవనంలో రెండు రోజుల పాటు జరిగే శిబిరంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ క్షేత్రంలో అధికంగా ఉన్న పేద రైతులు అధిక పంట దిగుబడికి తోడు పౌష్టికాహారం, ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వం నుంచి లభించే సౌకర్యాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హాస్టల్ నిర్మాణానికి భూమిపూజ



పాల్గొన్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి తదితరులు

గంగావతి: కనకగిరి రోడ్డులో క్రియేటివ్ పార్క్ వద్ద హాస్టల్ నిర్మాణానికి ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి బుధవారం భూమిపూజను నెరవేర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ విద్యాభ్యాసం ముగించిన వారి కోసం ఈ హాస్టల్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, బీసీఎం శాఖ అధికారులు పాల్గొన్నారు.

అవన్నీ ఊహాగానాలే

- కొట్టిపారేసిన వినయ్ కులకర్ణి భార్య

హుబ్లీ: హావేరి జిల్లాలో ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రాతినిధ్యం వహిస్తున్న శిగ్గాంవి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి వినయ్ కులకర్ణి పోటీ చేస్తారన్న వార్తలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన భార్య శివలీల కులకర్ణి మండిపడ్డారు. ధార్వాడలో ఆమె మీడియాతో మాట్లాడుతూ హైకమాండ్ కానీ వినయ్‌కులకర్ణి కానీ చెప్పలేదు. అంతా మీడియా సృష్టి అని ఆమె అసహనం వ్యక్తం చేశారు. తన భర్త ధార్వాడ రూరల్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తారన్నారు. ఆయనకు టికెట్ లభించడం తథ్యమని, ఆయన ధార్వాడ రూరల్ అభ్యర్థి అని అన్నారు. ఇంకా అభ్యర్థుల జాబితా విడుదల కాలేదని, విడుదలకు ముందే ఇలాంటి ఊహాగానాలపై చర్చ జరపడం సరికాదన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి ముగ్గురు పీయూసీ విద్యార్థులు..
- మరో ఘటనలో 9వ తరగతి విద్యార్థి మృత్యువాత
- చిత్రదుర్గ జిల్లాలో విషాద ఘటనలు

సాక్షి, బళ్లారి: వారు ముగ్గురు ప్రాణ స్నేహితులు. పీయూసీలో పరస్పరం స్నేహంగా మెలిగేవారు. పీయూసీ పరీక్షలు ముగుస్తున్నాయన్న సంతోషంతో సరదాగా ఈతకు వెళ్లిన ఆ యువకులకు అదే చివరి రోజు కావడంతో తోటి విద్యార్థులు, కుటుంబ సభ్యులకు తీవ్ర విషాదం మిగిల్చింది. చిత్రదుర్గ జిల్లాలో మంగళవారం సాయంత్రం వేర్వేరు ఘటనల్లో ఈతకు వెళ్లి నలుగురు విద్యార్థులు మృతి చెందారు. వివరాలు.. చిత్రదుర్గ జిల్లా హొళల్కెరె తాలూకా నందనహొసూరుకు చెందిన గిరీష్(18), హొరకెరె దేవరపుర గ్రామానికి చెందిన సంజయ్(19), జోగిహళ్లికి చెందిన మనోజ్(19) అనే ముగ్గురు పీయూసీ విద్యార్థులు హొరకెరె దేవరపుర గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహ కళాశాలలో పీయూసీ చదువుతున్నారు. పరీక్షలు ముగుస్తున్నాయనే సంతోషంతో స్నేహితులతో కలిసి స్థానిక గుండికెరె చెరువు వద్దకు ఈతకు వెళ్లారు. ఇందులో ఒకరికి మాత్రమే ఈత వస్తుండటంతో మరో ఇద్దరు కూడా ఈత కొట్టేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు ముగ్గురు విద్యార్థులు నీటిపాలయ్యారు.

అరగంట ముందే ఇన్‌స్టాలో పోస్ట్

అంత కన్నా అరగంట ముందు ఒక విద్యార్థి ఇన్‌స్టాగాంలో పీయూసీ ఇక ముగుస్తోంది, సంతోషంగా ఉందని, ఈత కొడుతున్నామని పోస్ట్ చేసిన అరగంటలోపే నీటిలో మునిగిపోయారని వార్త తెలియగానే తోటి విద్యార్థులు, అధికారులు ఘటనా స్థలం వద్దకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. హొళల్కెరె సమీపంలో మరో 9వ తరగతి విద్యార్థి శశాంక్ కూడా హొన్నకెరె చెరువులో తోటి స్నేహితులతో ఈతకు వెళ్లి నీట మునిగిపోయాడు. దీంతో హొళల్కెరె తాలూకాలో ఈతకు వెళ్లి ఒకే రోజు నలుగురు విద్యార్థులు మృత్యువాత పడటం ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. స్థానిక పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు చోట్ల జేడీఎస్ అభ్యర్థులు పోటీ

బళ్లారిటౌన్: జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో జేడీఎస్ అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ నేత మీనళ్లి తాయణ్ణ పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లాధ్యక్షుడు సోమలింగనగౌడతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికే 93 నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను తమ పార్టీ అధినాయకత్వం విడుదల చేసిందన్నారు. ఏప్రిల్ 3లోగా మిగతా అన్ని నియోజకవర్గాల జాబితాను విడుదల చేస్తారన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లపై ప్రజలు విరక్తితో జేడీఎస్‌పై మొగ్గు చూపుతున్నారన్నారు. ఈక్రమంలో 123 నియోజకవర్గాల్లో తమ పార్టీ గెలుపు సాధిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. పంచరత్న ప్రణాళికతో ప్రజల ముందుకు వెళుతున్నామన్నారు. ఈ ప్రణాళికలో రైతులకు, నిరుద్యోగులు, సామాన్య, పేద వర్గాలకు అనుకూలంగా పథకాలు ఉన్నాయన్నారు. కంప్లి నియోజకవర్గంలో రాజునాయక్‌కు, బళ్లారిలో మున్నాబాయ్, సిరుగుప్పలో పరమేశ్వర్ నాయక్ బరిలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ నేతలు మున్నాబాయ్, బండేగౌడ, లక్ష్మీకాంతరెడ్డి, విజయ్‌కుమార్, గౌసియా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మీనళ్లి తాయణ్ణ తదితరులు

బల్లి పడిన ఆహారం తిని 35 మంది విద్యార్థులకు అస్వస్థత

- సకాలంలో చికిత్సతో తప్పిన ప్రాణాపాయం

హుబ్లీ: బల్లి పడిన ఆహారం తిని 35 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన నవలగుంద తాలూకాలోని గుడిసాగర గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. తక్షణమే పిల్లలను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. సుమారు 36 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు కనిపించాయి. విషయం తెలుసుకున్న తక్షణమే సలవడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి స్కూల్‌కు చేరుకొని అక్కడే ప్రాథమిక చికిత్స అందించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం నవలగుంద తాలూకా ఆస్పత్రిలో చేర్పించారు. విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నట్లు జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ శశిపాటిల్ తెలిపారు. కాగా డీఎస్ఓ డాక్టర్ సుజాత, ఆర్‌సీహెచ్ఓ డాక్టర్ ఎస్ఎం.వనకేరి తాలూకా ఆస్పత్రిలోనే ఉండి విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించారు.

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు

బళ్లారిఅర్బన్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నియమావళిని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్లు జిల్లాధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు, 40 శాతం పైగా ఉన్న దివ్యాంగులకు పోస్టర్ బ్యాలెట్ వ్యవస్థ కల్పిస్తున్నట్లు తెలిపారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 11,40,899 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ సారి కొత్త ఓటర్లుగా 36,500 మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతతో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సమయంలో అక్రమాలపై ప్రజలు ఆన్‌లైన్ సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎస్పీ రంజిత్‌కుమార్, ఏడీసీ మహమ్మద్ జుబేర్ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

హొసపేటె: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నియమావళిని కేంద్ర ఎన్నికల అధికారి బుధవారం ప్రకటించడంతో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విజయనగర జిల్లాధికారి టీ.వెంకటేష్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, నాయకుల బ్యానర్లు, పోస్టర్లను తొలగించే పనిని ప్రారంభించామన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సరిహద్దుల్లో 23 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీ సీఈఓ ప్రభు, ఎస్పీ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

బాలాంజనేయ హుండీ లెక్కింపు

గంగావతి: అంజనాద్రిబెట్టపై వెలిసిన బాలాంజనేయ స్వామి ఆలయ హుండీని బుధవారం రెవెన్యూ శాఖ అధికారులు తెరిచి లెక్కించారు. హుండీలో రూ.10.65 లక్షల సొమ్ము లభించింది. ఇందులో 2 విదేశీ నాణేలు ఉండటం విశేషం. ఈ లెక్కింపు ప్రక్రియలో రెవెన్యూ శాఖ ఆర్ఐలు మహేష్, మంజునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరసభ ఉపాధ్యక్షురాలి చాంబర్ ప్రారంభం

గంగావతి: నగరసభ ఉపాధ్యక్షురాలు సుధా సోమనాథ్ చాంబర్‌ను కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఇటీవల ఆమె సభ్యత్వ రద్దు విషయంలో కోర్టు తాత్కాలికంగా స్టే ఇస్తూ ఇచ్చిన తీర్పుతో ఉపాధ్యక్షురాలుగా సుధా సోమనాథ్ బాధ్యతలను స్వీకరించారు. కాగా ఆమె, ఆమె భర్త సోమనాథ్ తమ మద్దతుదారులతో ఇటీవల కేఆర్‌పీపీలో చేరిన సంగతి విదితమే.

కేఆర్‌పీపీలోకి అడ్వకేట్ చేరిక



గాలి జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన మాలతి శ్రీనివాస్

గంగావతి రూరల్: కల్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ) వ్యవస్థాపకులు గాలి జనార్దన్ రెడ్డి సమక్షంలో బుధవారం అడ్వకేట్ వి.మాలతి శ్రీనివాస్ ఆ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యావంతుడైన కనకగిరి అభ్యర్థి డాక్టర్ దాసరి చారుల్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ప్రజల్లో పార్టీకి మంచి స్పందన ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు పార్టీలో చేరగా అభ్యర్థి డాక్టర్ దాసరి చారుల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దానిమ్మ సాగులో నష్టాలు

- కౌలు రైతు ఆత్మహత్య

కూడేరు: అనంతపురం జిల్లా కూడేరు మండల పరిధిలోని కడదరకుంట గ్రామంలో లింగుట్ల రామాంజనేయులు (39) అనే కౌలు రైతు బుధవారం తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. కర్ణాటకలోని కంప్లి సమీపంలోని సుగ్గేనహళ్లికి చెందిన లింగుట్ల రామాంజనేయులు అనంతపురంలో కాపురం ఉంటున్నాడు. నాలుగేళ్ల క్రితం కడదరకుంటకు చెందిన కురుబ రామాంజనేయులు పొలాన్ని 10 ఏళ్లకు గుత్తకు తీసుకున్నాడు. అందులో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి దానిమ్మ పంటను సాగు చేశాడు. అయితే గత రెండేళ్ల నుంచి పంటకు తెగుళ్లు సోకడం, అధిక వర్షాలతో పంట దెబ్బతింది. దీంతో పెట్టుబడికి చేసిన అప్పులు అధికమయ్యాయి. విరక్తి చెందిన రామాంజనేయులు పొలంలోనే పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు. ఆలస్యంగా తోటలో పని చేసే వ్యక్తి గమనించి తోటి రైతులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. ఆయనకు భార్య దాక్షాయణి, ఇద్దరు కూతుర్లున్నారు. అప్పుల బాధతోనే మృతి చెందినట్లు భార్య ఫిర్యాదుతో కేసునమోదు చేశారు.



రామాంజనేయులు మృతదేహం

కోలారు వార్తలు...

పిల్లల చదువుపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌కుమార్

శ్రీనివాసపురం: తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకు మొదటి ప్రాధాన్యత నివ్వాలని ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ తెలిపారు. బుధవారం గౌడహళ్లిలో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తాలూకాలోని చెరువులు కేసీ వ్యాలీ నీటితో నిండడం వల్ల రైతుల వ్యవసాయ అవసరాలకు ఇబ్బంది లేదన్నారు. అన్ని గ్రామాల్లోను మౌలిక సౌకర్యాలను కల్పించామన్నారు. చేసిన అభివృద్ధిని గుర్తించి తనను మళ్లీ గెలిపించాలని కోరారు. జీపీ అధ్యక్షుడు రవికుమార్, కోముల్ డైరెక్టర్ ఎస్ హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కరగ మహోత్సవం



కరగ మహోత్సవం దృశ్యం

మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో పురాతన ముత్యాలమ్మ ఆలయంలో 69వ సంవత్సర కరగ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల 9 గ్రామాలకు చెందిన వహ్నికుల సముదాయం వారు ఇందులో పాల్గొనగా పోత రాజు, భరత పూజారి కిట్టప్ప వేదమంత్ర పారాయణం తరువాత కరగ ఉత్సవం ప్రారంభమైంది. పూజారి డీఎం చంద్రు కరగను మోస్తూ చేసిన నృత్యం ఆకట్టుకుంది.

గుండెపోటుతో యువకుడి మృతి

గంగావతి: అంజనాద్రి కొండ పైకెక్కుతూ ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. జిల్లాలోని కుష్టగి తాలూకా వనగేరి గ్రామానికి చెందిన లింగప్ప(24) కొండ మెట్లు ఎక్కుతూ మూర్ఛపోయి కింద పడగా తన వెంట వచ్చిన స్నేహితుడు ఆటోలో ఆనెగుంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాడు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం గంగావతికి తరలించారు. ఆస్పత్రిలో చేర్చగా వైద్యులు పరిశీలించి ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు ధృవీకరించారు.

ఏపీఎంసీని సందర్శించిన ఏపీ బృందం

కోలారు: ఆసియాలోనే అతి పెద్ద టమోటా మార్కెట్ అయిన కోలారు ఏపీఎంసీ మార్కెట్ యార్డును బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని ములకలచెరువుకు చెందిన ఏపీఎంసీ సమితి సభ్యులు సందర్శించారు. సమితి అధ్యక్షురాలు సి.రజని కోలారు ఏపీఎంసీ మార్కెట్ యార్డును చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ఏపీఎంసీ మార్కెట్లను ములకలచెరువు ఏపీఎంసీ సమితి సభ్యులు సందర్శించి, ఇక్కడకు వచ్చిన సమితి సభ్యులకు కోలారు ఏపీఎంసీ కార్యదర్శి ఎస్ విజయలక్ష్మి స్వాగతం పలికి మార్కెట్ యార్డులో అందిస్తున్న సౌలభ్యాల గురించి వివరించారు. మార్కెట్ యార్డు విస్తరణకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని, మార్కెట్ ప్రాంగణంలోనే బ్యాంకింగ్ సౌలభ్యాన్ని కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సహాయక కార్యదర్శి మునిరాజు, శశిధర్, అరుణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డును సందర్శించిన ములకలచెరువు ఏపీఎంసీ సభ్యులు

వీధి వ్యాపారుల సమస్యలు తీరుస్తా

కోలారు : వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే నగరంలోని వీధి వ్యాపారులకు తగిన సౌలభ్యాలను కల్పిస్తానని జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్ తెలిపారు. బుధవారం నగరంలోని హెపీ ప్యాలెస్‌లో వీధి వ్యాపారుల సంఘం కార్యకర్తలు తనకు మద్దతు ప్రకటించిన నేపథ్యంలో వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. వీధి వ్యాపారులకు 500 తోపుడుబండ్లను, సంఘం సభ్యుల కోసం సొంత కార్యాలయాన్ని నిర్మించి ఇస్తానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైతే వీధి వ్యాపారుల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరిస్తానన్నారు. జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు బణకనహళ్లి నటరాజ్, సుధాకర్, రఫీక్, సలీంపాషా పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న అభ్యర్థి డాక్టర్ దాసరి చారుల్

గంగావతి రూరల్: కారటగి తాలూకాలోని వివిధ గ్రామాల్లో బుధవారం కనకగిరి అసెంబ్లీ నియోజకవర్గ కేఆర్‌పీపీ అభ్యర్థి డాక్టర్ దాసరి చారుల్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలు, క్యాంపుల్లోని సమస్యలపై ప్రజలు అభ్యర్థి దృష్టికి తేగా ఆయన తక్షణం స్పందించి సంబంధిత అధికారులకు మొబైల్ ద్వారా సమస్యలను పరిష్కరించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మీసాల రాజు, రాఘవేంద్ర, శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకటేశ్, దుర్గప్ప, మారెప్ప, తామ్రపల్లి క్యాంపు వెంకణ్ణ, రామణ్ణ, సిద్దప్ప పాల్గొన్నారు.

హైమాక్స్ దీపాలు ప్రారంభం



దీపాలను ప్రారంభించిన ప్రముఖులు

కేజీఎఫ్: తాలూకాలోని మారికుప్పంలో నూతనంగా అమర్చిన హైమాక్స్ దీపాలను బుధవారం జీపీ అధ్యక్షురాలు జలజాక్షి శివ ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధులతో గ్రామంలో ఈ దీపాలను అమర్చినట్లు తెలిపారు. సాయంత్రం కాగానే గ్రామంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ విద్యుత్ దీపాలు చీకటికి తమంతట తామే వెలుగుతాయన్నారు. ఉదయం సూర్యుని వెలుగు రాగానే విద్యుత్ దీపాలు తమంత తామే ఆరిపోతాయన్నారు. దీని వల్ల విద్యుత్ ఆదా కావడమే కాకుండా విద్యుత్ ఛార్జీలు కూడా తగ్గుతాయన్నారు. అన్ని జనవసతి ప్రాంతాల్లోను ఈ ఎల్ఈడీ దీపాలను అమర్చామన్నారు.

రిజర్వేషన్లు కొనసాగించాలి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మైనార్టీలకు రిజర్వేషన్లు కొనసాగించాలని వెనుకబడిన వర్గాల వేదిక జిల్లాధ్యక్షుడు శాంతప్ప డిమాండ్ చేశారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్‌ను తొలగించి ఇతరులకు కేటాయించడం తగదన్నారు. మైనార్టీలకున్న 2బీ రిజర్వేషన్‌ను బీసీలకు అమలు చేయాలని కోరారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌జెండర్లను ఆదరించాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మల్లికార్జున గౌడ

శివమొగ్గ: ట్రాన్స్‌జెండర్లను చిన్నచూపు చూడకుండా అందరితో సమానంగా గౌరవంగా చూడాలని శివమొగ్గ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మల్లికార్జున గౌడ సూచించారు. జిల్లా యంత్రాంగం, న్యాయ సేవల ప్రాధికార, రాష్ట్ర మహిళా భివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో శివమొగ్గ నగరంలోని డీఏఆర్ సమావేశం హాలులో బుధవారం ట్రాన్స్‌జెండర్లకు నిర్వహించిన సదస్సులో జడ్జి పాల్గొని మాట్లాడారు. మన ఇంటిలో దివ్యాంగులు జన్మిస్తే ఎంతో శ్రద్ధగా చూస్తామని, అయితే ట్రాన్స్‌జెండర్ల పట్ల చిన్నచూపు చూస్తున్నారన్నారు. ట్రాన్స్‌జెండర్లు కూడా మనుషులేనని, వారితో కలిసిమెలసి ఉండాలన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రం



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

దొడ్డబళ్లాపురం: రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని ఖండిస్తూ బెంగళూరు గ్రామీణ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాయకులు ధర్నా చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రప్రభుత్వం ప్రజాప్రభుత్వాన్ని ఖూనీ చేస్తోందన్నారు. భారతదేశంలోని బ్యాంకులను నిండా ముంచి విదేశాలకు పారిపోయిన దొంగలకు మోదీ కొమ్ముకాస్తుండడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ధర్నాలో దొడ్డ తాలూకా తాజా మాజీ ఎమ్మెల్యే వెంకటరమణయ్య,జిల్లా కాంగ్రెస్ కమిటీ నేతలు లక్ష్మీపతి, హేమంతరాజు, సీఆర్ గౌడ పాల్గొన్నారు.

గోవులు, దూడలు స్వాధీనం

మైసూరు: అక్రమంగా కసాయి ఖానాకు తరలిస్తున్న గోవులను ఎన్‌ఆర్ పోలీసులు అడ్డుకుని అందులోని 23 గోవులను రక్షించారు. మండీ మోహల్లాలోని ఖబరస్తాన్ రోడ్డులో వస్తున్న వ్యాన్‌ను అడ్డుకుని తనిఖీలు చేయగా, గోవులు కనిపించాయి. ఇందులో 16 గోవులతో పాటు 6 దూడలు ఉన్నాయి. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాహనంలోని వ్యక్తి పరారయ్యాడు.

బైక్ ప్రమాదంలో బాలుడు మృతి

మైసూరు: క్రేన్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో బాలుడు ఒకరు మృతి చెందిన సంఘటన పిరియా పట్టణ వద్ద చోటు చేసుకుంది. పిరియా పట్టణ తాలూకాలోని అంకనహళ్లి కొప్పలులో మసీదులో పనిచేసే వ్యక్తి కుమారుడు మహ్మద్ తౌఫిక్(4) మృతుడు. ఇతను తండ్రి ఖాన్‌తో కలిసి బైకులో పిరియా పట్టణ నుంచి అంకనహళ్లి కొప్పలుకు వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన క్రేన్ వాహనం బైక్‌ను ఢీకొట్టింది. బాలుడు తీవ్ర గాయాలతో మృతి చెందాడు. తండ్రికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో కారు దగ్ధం

- వాహనంలో కాలిన మృతదేహం



కాలిపోయిన కారు

దొడ్డబళ్లాపురం: ఓ కారు అనుమానాస్పద స్థితిలో దగ్ధమైన ఘటన కొడిగేహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భద్రప్ప లేఔట్ వద్ద కాలిపోయిన కారును స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. కారులో వ్యక్తి మృతదేహం కాలిపోయి ఉన్నట్లు గుర్తించారు. ఇతర ప్రాంతాల్లో హత్య చేసి ఇక్కడకు తెచ్చి నిప్పంటించినట్లు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

101 లీటర్ల మద్యం స్వాధీనం

దొడ్డబళ్లాపురం: చిక్కజాల పోలీస్‌స్టేషన్ పరిధిలో నవరత్న అగ్రహార గ్రామంలో కిశోర్‌కుమార్, మునియన్న అనే వ్యక్తులు కిరాణాదుకాణాలు నిర్వహిస్తూ వాటి ముసుగులో మద్యం విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి నిందితుల నుంచి 101 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

హిందీ వినియోగంపై ఆగ్రహం

దొడ్డబళ్లాపురం: నందిని పెరుగు ప్యాకెట్‌పై దహి(పెరుగు)అనే హిందీ పదాన్ని ముద్రించడంపై కన్నడ భాషా ఉద్యమనేత రూపేశ్ రాజన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు దహి అంటారు రేపు నందిని దూధ్, నందిని పానీ అంటారని, ఇలాగే వదిలేస్తే ప్రతీ విషయంలోనూ హిందీ తప్పనిసరి చేస్తారని ట్వీట్ చేశారు. గుజరాతీల నుంచి కేఎంఎఫ్‌ను రక్షించండంటూ యశ్వంతపుర్‌లో మాజీ సీఎం కుమారస్వామికి కన్నడాభిమానులు విన్నవించారని, కన్నడపై వారికి ఉన్న అభిమానానికి ఇది నిదర్శనమన్నారు.

జోరందుకున్న తాయిలాల పర్వం

- ఓటర్లకు కుక్కర్లు, చీరలు, నగదు పంపిణీ
- ఎన్నికల కమిషన్, పోలీసులు నిఘా



సాక్షి, బెంగళూరు: రాష్ట్ర విధానసభ ఎన్నికలకు సమయం ఎక్కువగా లేదు. ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆయా పార్టీల అభ్యర్థులు, ఆశావహులు నిమగ్నమై ఉన్నారు. ఎలాగైనా ఈ ఎన్నికల్లో గెలుపొంది తీరాలని ఎవరికి వారు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు ఓటర్ల మనసులు గెలుచుకునేందుకు కొన్ని పార్టీల నేతలు, ఆశావహులు నగదు, హెల్మెట్లు, కుక్కర్లు, చీరలు తదితర బహుమానాలను పంచడం చేపట్టారు. ఎన్నికల సంఘం అధికారులు కొన్నిచోట్ల దాడులు జరిపి కానుకలను జప్తు చేస్తోంది.

విస్తృతంగా తనిఖీలు

డబ్బు, వస్తువులు, వెండి బంగారు కానుకల పంపిణీ ఎన్నికలు రాగానే ఊపందుకుంటుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసులు బెంగళూరు వ్యాప్తంగా కట్టుదిట్టమైన నిఘా ఉంచారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో తాత్కాలిక చెక్‌పోస్టులను తెరిచారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ సంఖ్య, డ్రైవర్ల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు.

వివిధ మార్గాల్లో ప్రలోభాలు

ఎంత పటిష్ట నిఘా ఉంచినా పోలీసులు, ఎన్నికల సంఘం అధికారులు, జీఎస్టీ అధికారులు, సిబ్బంది కళ్లుగప్పి టికెట్ ఆశావహులు, అభ్యర్థులు, వారి మద్దతుదారులు బహుమానాలను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఆయా బహుమానాలను ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. మరి కొంతమంది అయితే ముందస్తుగా ఓటర్లకు టోకెన్లను ఇచ్చి నిర్ణీత దుకాణాల్లో నిత్యావసర సరుకులను తీసుకునే వెసులుబాటును కల్పించారు. చేతి గడియారాలు, వెండి దీపాలు, హెల్మెట్, కుక్కర్లు, మిక్సీలు, టీవీలు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు ఇందులో ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థులు తామేమీ తక్కువ కాదన్నట్లు ముందుకు వస్తున్నారు. కాగా, వాణిజ్య పన్నుల శాఖ ఈ తనిఖీల్లో ముందంజలో ఉంది. రసీదు లేకుండా సరుకుల రవాణా చేసిన, అక్రమంగా గోడౌన్‌లో వస్తువులను దాచినా, అనుమానాస్పద కొనుగోళ్లు చేసినా పట్టేస్తోంది. సరుకు రవాణాకు సంబంధించి ఈ-ఇన్‌వాయిస్, ఈవే బిల్, సరుకు ప్రమాణం, కొనుగోలు దారుడు, సరఫరా దారుడు, చిరునామా తదితర సమాచారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.

రౌడీలకు హెచ్చరికలు

ఎన్నికల్లో ఓటర్లను బెదిరించడంలో రౌడీలు ముందుంటారు. అందుకే రౌడీలపై పోలీసు శాఖ ఒక కన్నేసింది. రౌడీషీటర్ల నడవడికపై నిఘా పెంచింది. రౌడీషీటర్లుగా ముద్రపడిన వారిని ముందస్తుగా పోలీసు స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు జారీ చేస్తోంది. అలాగే ప్రమాదకరంగా అనిపించే ప్రముఖ రౌడీషీటర్లను నగర బహిష్కరణ చేస్తోంది. అలాగే పలువురు రౌడీషీటర్ల ఇంటిపై గస్తీ కాసే పోలీసులు హఠాత్తుగా తనిఖీలు చేస్తున్నారు. పలు మారణాయుధాలను స్వాధీనం చేసుకుంటున్నారు.

రూ.13 లక్షల గంజాయి స్వాధీనం



గంజాయితో నిందితురాలు నగ్మా

దొడ్డబళ్లాపురం: బెంగళూరు కళాసి పాళ్య పోలీసులు ఓ మహిళను అరెస్ట్ చేసి రూ.13లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నగ్మా అనే మహిళ తన భర్తతో కలిసి గంజాయి విక్రయిస్తోంది. పిల్లలను రైళ్లలో ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి వారి ద్వారా గంజాయిని నగరానికి తీసుకొచ్చేవారు. ఈక్రమంలో ఆరు నెలల క్రితం గంజాయి విక్రయిస్తూ నగ్మ భర్త పోలీసులకు పట్టుబడ్డాడు. తాజాగా నగ్మా కలాసిపాళ్య కార్పొరేషన్ సర్కిల్‌లో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేశారు. నగ్మను అరెస్ట్ చేసి రూ.13 లక్షల విలువైన 26కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

బనశంకరి: కాలేజీ వద్ద గంజాయి విక్రయిస్తున్న అనేకల్ సోమశేఖర్, రాఘవేంద్ర అనే ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్లను బుధవారం అనేకల్ పోలీసులు అరెస్టుచేశారు. వీరి వద్ద నుంచి రూ.15 లక్షల విలువచేసే 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదుచేసి విచారణచేపడుతున్నారు.

మైసూరు: మడికేరిలో గంజాయి విక్రయస్తున్న అసోంకు చెందిన సైపుల్ ఇస్లాం(28), అనార్ హుస్సేన్(37), జహీర్ అలీ(28)ని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 2.151 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వాహనాలు ప్రభుత్వానికి అప్పగింత

బనశంకరి: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో మంత్రులు తాము వినియోగిస్తున్న అధికారిక వాహనాలను అధికారులకు అప్పగించారు. మంత్రి నారాయణగౌడ కేఆర్.పేటలోని తమనివాసంలో కారుకు పూజలు నిర్వహించిన అనంతరం ప్రభుత్వానికి అప్పగించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారుల విలేకరుల సమావేశం అనంతరం సీఎం నివాసంలో ఉన్న రెండు ప్రభుత్వ వాహనాలు అక్కడ నుంచి నిష్క్రమించాయి. మంత్రులు వీ.సోమణ్ణ, మునిరత్న ప్రైవేటు కార్లలో ప్రయాణించారు.

11 స్థానాల్లో విజయం సాధిస్తాం

తుమకూరు : విధానసభ ఎన్నికల్లో జిల్లాలోని 11 స్థానాల్లో బీజేపీ విజయదుందుభి మోగిస్తుందని మాజీ ఎంపీ ఎస్.పీ. ముద్దహనుమేగౌడ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ పాలనను మెచ్చి మరోమారు ప్రజలు తమ పార్టీకి అధికారం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

సైనికుల చలువ వల్లే సురక్షితంగా ఉన్నాం



ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి

- జనరల్ బిపిన్ రావత్ కంచు విగ్రహం ఆవిష్కరణలో ఎమ్మెల్యే

బొమ్మనహళ్లి: హెలికాప్టర్ ప్రమాదంలో అసువులుబాసిన భారత్ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ కంచు విగ్రహాన్ని నగరంలోని హెచ్ ఎస్ఆర్ లేఔట్ 6వ సెక్టార్‌లో ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆ కూడలికి జనరల్ బిపిన్ రావత్ సర్కిల్‌గా నామాకరణం చేశారు. అనంతరం విశ్రాంత సైనికులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఆయన ఆయన మాట్లాడుతూ సైనికుల చలువ వల్లనే దేశంలోని ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. కుటుంబ సభ్యులను కూడా వదిలి దేశ రక్షణలో నిమగ్నమైన సైనికులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో బీబీఎంపీ జాయింట్ కమిషనర్ కృష్ణమూర్తి, బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ గురు మూర్తి రెడ్డి, బీజేపి నాయకుడు ఎ.ఎం.నరసింహ మూర్తి, ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి బీఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో సీఎం పర్యటనలు రద్దు

శివాజీనగర: విధానసభ ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇప్పటికే ఖరారైన సీఎం పర్యటనలు రద్దయ్యాయి. ఎన్నికల నియమావళి ప్రక్రియ బుధవారం నుంచి అమలుకోకి వచ్చింది. దీంతో బుధవారం మూడు జిల్లాల్లో చేపట్టాల్సిన జిల్లా పర్యటనలను సీఎం రద్దు చేసుకున్నారు. ధార్వాడ, కొప్పళ, హావేరి జిల్లాల్లో పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఎన్నికల షెడ్యూలు వెలువడటంతో ఆ కార్యక్రమాలు రద్దయ్యాయి.

ఆంధ్రాభోజనం ఆరగించిన బొమ్మై

సీఎం బసవరాజబొమ్మై బుధవారం మధ్యాహ్నం శివాజీనగర ప్రాంతంలో ఉన్న ఈడెన్ పార్కును సందర్శించారు. ఎలాంటి హడావుడి లేకుండా హోటల్‌కు వచ్చిన ఆయన ఆంధ్రశైలి భోజనాన్ని ఆరగించారు. ఇదే హోటల్‌లో భోజనానికి వచ్చిన ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు ఎం.సి. శ్రీనివాస్, అధికార ప్రతినిధి కత్తి వెంకటేశ్ సీఎంను కలిశారు. న్యాయమూర్తి సదాశివ కమిషన్ నివేదికపై కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినందుకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ఉపయుక్తం

సాక్షి బెంగళూరు: సాంకేతిక విద్యలో జాతీయ విద్యా విధానాన్ని (ఎన్‌ఈపీ) అమలు చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయం (వీటీయూ) చాన్స్‌లర్ డాక్టర్ ఎస్.విద్యాశంకర్ తెలిపారు. వర్సిటీ పరిధిలోని నాగార్జున ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహించిన రెండు రోజుల యువ ఉత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాంకేతిక విద్యలో ఎన్‌ఈపీ అమలు ద్వారా విద్యార్థులు తమకు ఇష్టమైన అంశాన్ని ఎంచుకుని చదువుకునేందుకు వీలవుతుందన్నారు. ఎన్‌ఈపీ అమలు వల్ల విద్యా రంగంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయన్నారు.



చాన్స్‌లర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ హయాంలోనే శిర అభివృద్ధి

తుమకూరు : శిరా తాలూకా కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి చెందిందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి శ్రమించాలని మాజీ మంత్రి టిబీ జయచంద్ర కార్యకర్తలకు సూచించారు. గౌడగెరె సమీపంలో ఉన్న బెట్టప్పనహళ్లిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన హయాంలో రూ.3250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా ప్రస్తుత ఎమ్మెల్యే భూమి పూజలకే పరిమితం అయ్యారన్నారు.

తరగతి గదిలో డిష్యూం..డిష్యూం

బనశంకరి: కాలేజీ తరగతి గదిలో ఇద్దరు విద్యార్థుల మధ్య వాగ్వాదం జరిగి కొట్లాటకు దారి తీసింది. ఈక్రమంలో ఒకరిపై ఒకరు భౌతికదాడులు చేసుకున్నారు. ఈ దృశ్యాలను ఓ విద్యార్థి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. బెంగళూరు నేరవిభాగం పోలీస్‌పేజీకు ట్యాగ్ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఈ ఘటన ఎక్కడ జరిగిందనేది తెలియరాలేదు.

ఆరు బైక్‌లు స్వాధీనం

బనశంకరి: చోరీలకు పాల్పడుతున్న రాజరాజేశ్వరి నగర చెన్నసంద్ర లేఔట్ నివాసి మంజునాథ అలియాస్ మంజు (35) అనే దొంగను కెంగేరి పోలీసులు అరెస్ట్‌చేశారు. నిందితుడినుంచి రూ.2 లక్షల విలువైన 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. భీమాశంకర్ అనే వ్యక్తి తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాన్ని నిందితుడు మంజునాథ చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు.

అన్నదాత బలవన్మరణం

మైసూరు: అప్పుల బాధతో అన్నదాత బలవన్మరణం చెందాడు. వివరాలు..మైసూరు జిల్లా పిరియా పట్టణ తాలూకా కొరగళ్ల గ్రామానికి చెందిన కృష్ణమూర్తి (43) తన 5 ఎకరాల్లో రాగి, పొగాకు, మొక్క జొన్న సాగు చేశాడు. పెట్టుబడుల కోసం సీగూరు ఎస్‌బీఐ బ్యాంకులో తల్లిదండ్రుల పేరుతో 5.5 లక్షలు, వడ్డీ వ్యాపారుల వద్ద రూ.4 లక్షలు రుణం తీసుకున్నాడు. పంటలు సరిగా పండక నష్టాలు వచ్చాయి. అప్పులు తీర్చే మార్గం కనిపించక పొలంలో బావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బెట్టదపుర పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాజు

చిక్కబళ్లాపురం: విధానసభ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ఆర్ నాగరాజు అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అమలులోకి వచ్చిన కోడ్‌ను పటిష్ఠంగా అమలు చేస్తామన్నారు. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఉండగా 10,40,526 మంది ఓటర్లు ఉన్నారని, 1281 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు ఏప్రిల్ 11వరకు గడువు ఉందన్నారు. సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు ఎన్నికల అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ నాగేశ్ పాల్గొన్నారు.

పూర్తి మెజార్టీతో అధికారంలోకి వస్తాం

శివాజీనగర: విధానసభ ఎన్నికల్లో పూర్తి మెజార్టీతో అధికారంలోకి వస్తామని, బీజేపీ 60 నుంచి 65 స్థానాలకు పరిమితం అవుతుందని కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల అంశం కోర్టులో నిలవదన్నారు. బీజేపీవారు చేసిన తప్పును తాము సరిచేస్తామన్నారు. కాంగ్రెస్ బోగస్సా, బీజేపీ బోగస్సా అనేది ఓటర్లు నిర్ణయిస్తారన్నారు. మహదాయికి గ్రీన్ సిగ్నల్ ఎక్కడ లభించిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిని ఆయన ప్రశ్నించారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు శిక్ష

బనశంకరి: బాలికపై అత్యాచారానికి పాల్పడిన 21 ఏళ్ల యువకుడికి నగర పాస్ట్ ట్రాక్ కోర్టు పోక్సోచట్టం కింద పదేళ్లు కఠినకారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. 2017లో 14 ఏళ్ల వయసున్న బాలిక గొర్రెలు మేపడానికి బయల్దేరింది. అయితే మీ అవ్వ కింద పడిందని చెప్పి ఓ యువకుడు ఆ బాలికను తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో జిగణి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈకేసు బుధవారం విచారణకు రాగా నిందితుడిపై నేరం రుజువైంది.

జలమూలాల రక్షణ అందరి కర్తవ్యం



ప్రసంగిస్తున్న పర్యావరణ రక్షకుడు చౌడప్ప

గౌరిబిదనూరు: జలమూలాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ జడ్జి విజయదేవరాజ అరస్ అన్నారు. విశ్వజల దినోత్సవం సందర్భంగా బుధవారం కోర్టు ఆవరణలో తాలూకా న్యాయసేవా సమితి, వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్జి పాల్గొని మాట్లాడారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. పర్యావరణ రక్షకుడైన చౌడప్ప మాట్లాడుతూ ఏపీలో 700 కి.మీ.దూరం నుంచి కృష్ణా జలాలు తెచ్చి ప్రజల తాగునీటి అవసరాలు తీర్చుతున్నారన్నారు. ఇలాంటి ప్రయత్నం కర్ణాటకలో కూడా జరగాలన్నారు. కార్యక్రమంలో జడ్జి సచిన్ పిఎమ్, అడిషనల్ జడ్జి మంజునాథాచారి, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, రామదాసు, విజయరాఘవ, దయానంద్, పార్శ్వనాథ్, ఆదినారాయణగౌడ, రంగనాథ్ పాల్గొన్నారు.

దివ్యాంగుడు ఆత్మహత్య

మైసూరు: దివ్యాంగుడు నీటి గుంతలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చామరాజనగర జిల్లా గుండ్లుపేటె తాలూకా కల్లహళ్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహేష్, గీతామని దంపతులు గొడవ పడ్డారు. అదే గ్రామానికి చెందిన మహాదేవస్వామి(40) అనే దివ్యాంగుడు వారికి సర్దిచెప్పేందుకు వెళ్లాడు. అయితే గీతామణి అతనిపై వేడి నీళ్లు పోసి దుర్భాషలాడింది. తనకు అవమానం జరిగిందని ఆవేదనతో మహాదేవస్వామి వ్యవసాయ గుంతలో పడి ఆత్మ హత్య చేసుకున్నాడు. బేగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హోసూరు వార్తలు..

చురుగ్గా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న దృశ్యం

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలోని గుండుగురికి ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమంలో సూళగిరి యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యామధు పాల్గొన్నారు. సూళగిరి సమీపంలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పరిశ్రమ మొక్కలను నాటేందుకు ముందుకొచ్చింది. చైర్‌పర్సన్ మొక్కలు నాటి కారక్రమాన్ని ప్రారంభించారు. సమాజంలో ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు మొక్కలను పెంచడం చాలా అవసరమని, అందుకు సూళగిరి ప్రాంతంలోని వివిధ పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షులు గోపమ్మ చకార్లప్ప, టయోటా సతీష్, కుమార్, ప్రభాకరన్, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

కామాంధునికి జీవితఖైదు

హోసూరు: హోసూరు సమీపంలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన ఘటనలో దోషికి క్రిష్ణగిరి కోర్టు జీవితఖైదును విధించింది. వివరాలు.. హోసూరు సమీపంలోని శానసంద్రం ప్రాంతానికి చెందిన ముత్తు (32) 2014లో అదే ప్రాంతానికి చెందిన మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. హోసూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని ముత్తును అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి కేసు క్రిష్ణగిరి కోర్టులో జరుగుతూ వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి సుధ.. దోషి ముత్తుకి జీవిత ఖైదు, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

నకిలీ వైద్యుడు అరెస్టు

హోసూరు: హోసూరు సమీపంలో నకిలీ వైద్యున్ని మత్తిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. కుమారనపల్లి గ్రామంలో ఫార్మసీ డిగ్రీ చదివి వైద్యునిగా చెప్పుకుని క్లినిక్ నడుపుతున్న అశోక్‌కుమార్‌పై ఫిర్యాదులు రావడంతో ఆరోగ్యశాఖాధికారి రాజీవ్ గాంధీ, హోసూరు ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారిణి జ్ఞాన మీనాక్షి, రెవిన్యూ అధికార్లు క్లినిక్‌కు వెళ్లారు. అల్లోపతి ఔషధాలు, ఇంజెక్షన్‌లను స్వాధీనపరుచుకొని క్లినిక్‌కు సీల్ వేశారు. అశోక్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

పెరిగిన యువ ఓటర్ల సంఖ్య

శివాజీనగర: అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలతో చేపట్టిన జాగృతితో మంచి ఫలితాలు వచ్చాయని బెంగళూరు నగర జిల్లా పంచాయతీ సీఈఓ సంగప్ప తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జాగృతి కార్యక్రమాలకు యువ ఓటర్లు ఆకర్షితులు అయ్యారని, ఫలితంగా బెంగళూరు నగర జిల్లాలో యువ ఓటర్ల సంఖ్య 49 శాతానికి పెరిగిందన్నారు. ఆనేకల్, బెంగళూరు దక్షిణ, యశ్వంతపుర, దాసరహళ్లి, బ్యాటరాయనపుర, మహాదేవపుర, యలహంకలో గత ఎన్నికల్లో 54 వేల మంది యువ ఓటర్లు ఉండగా ఆ సంఖ్య 1.1 లక్షలు దాటిందని సంతోషం వ్యక్తం చేశారు. 16,000 లైంగిక అల్పసంఖ్యాకుల ఓటర్ల సంఖ్య 30 వేలకు చేరుకుందన్నారు.

హోసూరు దగ్గర ఏనుగుల దండు

హోసూరు: బెంగళూరు బన్నేరుగట్ట అటవీ ప్రాంతం నుంచి ఆనేకల్ అటవీ ప్రాంతం మీదుగా ఐదు ఏనుగులు హోసూరు సమీపంలోని సూతాళం గ్రామం వద్దకు చేరుకొన్నాయి. ఏనుగులను చూసేందుకు స్థానిక ప్రజలుపోటెత్తారు. ఈ ఐదు ఏనుగులు కుమారనపల్లి, చూడుగొండపల్లి ప్రాంతాలకు చేరుకొని ఆ ప్రాంత రైతులు పండిస్తున్న పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రైతులు అటవీ శాఖాధికార్లకు సమాచారం అందించారు. అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగుల సంచారంపై నిఘా పెట్టారు. హోసూరు కార్పొరేషన్ సరిహద్దులో ఏనుగులు సంచరిస్తున్నట్లు తెలుసుకొన్న స్థానిక ప్రజలు ఏనుగులను చూసేందుకు పోటెత్తారు.



సూతాళం వద్ద మకాం వేసిన ఏనుగులు

బైక్‌ను ఢీకొన్న కారు, మహిళ దుర్మరణం

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలేర్పడిన ఘటన కురుబరపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. బెంగళూరుకు చెందిన ఈశ్వరప్ప, కొడుకు శివలింగం (29). తల్లి వళ్లియమ్మ (46), బంధువు విద్య (15)లను తీసుకొని ద్విచక్రవాహనంలో క్రిష్ణగిరి సమీపంలోని మాదేపల్లిలో జాతరకెళ్లాడు. జాతర చూసుకుని మంగళవారం సాయంత్రం తిరిగి వెళ్తుండగా క్రిష్ణగిరి-హోసూరు హైవే కుందారపల్లి వద్ద కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వళ్లియమ్మ ఘటనా స్థలంలోనే మృతి చెందగా శివలింగం, విద్యలకు తీవ్ర గాయాలయ్యాయి. కురుబరపల్లి పోలీసులు మృతురాలిని, గాయపడినవారిని ఆస్పత్రికి తరలించారు.

ఆప్‌కు అవకాశం ఇవ్వండి



ఓటర్లకు అభివాదం చేస్తున్న నేతలు

బొమ్మనహళ్లి: ఢిల్లీ, పంజాబ్ తరహాలో అవినీతి లేని పాలన కోసం విధానసభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి అవకాశమివ్వాలని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సంజయ్ సింగ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం పులకేశి నగర నియోజకవర్గంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. పులకేశినగర అభ్యర్థి సురేష్ రాథోడ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బడిలో సరస్వతీ పూజ



ఉపాధ్యాయులతో విద్యార్థుల బృందం

కెలమంగలం: రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో పాస్ కావాలని డెంకణీకోట సమీపంలోని బాలతోటనపల్లి ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీరాములరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సరస్వతీ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. విద్యార్థులు కేక్‌ను కత్తిరించి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నేకల్ కాలువల పరిశీలన

హోసూరు: క్రిష్ణగిరి సమీపంలోని ఎన్నేకల్ డ్యాం నుంచి ఏర్పాటు చేస్తున్న కుడి, ఎడమ కాల్వ పనులను జిల్లా కలెక్టర్ దీపక్‌జేకబ్ బుధవారం పరిశీలించారు. ఎన్నేకల్ ఆనకట్ట నుంచి కాల్వలు ఏర్పాటు చేసి స్థానిక ప్రజలకు సాగునీరు అందజేయాలని, ఈ నీటిని ధర్మపురి జిల్లాలోని కరువు ప్రాతాలకు ఇవ్వాలని స్థానిక రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చారు. ప్రభుత్వం ఈ కాల్వల ఏర్పాటుకు రూ. 233 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం కాల్వల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నేకల్ ఆనకట్టకు దక్షిణ పెన్నానది నుంచి నీరు నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఆనకట్ట నుంచి ఇరువైపులా కాల్వలు ఏర్పాటు చేయడంతో 33 చెరువులకు నీరందుతుందని తెలిపారు.

ఎన్నికల్లో పోటీకి మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలి

శివాజీనగర: బెంగళూరు నగర వ్యాప్తిలో ఎస్సీలకు రిజర్వు చేసిన స్థానాల్లో పోటీ చేసేందుకు ఎస్సీల్లో అధిక జన సంఖ్య ఉన్న మాదిగలకు కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ అవకాశం ఇవ్వాలని కర్ణాటక బహుజన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాబు డిమాండ్ చేశారు. బుధవారం వివిధ దళిత సంఘాలతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఆనేకల్, మహదేవపురలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు కాకుండా ఎస్సీల్లోనే ఇతరులకు టికెట్లు ఇచ్చిందన్నారు. సీ.వీ.రామన్ నగర్, పులికేశినగరలో మాదిగలకు అవకాశం ఇవ్వాలని కోరారు. సీవీ రామన్ నగర్ నుంచి కే.వీ.గౌతమ్‌కు కాంగ్రెస్ తరఫున టికెట్ ఇవ్వాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఎం.సీ.శ్రీనివాస్, కత్తి వెంకటేశ్, త్రిలోక్‌చందర్, డేవిడ్ రంగన్న, సత్యనారాయణ, జగదీశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వివిధ దళిత సంఘాల నాయకులు

క్లుప్తంగా...

సీడ్ యాక్సెస్ రోడ్డులో విద్యుత్ కాంతులు

8.7 కి.మీ. మేర పనులకు శ్రీకారం

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్డీఏ పరిధిలోని అమరావతి నగరానికి అనుసంధాన మార్గమైన సీడ్ యాక్సెస్ రోడ్డులో బుధవారం విద్యుత్ దీపాల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. వెంకటపాలెం కూడలి నుంచి మందడం మీదుగా రాయపూడి వరకు సుమారు 8.7 కిలోమీటర్ల మేర సీడ్‌యాక్సెస్ రోడ్డు మధ్య విద్యుత్ దీపాలను బిగిస్తున్నారు. రాష్ట్ర హైకోర్టు, సచివాలయం, శాసనసభ వంటి ప్రాంతాలకు ఈ మార్గమే ప్రధాన రహదారి. ఈ మార్గంలో మొత్తం 290 విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ దీపాలను అమరుస్తున్నారు. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) మొత్తం రూ.2.89 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టింది.

జగన్‌ను తట్టుకోలేక పవన్ వద్దకే చంద్రబాబు వస్తారు

మాజీ ఎంపీ హరిరామజోగయ్య

పాలకొల్లు సెంట్రల్: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రజల్లో పలుకుబడి ఉందని, మెట్టు దిగి టీడీపీ అధినేత చంద్రబాబు దగ్గరకు వెళ్లాల్సిన అగత్యం జనసేనకు లేదని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య పేర్కొన్నారు. 'కాపులకో పిలుపు' పేరిట జోగయ్య బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీకే జనసేన అవసరం ఉందని పేర్కొన్నారు. హంగ్ ఏర్పడితే చంద్రబాబు సీఎం జగన్‌ను తట్టుకోలేరని.. గత్యంతరం లేని స్థితిలో పవన్‌ను ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెట్టక తప్పదని జోస్యం చెప్పారు. కాపులు విద్య, ఉద్యోగాలు లేక.. అగ్ర కులాలతో పోటీపడలేక, ఉపాధి కరువై రోజు కూలీలుగా, కార్మికులుగా, అసంఘటిత కార్మికులుగా జీవించే పరిస్థితుల్లో ఉన్నారని ఆ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

రేపటి ఆర్థిక నగరాలపై సమగ్ర చర్చ



రెండో రోజు సదస్సులో పాల్గొన్న స్వదేశీ, విదేశీ ప్రతినిధులు



విశాఖ సాగరతీరంలో ధ్యానం చేస్తున్న జీ-20 దేశాల ప్రతినిధులు

- మౌలిక సదుపాయాల కల్పన, వనరుల సమీకరణ.. అర్బన్‌లో సేవల విస్తృతం, అవకాశాలపై గురి
- ఇప్పటివరకు ఏడు సెషన్లు, ఒక వర్క్‌షాపు నిర్వహణ
- జూన్ ఆఖరులో రుషికేష్‌లో మూడో ఐడబ్ల్యూజీ సమావేశం
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన ఆతిథ్యం అద్భుతం
- కేంద్ర ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్

సాక్షి, విశాఖపట్నం: పట్టణాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు అందుకవసరమైన నిధుల సమీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై జీ-20 దేశాల ప్రతినిధుల బృందం సమగ్రంగా చర్చించింది. జీ-20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సమావేశాల్లో భాగంగా బుధవారం జరిగిన చర్చల వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ మీడియాకు వెల్లడించారు. రేపటి ఆర్థిక నగరాలు మరింత వృద్ధి చెందేందుకు తీసుకోవలసిన చర్యలు, ప్రైవేటు రంగంలోనూ పెట్టుబడులను పెంచడం వంటి అంశాలపైనా ప్రతినిధులు విస్తృతంగా చర్చించారన్నారు. ఈ సదస్సుకు 14 జీ-20 సభ్యదేశాల నుంచి 57 మంది ప్రతినిధులు, ఎనిమిది మంది ఆహ్వానితులు, పది అంతర్జాతీయ సంస్థల నుంచి మరికొంతమంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. మిగిలిన ఆరు సభ్య దేశాల ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారని ఆయన చెప్పారు. పట్టణాలు/నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెట్టుబడులను ప్రోత్సహించడం, ఆర్థిక వనరుల కోసం వినూత్న మార్గాలను గుర్తించడం వంటి వాటిపై చర్చ జరిగిందని తెలిపారు. సమావేశాల్లో భాగంగా ఇప్పటివరకు ఏడు సెషన్లు, ఒక వర్క్‌షాపు నిర్వహించారన్నారు.



సాల్మన్ ఆరోఖ్యరాజ్

అర్బన్ ప్రాంతాల్లో మౌలిక వసతులపై..

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల్లో క్వాలిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ (క్యూఐఐ) సూచికలను అన్వేషించడం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యయంపై డేటాను క్రోడీకరించడం, ప్రైవేటు రంగానికి ఆ డేటా ఉపయోగపడేలా చేయడంపై కూడా ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారని, వీటిపై కొన్ని ప్రెజెంటేషన్లు ఇచ్చారని ఆరోఖ్యరాజ్ వివరించారు. అర్బన్ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై అంతర్జాతీయ సంస్థల రౌండ్ టేబుల్ సమావేశం కూడా జరిగిందన్నారు. సుపరిపాలనకు ఏ రకమైన నైపుణ్యం అవసరమవుతుందో నిపుణులు సూచనలు చేశారని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో యూఎన్‌డీపీ, ఓఈసీడీ, ఐఎంఎఫ్, ఏడీబీ, ఈబీఆర్‌డీ వంటి కీలక అంతర్జాతీయ సంస్థలకు చెందిన 13 మంది నిపుణులు పాల్గొన్నారని ఆయన తెలిపారు. గత జనవరిలో పూణేలో జరిగిన జీ-20 ఐడబ్ల్యూజీ సదస్సులో చర్చకు వచ్చిన అంశాలపై విశాఖలో బ్లూప్రింట్ ఇచ్చామన్నారు.

బీచ్‌లో యోగా, ధ్యానం..

రెండో రోజు బుధవారం ఉదయం సదస్సు నిర్వహిస్తున్న రాడిసన్ బ్లూ హోటల్ సమీపంలో ఉన్న బీచ్‌లో జీ-20 దేశాల ప్రతినిధులకు యోగా, ధ్యానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా, మెడిటేషన్, పౌష్టికాహార వినియోగంపై సంబంధిత నిపుణులతో నిర్వహించిన కార్యక్రమంలో సాత్విక ఆహారాన్ని పరిచయం చేశారు.

రుషీకేష్‌లో మూడో సదస్సు..

జూన్ ఆఖరులో ఈ జీ-20 మూడో ఐడబ్ల్యూజీ సదస్సు రుషికేష్‌లో జరుగుతుందని ఆరోఖ్యరాజ్ వెల్లడించారు. విశాఖ సదస్సులో చర్చించిన అంశాలను పైలట్ స్టడీస్ కింద అక్కడ సమర్పిస్తారన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన ఆతిథ్యం ఎంతో బాగుందని అతిథులు ప్రశంసించారని ఆరోఖ్యరాజ్ తెలిపారు. అంతేకాదు.. సదస్సు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా వారి మనసు దోచుకున్నాయన్నారు. ముఖ్యంగా విశాఖ నగరంలోని తొట్లకొండ, కైలాసగిరి వ్యూపాయింట్, ఆర్కేబీచ్, సీహారియర్ మ్యూజియం, వీఎంఆర్‌డీఏ బీచ్‌లు అతిథులను కట్టిపడేశాయని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఏపీలో గృహనిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత గురించి మంగళవారం రాత్రి అతిథులకు ఇచ్చిన గాలా డిన్నర్‌లో వివరించారన్నారు.

నేడు, రేపు ఇలా..

ఇక గురువారం జీ-20 దేశాల ప్రతినిధుల కోసం కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపు జరుగుతుందని ఆరోఖ్యరాజ్ చెప్పారు. కొరియా, సింగపూర్‌లకు చెందిన నిపుణులు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్‌లో అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులపైన, పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన జీవన విధానంపైన చర్చిస్తారన్నారు. విశాఖ నగరంపై కూడా ఈ సమావేశంలో ప్రెజెంటేషన్ ఉంటుందని తెలిపారు. అలాగే, శుక్రవారం జరిగే సమావేశానికి దేశంలోని వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు హాజరవుతారని చెప్పారు.

విశాఖ.. కళాత్మక కీర్తి పతాక

జీ-20 సదస్సులు జరుగుతున్న నగరాల్లో విశాఖది ప్రత్యేకం

- నగరానికి కొత్త రూపు తీసుకొచ్చిన అంతర్జాతీయ విజువల్ ఆర్టిస్ట్ జాన్ రత్నబాబు
- రెండు వేల డిజైన్లతో కాన్సెప్ట్ పెయింటింగ్స్ రూపొందించిన ఏఎన్‌యూ ప్రొఫెసర్
- మ్యూరల్ ఆర్ట్స్‌తో మహానగరానికి కళాత్మక రూపం

సాక్షి, విశాఖపట్నం: వైవిధ్యభరితమైన విశాఖ వైభవాన్ని విదేశాలకు ఘనంగా చాటిచెప్పే అవకాశం జీ-20 సదస్సుతో సాక్షాత్కరించింది. దేశవ్యాప్తంగా 50కి పైగా ప్రాంతాల్లో జరుగుతున్న సన్నాహక సదస్సుల్లో భాగంగా విశాఖలో నిర్వహిస్తున్న ఈ సమావేశాలు అత్యంత కళాత్మకంగా నిలుస్తున్నాయి. జీ-20 దేశాల జెండాల వైభవంతో పాటు వసుధైక కుటుంబమనే థీమ్‌ను విశ్వవ్యాప్తం చేస్తూ.. భారతీయ సంప్రదాయాల డిజైన్లు, మ్యూరల్ ఆర్ట్స్‌ను గుంటూరు జిల్లాకు చెందిన అంతర్జాతీయ విజువల్ ఆర్టిస్ట్ జాన్ రత్నబాబు బండికొల్ల ప్రపంచానికి పరిచయం చేశారు. రత్నబాబు కళాప్రతిభని చూసి విదేశీ ప్రతినిధులు అచ్చెరువొందుతున్నారు.

విభిన్నంగా విశాఖ సదస్సు

ఇప్పటివరకూ 20కి పైగా నగరాల్లో ఈ సన్నాహక సదస్సులు జరిగాయి. వీటన్నింటితో పోలిస్తే విశాఖ సదస్సు విభిన్నమైనదిగా గుర్తింపు పొందింది. సభా ప్రాంగణంతో పాటు నగరమంతా మురిసిపోయేలా రూపొందించిన డిజైన్లు అతిథులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అందుకే దీన్ని కళాత్మక సదస్సుగా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన జాన్ రత్నబాబు ఏయూలో బీఎఫ్ఏ చేశారు. ప్రస్తుతం నాగార్జున వర్సిటీలో ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

జీ-20 విశాఖ లోగో కూడా అద్భుతః

జీ-20 థీమ్ అయిన వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్ (వసుధైక కుటుంబం)ని చాటిచెప్పేలా జాన్ లోగో డిజైన్ చేశారు.

- ఒక గ్లోబ్‌లో అక్షర క్రమంలో జీ-20 దేశాల జాతీయ జెండాలను ఆయా దేశాల ప్రజలు పట్టుకుని ఉన్నట్లుగా చిత్రీకరణ చేశారు. మధ్యలో మన జాతీయ వృక్షం మర్రిచెట్టు, జాతీయ పక్షి పురివిప్పిన నెమలిని కూడా చిత్రీకరించారు. ఈ మర్రి వృక్షానికి జీ-20 దేశాల జాతీయ పక్షులు, పుష్పాలు జోడించారు.
- అదేవిధంగా వృక్షం చివర్లో వన్ ఫ్యామిలీకి గుర్తుగా నెమలి పింఛాలు, మర్రి వృక్షం మొదట్లో ఒక తండ్రి, తల్లి మధ్యలో బాలుడు, వారి ఇల్లుని, వన్ ఫ్యూచర్‌కి సింబాలిక్‌గా సీతాకోక చిలుకల పెయింటింగ్ వేశారు.
- సదస్సుకు ఆహ్వానం పలుకుతున్న విశాఖనగరానికి చిహ్నంగా సముద్రం, డాల్ఫిన్ నోస్, లైట్‌హౌస్, పక్కనే చర్చి, మధ్యలో గుడి, మసీదును వేశారు.
- మొత్తంగా త్రివర్ణ పతాకాన్ని డిజైన్ చేసి.. ప్రతి ఒక్కరూ వహ్వా అనేలా రూపొందించారు.

ఈ తరహా డిజైన్లను ఎవరూ రూపొందించలేదని విదేశీ ప్రతినిధులు చెప్పారు. నగర వీధుల్లో వాల్ పెయింటింగ్స్ ఆకట్టుకునేలా చిత్రించారు.



విశాఖ వీధుల్లో కళారూపాలు

ఎప్పుడూ రాని సంతృప్తి ఇప్పుడు వచ్చింది



విజువల్ ఆర్టిస్ట్‌గా 150కి పైగా అంతర్జాతీయ అవార్డులు సాధించినా రాని సంతృప్తి.. జీ-20 సదస్సు ప్రధాన లోగో డిజైన్ చేసినప్పుడు వచ్చింది. ప్రముఖుల నుంచి అందుతున్న ప్రశంసలు ఆత్మసంతృప్తినిస్తున్నాయి. విశాఖలో మొత్తం 2000 డిజైన్లతో కాన్సెప్ట్‌లను వాల్‌పెయింటింగ్స్‌గా మలిచాం. 34 రోజుల పాటు శ్రమించి విశాఖను కళాత్మక నగరంగా మలిచాం.

– జాన్ రత్నబాబు బండికొల్ల, అంతర్జాతీయ విజువల్ ఆర్టిస్ట్

• తెలంగాణ

800 రకాల ఔషధాల ధరలు పెరుగుదల

- ఒకటో తేదీ నుంచి 12.12 శాతం పెంచేందుకు కేంద్రం నిర్ణయం
- తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్ సంజయ్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 800 రకాల అత్యవసర మందుల ధరలను పెంచా లని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జ్వరం, బీపీ, షుగర్, పెయిన్ కిల్లర్స్, యాంటీబయోటిక్స్ మందులన్నింటి ధరలు 12.12 శాతం పెరుగుతాయని కేంద్రం వెల్లడించింది. దీని వల్ల ఎక్కువ మందులు తీసుకునే వ్యక్తులపై భారం పడుతుందని తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్ సంజయ్‌రెడ్డి అన్నారు. రక్త హీనత, మధుమేహం, గుండె జబ్బులకు వాడే అత్యవసర ఔషధాలు, అంటువ్యాధులు, చర్మవ్యాధులు, ఇన్ఫెక్షన్లు, టీబీ, వివిధ రకాల కేన్సర్లకు రోగులు ఉపయోగించే మందుల ధరలు పెరుగుతాయని చెపుతున్నారు. అలాగే మెడికల్ డివైజ్‌ల ధరలు కూడా భారీగా పెరుగుతాయని, జాతీయ ఔషధ ధరల నిర్ణాయక మండలి (ఎన్‌పీపీఏ) వీటి ధరలను పెంచిందని సంజయ్ పేర్కొన్నారు. అసలే కరోనా తర్వాత అనేకమంది పలు సైడ్‌ఎఫెక్ట్స్‌కు గురయ్యారు. దీంతో అనేకమంది నిత్యం పలు రకాల మందులు వాడుతున్నారు. మందుల ధరల పెంపువల్ల ఆదాయంలో కొంత భాగం వాటికి అదనంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అంటున్నారు. డ్రగ్స్ (ప్రైస్ కంట్రోల్) ఆర్డర్, 2013 ప్రకారం హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) సరళిని బట్టి ఈ ధరలు నిర్ణయించినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. గతేడాది మందుల ధరలను 10.76 శాతం పెంచిన కేంద్రం.. ఈసారి ఏకంగా 12.12 శాతం పెంచింది. కాగా, ఏయే మందుల ధరలు పెరిగాయో వాటి జాబితాను కేంద్రం ఒకటిరెండు రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉందని సంజయ్‌రెడ్డి తెలిపారు.

నా రైతు.. నా ఆరోగ్యం

ఆరోగ్య రక్షణపై ప్రజల్లో శ్రద్ధ పెరిగింది.. రసాయన రహిత ఆహార ఉత్పత్తులపై అవగాహన వచ్చింది. సేంద్రియ పంటల కొనుగోలుపై ఆసక్తి అధికమైంది.. అయితే ప్రకృతి విధానంలో సాగుచేసిన కూరగాయలు ఎక్కడ లభిస్తాయి..? క్రిమిసంహారకాలు వాడని ఆకు కూరలు ఎక్కడ దొరుకుతాయి..? పురుగు మందుల అవశేషాలు లేని తీగజాతి కాయకూరలు ఎక్కడ లభిస్తాయి..? ఇలాంటి ప్రశ్నలకు ఓ స్వచ్ఛంద సంస్థ సమాధానం ఇస్తోంది. ఇటు రైతుకు గిట్టుబాటు దక్కేలా.. అటు కొనుగోలుదారుడికి సంతృప్తి కల్పించేలా కార్యాచరణ రూపొందించింది. ఇరువురి భాగస్వామ్యంతో చిన్న కమతాల్లో గోఆధారిత సేద్యానికి బాటలు వేసింది. దళారీలతో పనిలేకుండా అన్నదాత – వినియోగదారుడు నేరుగా ఒప్పందం కుదుర్చుకుని లబ్ధి పొందేలా ప్రత్యేక వేదిక ఏర్పాటుచేసింది. తిరుపతి సమీపంలోని వేమూరు గ్రామంలో సాగుతున్న విశేష వ్యవసాయాన్ని పరిశీలించేందుకు 'సాక్షి' పొలంబాట పట్టింది. సమగ్ర సమాచారంతో ప్రత్యేక కథనం అందిస్తోంది.

- అన్నదాతకు ఆదరువుగా వినియోగదారులు
- గో ఆధారిత ప్రకృతి సేద్యానికి తోడ్పాటు
- నాణ్యమైన పంట ఉత్పత్తులను అందిస్తున్న రైతులు
- 30 సెంట్లలో 20 రకాల కూరగాయల సాగు
- పొలం నుంచి నేరుగా వంటింటికే సరఫరా

సాక్షి తిరుపతి డెస్క్

ఉరుకులు పరుగుల జీవితం.. ఉన్నది తిని జీవనాధారం కోసం కాయకష్టం చేయాల్సిన పరిస్థితి. ఆరోగ్యంపై అంతగా పట్టించుకునే పరిస్థితులు ఇన్నాళ్లు లేవు. కోవిడ్ దెబ్బకి అందరూ ఆరోగ్యంపై దృష్టి సారించారు. జీవన విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకుంటున్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల అవశేషాలు లేని ఆహారం తీసుకునేందుకు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. వినియోగదారుల ఆలోచన ఇలా ఉంటే.. తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, డిమాండ్ ఉన్న పంటలను పండించినా, వాటిని ఎలా మార్కెటింగ్ చేసుకోవాలో తెలియక రైతులు అవస్థలు పడుతున్నారు.

వర్డ్ సంస్థ చొరవతో!

రైతుల కష్టాలను, వినియోగదారుల ఆలోచనలను వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(వర్డ్) సంస్థ వ్యవస్థాపకుడు, జిల్లా వ్యవసాయ బోర్డు సలహామండలి సభ్యుడు డాక్టర్ గంగాధరం గుర్తించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, రసాయనిక ఎరువులు లేని ఆహార ఉత్పత్తులను వినియోగదారులకు అందించేందుకు ఒక వేదిక అవసరమని భావించారు. గోఆధారితంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సుభాష్ పాలేకర్ విధానమే ఇందుకు సరైన పరిష్కారమని నిర్ణయించుకున్నారు. దీనిపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. చిన్న కమతాల్లోనే ఎక్కువ రకాల పంటలను తక్కువ ఖర్చుతో పండించవచ్చని ప్రయోగాత్మకంగా నిరూపించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రతి నెలా ఆదాయం వచ్చేలా ఒక వ్యవస్థను ఏర్పాటుచేస్తామని భరోసా ఇచ్చారు. ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వంగ పంట

రైతు–వినియోగదారుల భాగస్వామ్యం

గోఆధారిత ప్రకతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించిన తర్వాత గంగాధరం వినియోగదారులపై దృష్టి సారించారు. ఈ మేరకు తిరుపతిలో గత ఏడాది జూన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులు, వినియోగదారులకు పరస్పరం ఒప్పందం కుదిర్చారు. 20 మంది వినియోగదారులకు నెలకు తమ కుటుంబాలకు అవసరమైన 20 రకాల కూరగాయలను రైతు తన 30 సెంట్ల భూమిలో పండించాలి. అందుకు రైతుకు ప్రతి వినియోగదారుడు నెలకు రూ.1,500 చొప్పున చెల్లిస్తాడు. అంటే నెలకు రూ.30 వేల వరకు చెల్లిస్తారు. ఏడాది పొడవునా ఈ బంధం కొనసాగుతూనే ఉంటుంది. దీనికి రైతు–వినియోగదారుల భాగస్వామ్య పథకం (ఎఫ్‌సీపీ) అని పేరు పెట్టారు.



విత్తు నాటుతున్న పొలంలో వినియోగదారులు



పంటను పరిశీలిస్తున్న వినియోగదారులు

ఏడాదికి రూ.2.4 లక్షల ఆదాయం

ఎఫ్‌సీపీ పథకంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం, వేమూరు, కస్తూరికండ్రిగ, రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువు తదితర ప్రాంతాల్లో రైతులు గోఆధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. టమాట, వంగ, మిర్చి, కాకర, బీర, సొరకాయ, గోరుచిక్కుడు, చెట్టు చిక్కుడు, చుక్కకూర, పాలకూర, తోటకూర, చిర్రాకు వంటి 20 రకాలను ప్రతి వారం వినియోగదారులకు అందజేస్తున్నారు. ఆ వారంలో దిగుబడి అయిన కూరగాయలు, ఆకు కూరలను 20 సమ భాగాలుగా చేసి ఒక్కో ప్రత్యేక సంచిలో వేసి ఆటో ద్వారా ప్రతి వినియోగదారుడి ఇంటికే చేర్చుతున్నారు. కేవలం 30 సెంట్ల భూమిలో నెలకు ఖర్చులు పోగా రూ.20వేలు మిగులుతున్నట్లు రైతులు ఆనందంగా చెబుతున్నారు. అంటే ఏడాదికి దాదాపు రూ.2.4 లక్షల ఆదాయం వస్తోందని వెల్లడిస్తున్నారు.



సేంద్రియ విధానంలో సాగుచేసిన కూరగాయలను భాగాలు వేసిన రైతులు

విశేష స్పందన



తొలి ప్రయత్నంలోనే వినియోగదారులతో ఒప్పందం కుదుర్చుకోవడంతో శ్రమ తగ్గింది. గో ఆధారిత సేంద్రియ వ్యవసాయ పద్ధతిని అనుసరించడం వల్ల ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు వస్తున్నాయి. వినియోగదారులు సెలవు రోజుల్లో పంటపొలాలకు వస్తున్నారు.

– గంగాధరం, వర్డ్ సంస్థ ప్రతినిధి, తిరుపతి

సేంద్రియ విధానంలోనే..



దేశీ ఆవుపేడతో సేంద్రియ విధానంలోనే పంటలు పండిస్తున్నాం. 20 మంది వినియోగదారులు ముందుకొచ్చి సాగుకు సాయం అందించారు. వారికి ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంట ఉత్పత్తులను అందిస్తున్నాం. పంటను ఎలా అమ్ముకోవాలి అనే ఇబ్బంది తప్పింది.

– వెంకటాద్రి, రైతు, వేమూరు

ఒప్పందంతో సత్ఫలితాలు



వినియోగదారునితో నేరుగా భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల నిశ్చింతగా వ్యవసాయం చేసుకుంటున్నాం. సత్ఫలితాలు పొందుతున్నాం. రోజుకు రెండు గంటలు కష్టపడితే పెట్టుబడి పోగా నెలకు రూ.20వేలు మిగులుతోంది.

– మునిరత్నం నాయుడు, రైతు, కస్తూరికండ్రిగ

నాణ్యమైన కూరగాయలకోసమే..



మాకు అవసరమైన కూరగాయలను సేంద్రియ పద్ధతిలో రైతు సాగుచేస్తున్నాడు. ఎలా చేస్తున్నారో మనమే వెళ్లి చూసుకోవచ్చు. రైతు ఏం చేస్తున్నాడో మనకు వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేస్తున్నాడు. ఇంతకంటే మంచి కూరగాయలు ఎలా దొరుకుతాయి?.

– టీవీ మనోహర్, వినియోగదారుడు, తిరుపతి

జయలక్ష్మికి కొత్తఊపిరి

- కోయంబత్తూరు సంస్థ టేక్ ఓవర్‌కు ప్రయత్నం
- కొత్తపాలకవర్గం నేతృత్వంలో విస్తృత చర్చలు
- త్వరలోనే సంస్థతో ఒప్పందం ఖారారు
- ఫలిస్తున్న కొత్త పాలకవర్గం మంతనాలు
- ఖాతాదారుల్లో భరోసాకు అడుగులు

సాక్షిప్రతినిధి,కాకినాడ: జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ ఖాతాదారులకు శుభవార్త. తమిళనాడుకు చెందిన ఓ బ్యాంకు దీనిని టేకోవర్ చేసి కష్టాల నుంచి ఒడ్డెక్కించేందుకు ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సహకారశాఖ అధికారుల అజమాయిషీలో ఏర్పాటైన కొత్త పాలకవర్గం సొసైటీకి మళ్లీ ఊపిరి పోసేందుకు చేస్తున్న ప్రయత్నాలు దారి కొస్తున్నాయి. కాకినాడ సర్పవరం కేంద్రంగా జయలక్ష్మి బ్యాంక్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు విశాఖ జిల్లాలో కలిపి 29 బ్రాంచిలతో నడిచేది. సుమారు 20వేల మంది డిపాజిటర్లు ఉన్నారు. ఒకే ఒక కుటుంబం, వారి బంధుగణంతో ఏర్పాటైన సొసైటీ పాలకవర్గం గతేడాది ఏప్రిల్‌లో బోర్డు తిప్పేసిన సంగతి తెలిసిందే. దీంతో వేలాది మంది విశ్రాంత, చిరు ఉద్యోగులు, చిరు వర్తకులు, రైతులు నిలువునా మునిగిపోయారు. నమ్మి డిపాజిట్లు చేసి మోసపోయారు.

తేలిన లెక్కలు

సొసైటీలో డిపాజిట్లు రూ.520 కోట్లు, రుణాలు సుమారు రూ.703 కోట్ల మేర ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వీటిలో రూ.123 కోట్లు సెక్యూర్డ్ రుణాలు. 365 మంది వద్ద రూ.580కోట్ల మేర అన్ సెక్యూర్డ్ రుణాలున్నాయని లెక్క తేలింది. ఈ మొత్తంలో సుమారు రూ.530 కోట్లు గత పాలవర్గ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, వారి కుమారుడు కలిపి దుర్వినియోగం చేసినట్టు కొత్త పాలకవర్గం ప్రాథమికంగా గుర్తించింది. వీటికి సంబంధించిన రికార్డులు, ఖాతాదారుల రుణ పత్రాలను ప్రస్తుతం సీబీసీఐడీ పోలీసులు విచారణ కోసం స్వాధీనంలో ఉన్నాయి.

త్యాగరాజన్‌తో సానుకూలంగా చర్చలు

జయలక్ష్మి ఖాతాదారుల్లో విశ్వాసాన్ని కలిగించేందుకు కొత్త పాలకవర్గం గట్టిగా అడుగులేస్తోంది. సొసైటీ టేకోవర్ చేసేందుకు ఆసక్తి చూపుతున్న బడా ఫైనాన్స్ కంపెనీలతో నెల రోజులుగా విస్తృతంగా చర్చిస్తోంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన ఈ సంస్థలతో జరుపుతున్న చర్చలు ఫలప్రదమై ఓ కొలిక్కి వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. తమిళనాడులోని కొయంబత్తూరుకు చెందిన త్యాగరాజన్ అండ్ కంపెనీ రిజర్వు బ్యాంక్ నిబంధనల ప్రకారం టేకోవర్ చేసేందుకు ఆసక్తి కనబరిచినట్లు భోగట్టా. గత నెలలో ఈ సంస్థ కంపెనీ ప్రతినిధులతో సానుకూల పరిస్థితుల నేపథ్యంలో చర్చలు జరిగాయి.

అటాచ్డ్ ఆస్తులు లెక్కలేసుకున్నాకే..

జయలక్ష్మి సొసైటీలో త్యాగరాజన్ కంపెనీ రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్లు డిపాజిట్ చేసేందుకు ముందుకు వచ్చింది. గత పాలకవర్గ చైర్‌పర్సన్ విశాలాక్షి సహా డైరెక్టర్ల నుంచి అటాచ్ చేసిన ఆస్తులు విలువ లెక్కలేసుకున్నాకే త్యాగరాజన్ సంస్థ టేకోవర్‌కు ముందుకు వచ్చింది. అటాచ్‌చేసిన ఆస్తుల విలువ కోట్లలోనే ఉంటుందని కొత్త చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు సారథ్యంలోని పాలకవర్గ సభ్యులు గుర్తించారు. వివిధ ప్రాంతాల్లోని స్థిరాస్తుల విలువ రూ.600 కోట్లు పైమాటేనని లెక్కలేశారు. కాకినాడ సెజ్‌లోని 12 ఎకరాల విలువే రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్లు ఉంటుందని అంచనా. ఇలా అటాచ్‌చేసిన ఆస్తులు వేలం వేయడం, రికార్డుల ప్రకారం ఉన్న రుణాలు తిరిగి రాబట్టడం ద్వారా సొసైటీకి మళ్లీ ఊపిరిపోయాలని కొత్త పాలకవర్గం ప్రయత్నిస్తోంది.

రికార్డులకోసం ట్రిబ్యునల్‌కు..

సొసైటీలో రెగ్యులర్ రుణాలు రూ.100 కోట్లు వరకు ఉన్నాయి. రుణగ్రహీతలను గుర్తించారు. వారు కూడా రుణాలు తిరిగి చెల్లించేందుకు ముందుకు వచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి అల్లుడే రూ.20 కోట్లు రుణం బకాయి పడటం విశేషం. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు ఆయన సమ్మతించారని సమాచారం. ఎటొచ్చీ ఆ రుణగ్రహీతల భూముల డాక్యుమెంట్లు, రికార్డులు ప్రస్తుతం సీబీసీఐడీ స్వాధీనంలో ఉండటమే కొంత సమస్యగా తయారైంది. గత పాలకవర్గంపై కేసులు కొనసాగిస్తూనే సీఐడీ పోలీసులు నుంచి ఈ రికార్డులను తిరిగి తీసుకోవాలని భావిస్తున్నారు. ఇందుకోసం ట్రిబ్యునల్‌కు వెళ్లి అనుమతి తెచ్చుకోవల్సి ఉంటుందని సహకార వర్గాలు చెబుతున్నాయి.



జయలక్ష్మి కో-ఆపరేటివ్‌బ్యాంక్ భవనం

విశ్వాసం పెంచేందుకు..

భారీ మొత్తం డిపాజిట్ చేశాక ప్రస్తుత పాలకవర్గం ఆధ్వర్యంలోనే సొసైటీ నిర్వహించాలనేది త్యాగరాజన్ సంస్థ భావన. సంస్థ ప్రతినిధి లేదా, ఒకరిద్దరు అసోసియేట్ ప్రతినిధులను పాలకవర్గంలో తీసుకోవాలనే అంశంపై ఇరువైపులా ఏకాభిప్రాయం వ్యక్తమైంది. భారీ డిపాజిట్లతో ఖాతాదారుల్లో నమ్మకం పెరిగితే సొసైటీ మనుగడ దారిలో పడుతుందని కొత్త పాలకవర్గం భావిస్తోంది. మే, జూన్ నాటికి త్యాగరాజన్ సంస్థతో ఒప్పందం కొలిక్కి వస్తుందంటున్నారు. మరోసారి ఏప్రిల్‌లో సమావేశం కానున్నారు. అన్ని సజావుగా సాగితే మే నెలాఖరుకు మెచ్యూరిటీ డిపాజిట్లను తిరిగి ఇవ్వాలనేది ప్రతిపాదన. వీటిని చెల్లించాక రుణాలపై దృష్టి పెట్టాలనుకుంటున్నారు. ఈ విషయంలో ప్రతిబంధకాలను అధిగమించేందుకు ఏప్రిల్‌లో జరిగే రెండో దఫా చర్చల్లో తుది నిర్ణయానికి రానున్నారు.





పరిపూర్ణ పురుషోత్తముడు

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అంతటా వ్యాపించి ఉన్న భగవానుడు మనకోసం ఒక రూపంలో ఒదిగిపోయి దివి నుంచి భువికి దిగి వస్తే, దాన్ని అవతారం అంటారు. అలా శ్రీ మహావిష్ణువు ధరించిన దశావతారాలలో మానవ జీవితానికి అతి దగ్గరగా ఉండే అవతారం రామావతారం. చైత్ర శుద్ధ నవమి రోజు, లోకాలన్నిటి చేత నమస్కరింపబడే రాముడు ఈ భూమి మీద జన్మించాడు. పుట్టింది మొదలు ధర్మాన్నే అనుసరించాడు. పితృధర్మం, మాతృధర్మం, భ్రాతృధర్మం, స్నేహ ధర్మం, పత్నీ ధర్మం, ఋషుల ధర్మం... ఇలా అన్ని ధర్మాలు తెలిసినవాడు, ఆచరించినవాడు. అందుకే 'రామో విగ్రహవాన్ ధర్మః' అంటూ శత్రువులు కూడా ఆయనను స్తుతించారు.

నేడు శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా...
ఆ పరిపూర్ణ పురుషోత్తముడి గురించి తెలుసుకుందాం.

అప్పటికి కౌసల్యాసుతునికి పదిహేను పదహారేళ్ల వయసుండొచ్చు. ఒకానొక రోజు దశరథమహారాజు రాముణ్ణి పిలిచి విశ్వామిత్ర మహర్షివైపు చూపిస్తూ ''ఈ మహర్షితోపాటు నువ్వు అడవులకు వెళ్లాలి నాయనా...'' అని అంటాడు. మరో పిల్లాడయితే ఏమనేవాడో ఏమో కానీ, రాముడు మాత్రం తండ్రి చెప్పాడు కాబట్టి కిమ్మనకుండా బయలుదేరాడు. అనుగు సోదరుడు లక్ష్మణుడు తోడు రాగా అడవుల్లోకి దారితీశాడు. తాటక సంహారం చేశాడు. అహల్యకు విమోచన ప్రసాదించాడు. రాముడు ఎంతటి క్రమశిక్షణ కలవాడంటే అంతఃపురంలో ఉన్నంత కాలమూ కన్నవారి మాట జవదాటలేదు. అరణ్యాల్లో ప్రవేశించాక విశ్వామిత్రుని ఆజ్ఞ మీరలేదు. సీతా స్వయంవరానికి తీసుకువెళతానని ఆ గురువర్యుడంటే మారు మాట్లాడకుండా అనుసరించాడు.

పెద్దల మాటకే ప్రాధాన్యం

జనకమహారాజు నెలకొల్పిన స్వయంవరమంటపంలో శ్రీరాముడు అడుగుమోపినా శివధనుస్సు ఉండే చోటికి హడావుడిగా వెళ్లిపోలేదు. దాన్ని భళ్లున ఎత్తేసి, ఫెళ్లున విరిచేసి, చేతులు దులిపేసుకోలేదు. ఎలాంటి తొందరపాటూ పడకుండా సభాభవనంలో నిమ్మళంగా కూర్చున్నాడు. శివధనువును ఎత్తాలంటూ విశ్వామిత్రుడు అనుజ్ఞ ఇచ్చాకనే రాముడు ఆ పనికి పూనుకున్నాడు. ధనస్సును సున్నితంగా ఎత్తిపట్టుకుని, నారి సారించి, విరిచాడు. ఇదంతా ఎలాంటి భావోద్వేగాలకు లోనుకాకుండా చేశాడు. అంత పెద్ద పనీ పూర్తిచేశాక ధీర గంభీరంగా అడుగులు వేస్తూ తన ఉచితాసనానికి చేరుకున్నాడు. చిన్నపాటి విజయాన్ని సాధిస్తేనే మురిసి మెరిసిపోయే మనం, ఆ సందర్భాన రాముడి వర్తన నుంచి ఎన్ని పాఠాలు నేర్చుకోవచ్చో. చిన్న కష్టానికే కన్నీరొలికించడం. అల్పమైన సుఖాలకే అతిగా స్పందించడం.. లాంటి లక్షణాలను మరెంత సునాయాసంగా తొలగించుకోవచ్చో!

కృతజ్ఞత ఆయన రక్తంలోనే ఉంది
చేసిన సహాయాన్ని ఎన్నటికీ మరువని సద్గుణ సంపన్నత రామునిది. అందుకే సీతమ్మ జాడతెలుసుకున్న ఆంజనేయస్వామిని బిడ్డలా చూసుకున్నాడు. ఎవరికీ ఇవ్వనంతటి చనువును ఇచ్చాడు. తన ప్రేమను పంచాడు. సుగ్రీవుడికి పట్టం కట్టాడు. విభీషణునికి లంకేశునిగా మకుటం తొడిగాడు.

వినయ విధేయతలు

తొందరపాటు...తొట్రుపాటు అనేవి రాముడి నిఘంటువులోనే లేదు. శివధనువును విరవగానే సీతను రాముడికిచ్చి పెళ్లి చేస్తానని జనకుడు చెప్పిన మాట విని ఎగిరి గంతేయలేదు. వెంటనే సీత మెడలో మూడు ముళ్లూ వేసేయలేదు. జనకుని ప్రతిపాదనను తన కన్నవారికి తెలియజేయాలని, అందుకు వారి అనుమతి అవసరమనీ వినమ్రంగా చెప్పాడు. ఎవరి పట్ల ఏవేళ ఎలా ఆదరం చూపాలో రామునికి బాగా తెలుసుననడానికి ఇంతకు మించిన ఉదాహరణ మరొకటి లేదు. అలా ఆ పెద్దలందరి సమక్షంలోనూ మైథిలి చేయి అందుకున్నాడు.

సీతారాముల కళ్యాణం జరిగి ఎంతోసేపు అవనే అవదు. పరశురాముడు వేంచేశాడు. పెళ్లివేదిక వద్దకు వస్తూనే ఆ మహాశయుడు వీరావేశాన్ని ప్రదర్శించాడు. ప్రపంచంలో రాముడంటే పరశురాముడేనని, మరో రాముడికి లోకాన చోటు లేనేలేదని వీరవిహారం చేశాడు. అటు జనకుడు, ఇటు దశరథుడు పరశురాముని క్రౌర్యాన్ని చూసి బెంబేలెత్తిపోయారు. అయితే రాముడు ఏమాత్రం తొందరపడలేదు. పరశురాముడు ఎంతగా పేట్రేగిపోతుంటే రాముడు అంత ప్రశాంతంగా ఉన్నాడు. పరశురాముడు అందించిన విష్ణుధనువును సునాయాసంగా పైకెత్తాడు. తను శ్రీహరి ప్రతిరూపమని చెప్పకనే చెప్పాడు. దీంతో పరశురాముడికి కమ్మిన పొరలు తొలగిపోయాయి.

తారుమారైనా...

మర్నాడు పొద్దున్నే పట్టాభిషేకం జరగాల్సి ఉంది. రాత్రికి రాత్రే కథ మారిపోయింది. కైకమ్మ స్వయంగా పిలిచి, తన మాటల్ని దశరథుని ఆదేశాలుగా వినిపించింది. ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా పద్నాలుగేళ్లపాటు అరణ్యవాసం చేయాలని ఆజ్ఞాపించింది. మారు తల్లి మాటలను మన్నించాడు. అడవుల్లోకి పోయేందుకు సిద్ధమేనంటూ అందుకు రథాన్ని సిద్ధం చెయ్యమన్నాడు. మంగళస్నానాలు చేసి రాజదండాన్ని చేపట్టాల్సిన వేళ పత్నినీ, సోదరునీ వెంటబెట్టుకుని గుహుని పడవమీద నది దాటుకుంటూ పోయాడు.

అడవుల్లోనూ ఆ రామునికి ప్రశాంతత లేనే లేదు. కష్టాలూ కన్నీళ్లే! సీతమ్మను రావణుడు అపహరించుకుపోయాక మానసికంగా నలిగిపోయాడు. చివరికి లంకలో అమ్మవారు ఉన్నారన్న సంగతి తెలిసి కొంత స్థిమితపడ్డాడు. తన ప్రియపత్నిని తన వద్దకు తెచ్చుకునేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. వానరసైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. విభీషణునితో చెలిమిచేశాడు. ఓరిమితో వ్యవహరించాడు. తగిన సమయం కోసం ఓపికగా ఎదురు చూశాడు. సముద్రం మీద సేతువును నిర్మించాడు. అందుబాటులో ఉన్న వానర సేన సహకారంతోనే అమిత బలవంతుడైన శత్రువుతో యుద్ధం చేశాడు. విజేత తానే అయ్యాడు.

..జననీ జన్మభూమిశ్చ..
రావణ సంహారం జరిగాక ఆ రాక్షస రాజు మనసుపడి కట్టించుకున్న కోటను స్వాధీనం చేసుకోవాలని లక్ష్మణుడు భావించాడు. విషయాన్ని అన్నతో చెప్పాడు. యావత్ లంకానగరమే మణిమయ నిర్మితమైనది. అందులోని రాజ సౌధం సామాన్యమైంది కాదు. ఎటు చూసినా బంగారమే. కాని, రాముని తీరు వేరు. ఆయనకు దురాశ ఉండదు. ఆయన ధర్మం తప్పడు. లక్ష్మణుని సలహాను సున్నితంగా తిరస్కరిస్తాడు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అంటూ అయోధ్య వైపు చూడాలని సూచన చేస్తాడు. లంక విభీషణునికే చెందుతుందని స్పష్టం చేస్తాడు. అంటే పరాయి ప్రదేశం ఎంతటి గొప్పదైనా, సుందరమైనదైనా దానిని చూసి మనసు పారేసుకోలేదు. మాతృభూమిని మరువలేదు. పుట్టిన గడ్డపై ప్రేమను పోగొట్టుకోలేదు.

స్థితప్రజ్ఞావంతుడు

దక్కుతుందనుకున్న రాజ్యం క్షణాల్లో చేజారిపోయింది. వనవాస క్లేశాలు ముదిరిపోయాయి. సరసరాజాన్నభోజనాల స్థానంలో ఆకులు అలములు తినాల్సి వచ్చింది. ఒకవైపు భార్యావియోగం. మరోవైపు రాక్షసబాధ. వయసేమంత పెద్దది కాదు. అయినా చలించలేదు. స్థిరంగా ఉన్నాడు. దృఢంగా ఉన్నాడు. స్థితప్రజ్ఞతతో వ్యవహరించాడు. మరి ఇప్పటికాలాన మనం ఎలా ఉన్నాం..? బస్సు దొరక్కపోతే ఆందోళన. సినిమా టికెట్లు అందకపోతే అశాంతి. పరీక్షలో మార్కులు తక్కువయితే ఆవేదన. అన్నింటికీ తొందరే. ప్రేమ తొందర. పెళ్లి తొందర. ఇలా అయితే ఎలా. రాముని వంటి వారినే కష్టాలు కాల్చుకు తిన్నాయి. అన్నింటినీ ఆయన ఓపిగ్గా ఎదుర్కొన్నాడు. ఆయనతో పోల్చుకుంటే మనం ఎంతటి వారం? ఆయన పడ్డ కష్టాలతో పోల్చి చూసుకుంటే మన కష్టాలు ఏపాటివి?

ఎప్పటి త్రేతా యుగం? రాముడు పుట్టి రెండు యుగాలయింది. మనమిప్పుడు కలికాలంలో ఉన్నాం. అయినా ఆ ఆదర్శనీయుణ్ణి నేటికీ మరువలేకపోతున్నాం. అదే ఆయన వ్యక్తిత్వం. అందుకే మానవుడిగా పుట్టినా, రాముడు మనకు దేవుడయ్యాడు. ఆయన నడిచిన బాట అయిన రామాయణం పఠనీయ కావ్యం అయింది. అందుకే రామాయణాన్ని పారాయణం చేయాలి. అందులోని మంచిని ఒంటబట్టించుకోవాలి.

– డి.వి.ఆర్. భాస్కర్

రామ నైవేద్యం

వడపప్పు

కావలసినవి: పెసరపప్పు – పావు కేజీ; పచ్చిమిర్చి ముక్కలు – టీ స్పూన్; పచ్చి కొబ్బరి తురుము– టేబుల్ స్పూన్; మామిడికాయ తురుము– టేబుల్ స్పూన్

తయారీ: పెసరపప్పు శుభ్రంగా కడిగి అరగంట సేపు నానబెట్టాలి. గింజ మెత్తబడిన తర్వాత నీటిని వంపేసి అందులో పైన తీసుకున్న దినుసులన్నీ కలిపితే వడపప్పు రెడీ.

పానకం

కావలసినవి: బెల్లం పొడి– పావు కేజీ; నీళ్లు– లీటరు; యాలకుల పొడి– టీ స్పూన్; మిరియాల పొడి– టీ స్పూన్; శొంఠిపొడి– చిటికెడు

తయారీ: బెల్లం పొడిలో నీటిని కలిపి కరిగిన తర్వాత వడపోయాలి. ఈ బెల్లం నీటిలో యాలకుల పొడి, మిరియాల పొడి, శొంఠిపొడి కలిపితే పానకం రెడీ.



వడపప్పు, పానకం ఆరోగ్యకరమైనవి. ఈ రెండింటినీ కలిపి తింటే జీర్ణవ్యవస్థ పని తీరు మెరుగవుతుంది. గ్యాస్ట్రిక్ సమస్యలు తొలగిపోతాయి. వేసవి మొదలైన ఈ సమయంలో ఆరోగ్యం ఒడిదొడుకులను పానకం నివారిస్తుంది. యాలకుల పొడి అతిదాహాన్ని తగ్గిస్తుంది.

పదో తరగతి పరీక్షలు

ఇన్విజిలేటర్లు ఎలా మెలగాలి?

ఏప్రిల్ 3 నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 10వ తరగతి పరీక్షలు. పిల్లలు ఒత్తిడిలో ఉంటారు. పెద్దలు ఒత్తిడి పెడుతుంటారు. వీటికి తోడు పరీక్షా హాలులో ఇన్విజిలేటర్లు కూడా ఒత్తిడి పెడితే విద్యార్థుల పరిస్థితి సంకటంలో పడుతుంది. 'ఇన్విజిలేటర్ల పని పిల్లలు ప్రశాంతంగా రాసేలా చూడటం. వారితో మృదువుగా ఉంటూనే పరీక్షల నియమ నిబంధనలు పాటించవచ్చు' అంటారు పియాలి బెనర్జీ.



ప్రతీకాత్మక చిత్రం

'పిల్లలు ఎప్పుడూ కనిపించేలా అల్లరిగా కాకుండా గంభీరంగా మారిపోయే సమయం అది' అంటుంది పియాలి బెనర్జీ పరీక్షల సమయం గురించి. ఆమె ముంబైలో సుదీర్ఘ కాలం హైస్కూల్‌లో ఇంగ్లిష్ బోధించింది. చాలాసార్లు ఇన్విజిలేటర్‌గా పని చేసింది.

'ఇన్విజిలేటర్‌కు పిల్లలను పరీక్షలు రాయడానికి ఉత్సాహపరిచే స్వభావం ఉండాలి. అది లేనప్పుడు కనీసం ఊరికే ఉంటే చాలు. ఏవో ఒక మాటలు చెప్పి, గద్దించి వారిని నిరుత్సాహపరిచే హక్కు మాత్రం లేదు' అంటుందామె. తాను ఇన్విజిలేటర్‌గా ఉన్నప్పుడు గమనించిన అంశాలు పియాలి చెప్పింది.

'ఒకసారి ఒక పిల్లాడు తల ఒంచుకుని కూచుని ఉన్నాడు. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడని అనుకున్నాను. రెండు నిమిషాలైనా కదల్లేదు. దగ్గరికెళ్లి చూశాను. నిద్రలో జారుకున్నాడు. పాపం రాత్రి ఎంతసేపు చదివాడో. మెల్లగా తట్టి లేపాను. ఉలిక్కిపడి లేచాడు. వాస్తవంలోకి వచ్చి ఎగ్జామినేషన్ హాల్లో ఉన్నానని గ్రహించి పూర్తిగా కంగారుపడిపోయాడు. మెల్లగా చెప్పాను– ఐదు నిమిషాలే పడుకున్నావు. ఏం కొంపలు మునగలేదు. రాయి అని. స్థిమితపడి రాయడంలో పడ్డాడు. పరీక్ష అయ్యాక మొహమాటంగా నవ్వుతూ థ్యాంక్స్ చెప్పాడు. తల్లిదండ్రులు పరీక్ష ముందురోజు రాత్రి తొమ్మిదిన్నరకంతా పిల్లలను నిద్రపోయేలా చూడాలి. పిల్లల్ని అలా చదువు ప్లాన్ చేసుకోమని చెప్పాలి. ఇంకోసారి ఇంకో పిల్లాడు మాటిమాటికి టైమ్ వైపు చూసుకుంటూ కంగారుగా రాస్తున్నాడు. టైమ్ సరిపోదేమోనని భయం. దగ్గరగా ఒంగి చెప్పాను– హైరానా పడకు. మూడు గంటల్లో పూర్తయ్యేలాగే నీ ప్రశ్నలు ఉంటాయి. వాచీ చూడకు. రాసుకుంటూ వెళ్లు. నేను టైమ్ అలెర్ట్ చెప్తానుగా అన్నాను. పిల్లలను టైమ్ చాలదని భయపెట్టకూడదు' అంటుంది పియాలి బెనర్జీ. 'కొంతమంది పిల్లలు హడావిడిలో పెన్ను పెన్సిల్ కూడా తీసుకురారు. ఇంక్ అయిపోయిందని పెన్ కోసం అడుగుతారు. అప్పుడు వారిని సూటిపోటిగా ఏదో ఒక మాట అంటే తర్వాత ఏం రాస్తారు? చిర్నవ్వుతో ఒక పెన్ అందిస్తే ఏం పోతుంది?' అంటుందామె.



● పియాలి బెనర్జీ

ఎగ్జామినేషన్ హాల్లో పెద్దగా అరవడం సరియైన పద్ధతి కాదు అంటుందామె. ఎవరైనా కాపీ చేస్తూనో మరో కోతి పని చేస్తూనో దొరికిపోయినా హాలంతా అదిరిపోయేలా అరిచి అందరు పిల్లలనూ బెంబేలెత్తించకూడదు. చాలా నిశ్శబ్దంగానే ఆ కాపీ చేస్తున్న పిల్లలను హాలు బయటకు తీసుకెళ్లి వ్యవహారం తేల్చాలి అంటుందామె. 'పిల్లలు ఏవైనా అనవసరమైనవి పెట్టుకున్నారా తమ దగ్గర అని ఒకసారి చెక్ చేస్తే చాలు. పరీక్ష మధ్యలో మాటి మాటికి వారిని శల్యపరీక్షకు గురి చేసి ఏకాగ్రతను భంగం కలిగించకూడదు' అని చెబుతుంది.

'పిల్లలు సరిగ్గా తమ నంబర్ వేశారో లేదో చెక్ చేయడం ఇన్విజిలేటర్ ప్రధానమైన పని. అది మాత్రం ప్రతి విద్యార్థి దగ్గరకు వెళ్లి చెక్ చేసి వారికి ఓకే చెప్పాలి. లేదంటే పరీక్ష రాసి ఇంటికెళ్లినా నంబర్ సరిగ్గా వేశానా లేదా అని కంగారు పడతారు'' అంటుంది పియాలి.

పదో తరగతి పరీక్షలంటే పిల్లలు జీవితంలో మొదట ఎదుర్కొనే పరీక్షలు. ఆ సమయంలో ఇన్విజిలేటర్లు వారి దృష్టితో ఆలోచించి వీలైనంత కంఫర్ట్‌గా పరీక్ష రాసేలా చూడాలి. వారు రాస్తున్నప్పుడు ఇన్విజిలేటర్లు శ్రద్ధగా, విసుగు లేకుండా ఉండటం అన్నింటి కంటే ముఖ్యం అని సూచిస్తున్నదామె.

సైబర్ టాక్



డిజిటల్ వేధింపులు

మంజు (పేరు మార్చడమైనది) తన ఆఫీసులో పనిచేసే సహోద్యోగి సంతోష్‌కు ఫోన్ చేసింది. కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తి వాట్సప్ ద్వారా రకరకాలుగా వేధించడం తట్టుకోలేకపోతున్నానని, పోలీస్ కంప్లైంట్ ఇవ్వడానికి సహాయంగా రమ్మని కోరింది. అందుకే సరే అన్నాడు సంతోష్. దీంతో ఇద్దరూ కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తనకు వస్తున్న వేధింపుల మెసేజ్‌లను పోలీసులకు చూపించింది మంజు. ఇటీవలే తనకు పెళ్లి కుదిరిందని, విదేశీ నంబర్ల నుంచి బెదిరింపు మెసేజ్‌లతో పాటు, అసభ్యకరమైన ఫొటోలను షేర్ చేస్తున్నారని, ఆ ఫొటోలు పెళ్లి కొడుక్కు కూడా పంపించారని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లోనూ ఈ వేధింపులు ఉంటున్నాయిని వివరించింది మంజు. కంప్లైంట్ తీసుకున్న పోలీసులు మంజును మరుసటి రోజు రమ్మని చెప్పారు. వాళ్లు చెప్పినట్టుగానే ఒక్కతే వెళ్లింది. ఫోన్‌కాల్ విదేశాలకు సంబంధించిన నెంబరే. కానీ, ఆమెకు షేర్ అయిన ఫొటోల బ్యాక్‌డ్రాప్ ఇండియాలో ఉన్నట్టు అనిపిస్తుంది. అదే విషయాన్ని ఆమెకు చూపుతూ, 'ఈ ప్రదేశాలను గుర్తుపట్టగలరా?!' అని అడిగారు. ఆ బ్యాక్‌డ్రాప్ తన ఆఫీసులోని టాయిలెట్స్ అని మంజు గుర్తించింది. ఆఫీసు టాయ్‌లెట్స్, అక్కడ పని చేస్తున్న బృందాన్ని పరిశీలించాక సంతోష్ నేరస్థుడు అని రుజువయ్యింది. విషయం తెలిసి మంజు షాక్ అయ్యింది. తనతో స్నేహంగా మెలిగే సంతోష్ ఇలాంటి పని చేశాడంటే నమ్మలేకపోయింది. మంజు పెళ్లి కుదరడంతో ఆమెను ప్రేమించిన సంతోష్ తట్టుకోలేకపోయాడు. ఆమె పరువు తీసేలా చేస్తే విధిలేక ఎప్పటికైనా తనను పెళ్లి చేసుకుంటుందని అనుకున్నాడు. అందుకే పెళ్లి సంబంధాన్ని చెడగొట్టేందుకు సంతోష్ చేసిన ప్లాన్ ఇదని అందరికీ అర్థమైంది.

చట్టం.. బాధ్యత
తప్పుడు ప్రచారాలు చేసినందుకు, ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్య తీసుకోవచ్చు, నష్టపరిహారం పొందవచ్చు. ● మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఎ) కింద పౌరులందరికీ భావ ప్రకటన, వాక్ స్వాతంత్య్రం ఉంటుంది. అయితే, ఈ స్వేచ్ఛ కొన్ని పరిమితులకు లోబడి ఉంటుంది. మరొక వ్యక్తి ప్రతిష్టకు ఆటంకం కలిగించే ఏ వ్యాఖ్య అయినా పరువు నష్టం చట్టం కిందకు వస్తుంది.
● తమకు పరువు నష్టం కలిగిస్తున్నారని వ్యక్తులు లేదా సంస్థలు చట్టాన్ని సంప్రదించి, తగిన న్యాయాన్ని పొందే అవకాశాలు ఉన్నాయి.

* * *

ఇంటర్నెట్‌లో ఒక వ్యక్తి లేదా సంస్థ గురించి వారి ప్రతిష్ఠను దెబ్బతీసేలా, వృత్తిపరమైన జీవితానికి హాని కలిగించే ఉద్దేశంతో చేసే ఇలాంటి చర్యను సైబర్ పరువు నష్టం అని కూడా అంటారు. సోషల్ మీడియా, బ్లాగ్‌లు, ఫోరమ్‌లు లేదా ఇతర వెబ్‌సైట్‌లలో పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు, సమీక్షలు, ఫొటోలు లేదా వీడియోలను పోస్ట్ చేయడం ఇందులో ప్రధానంగా ఉంటుంది. తమ స్వలాభం కోసం లేదా అసూయ, ద్వేషాలతోనూ సైబర్ పరువు నష్టానికి కలిగించే వ్యక్తులు మన చుట్టూనే ఉండే అవకాశాలు ఉన్నాయి.

అనైతిక చర్య

● సోషల్ మీడియా, వార్తా చానెల్స్ కొన్నిసార్లు పబ్లిక్ షేమింగ్ చేస్తుండవచ్చు. ఆరోపణలు రుజువు కానప్పటికీ అవి ఒక వ్యక్తి లేదా సంస్థ ప్రతిష్ఠకు హాని కలిగే అవకాశాలు ఉన్నాయి. అందుకే, సోషల్ మీడియా లేదా చానెల్స్ ద్వారా వార్తలు ఇచ్చేవారు తగు జాగ్రత్తతో వ్యవహరించడం మంచిది.

● అసంతృప్తితో ఉన్న ఉద్యోగులు తమ యజమాని లేదా సహోద్యోగుల గురించి తప్పుడు లేదా అవమానకరమైన ప్రకటనలు చేయడం ద్వారా ఇతరులకు పరువు నష్టం కలిగించవచ్చు. ఇందులో అనైతిక లేదా చట్టవిరుద్ధమైన ప్రవర్తన, ఆరోపణలు చేయడం, పుకార్లు వ్యాప్తి చేయడం లేదా ఒకరి గురించి అవమానకర వ్యాఖ్యలు చేయడం వంటివన్నీ ఉంటాయి.

● రాజకీయాలు, మతానికి సంబంధించిన పుకార్లు అయితే మరింత హానికరం. ఇవి, ప్రజలను తప్పుదారి పట్టించేవిగా, విద్వేషాలకు కారకాలుగా ఉంటాయి.

● పరువు నష్టం కారణంగా వ్యక్తులు మానసికంగా భీతిల్లవచ్చు. కుంగుబాటుతో ఆత్మహత్య వంటి ప్రాణాపాయ చర్యలకు పాల్పడవచ్చు.

● ఆన్‌లైన్ పరువు నష్టం సంస్థలకు సంబంధించినదైతే కొన్నిసార్లు సమాజంపై ప్రభావం చూపవచ్చు. తమ స్వలాభం కోసం ఒకరిని కించపరిచి, ఆనందించడం అనేది అనైతిక చర్య.

డిజిటల్‌లో పరువు నష్టం వాటిల్లితే.. రిపోర్ట్ చేయాల్సింది..
https://www.facebook.com/help/contact/430253071144967
https://help.instagram.com/contact/653100351788502
https://help.twitter.com/en/forms/safety-and-sensitive-content
https://www.linkedin.com/help/linkedin/ask/rhsc
https://help.snapchat.com/hc/en-us/articles/7012399221652-How-to-Report-Abuse-on-Snapchat



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్

చర్మకాంతికి ...

▸ ముందు రోజు రాత్రి ఐదు బాదం పప్పలను నానబెట్టి, మరుసటి రోజు పొట్టు తీసి మెత్తగా రుబ్బి, పాలు కలిపి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసి, మృదువుగా మసాజ్ చేసి పదిహేను నిమిషాల తర్వాత నీటితో శుభ్రపరుచుకోవాలి. తరచూ ఇలా చేస్తుంటే చర్మం మృదువుగా మారుతుంది, కాంతి పెరుగుతుంది.

▸ టేబుల్ స్పూన్ తేనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి ముఖానికి, మెడకు, చేతులకు రాసి 15 నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఈ మిశ్రమం చర్మంపై మలినాలను తొలగించడంలో మైల్డ్ ఫేస్ క్లెన్సర్‌గా పనిచేస్తుంది. చర్మానికి తగినంత మాయిశ్చరైజర్ అందుతుంది.



▸ బంగాళదుంప, క్యారట్‌ను ఉడికించి గుజ్జు చేయాలి. ఈ మిశ్రమంలో చిటికెడు బేకింగ్ సోడా, చిటికెడు పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు రాసుకొని రెండు నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.



క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్

మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఫ్లోరిడాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6-4, 6-4తో టామీ పాల్ (అమెరికా)పై గెలిచాడు. క్వార్టర్ ఫైనల్లో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో అల్‌కరాజ్ ఆడతాడు. మయామి ఓపెన్‌లో అల్‌కరాజ్ మళ్లీ విజేతగా నిలిస్తేనే తన నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంటాడు. ఓడిపోతే జొకోవిచ్ (సెర్బియా) మళ్లీ నంబర్‌వన్ అవుతాడు.



అంచనాలతో ఆందోళన లేదు: రోహిత్ శర్మ

ప్రతి మ్యాచ్‌లో బరిలో దిగేముందు తమపై భారీ అంచనాలు ఉంటాయని... అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకే శాయశక్తులా కృషి చేస్తామని ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. ఎన్నో ఏళ్లుగా క్రికెట్ ఆడుతున్న తనకు ఇతరుల అంచనాల గురించి ఆందోళన లేదని, అనవసర ఆలోచనలతో ఒత్తిడి పెంచుకోనని... ఎలా ఆడితే మళ్లీ విజేతగా నిలుస్తామో అనే అంశం గురించే ఆలోచిస్తామని ఐదుసార్లు ముంబై జట్టును ఐపీఎల్ చాంపియన్‌గా నిలబెట్టిన రోహిత్ వ్యాఖ్యానించాడు.

గట్టెక్కిన శ్రీకాంత్

- రెండు మ్యాచ్ పాయింట్లు కాచుకొని నెగ్గిన భారత షట్లర్
- ప్రిక్వార్టర్ ఫైనల్లో సాయిప్రణీత్, కిరణ్, ప్రియాన్షు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ అతి కష్టమ్మీద తొలి రౌండ్ అడ్డంకిని దాటాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ 21వ ర్యాంకర్ శ్రీకాంత్ 21-11, 25-27, 23-21తో ప్రపంచ 32వ ర్యాంకర్ సితికోమ్ థమాసిన్ (థాయ్‌లాండ్)పై కష్టపడి గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. 65 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక మూడో గేమ్‌లో శ్రీకాంత్ రెండుసార్లు మ్యాచ్ పాయింట్లను కాచుకోవడం గమనార్హం. 19-15తో ఆధిక్యంలో నిలిచిన శ్రీకాంత్ ఒక్కసారిగా వరుసగా ఐదు పాయింట్లు చేజార్చుకోవడంతో థమాసిన్ 20-19తో విజయానికి పాయింట్ దూరంలో నిలిచాడు. అయితే శ్రీకాంత్ స్కోరును 20-20తో స్కోరును సమం చేశాడు. ఆ వెంటనే థమాసిన్ మరో పాయింట్ సాధించి 21-20తో ఆధిక్యంలోకి వచ్చాడు. కానీ శ్రీకాంత్ పట్టుదలతో ఆడి వరుసగా మూడు పాయింట్లు గెలిచి 23-21తో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సాయిప్రణీత్ (భారత్) 21-16, 18-21, 21-12తో జాన్ లూడా (చెక్ రిపబ్లిక్)పై, ప్రియాన్షు రజావత్ (భారత్) 18-21, 21-16, 21-11తో విక్టర్ స్వెండ్సన్ (డెన్మార్క్)పై, కిరణ్ జార్జి (భారత్) 21-16, 21-14తో మిథున్ మంజునాథ్ (భారత్)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. అయాటో ఎండో-యుటా టకె (జపాన్)లతో జరిగిన తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ తొలి గేమ్‌లో 9-11తో వెనుకబడిన దశలో గాయంతో వైదొలిగారు.

సింధు శుభారంభం

మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ పీవీ సింధుతోపాటు వర్ధమాన క్రీడాకారిణిలు ఆకర్షి కశ్యప్, మాళవిక, అష్మిత ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సింధు 21-10, 21-14తో జెన్‌జిరా స్టాడెల్‌మన్ (స్విట్జర్లాండ్)పై, ఆకర్షి 12-21, 21-15, 21-18తో ఆరో సీడ్ మిచెల్లి లీ (కెనడా)పై, మాళవిక 21-19, 16-21, 21-9తో కిసోనా సెల్వదురై (మలేసియా)పై, అష్మిత 21-12, 22-20తో లియోనైస్ హ్యుట్ (ఫ్రాన్స్)పై విజయం సాధించారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆరో సీడ్ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) ద్వయం 18-21, 16-21తో రెనా మియారా-అయాకో సకురమాటో (జపాన్) జోడీ చేతిలో ఓడిపోయింది.

హంపి పరాజయం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్ ప్రి టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ (జీఎం) కోనేరు హంపి తొలి పరాజయాన్ని చవిచూసింది. బుధవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో చైనాకు చెందిన మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) జు జినెర్ 36 ఎత్తుల్లో హంపిపై సంచలన విజయం సాధించింది. భారత్‌కే చెందిన వైశాలి రెండో ఓటమిని మూటగట్టుకుంది. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన గేమ్‌లో వైశాలి 40 ఎత్తుల్లో ఓడిపోయింది.

సూపర్ షకీబ్



చిట్టగాంగ్: ఐర్లాండ్ జట్టుతో రెండో టి20లో బంగ్లాదేశ్ 77 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది.. కెప్టెన్ షకీబ్ (24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38 నాటౌట్; 22 పరుగులకు 5 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శన చేశాడు. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వికెట్లు (136) తీసిన బౌలర్‌గా అవతరించాడు. 17 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 3 వికెట్లకు 202 పరుగులు చేసింది. అనంతరం ఐర్లాండ్ 17 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులు చేసి ఓడిపోయింది.

విండీస్‌దే సిరీస్



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను వెస్టిండీస్ 2-1తో గెలుచుకుంది. మూడో టి20 మ్యాచ్‌లో వెస్టిండీస్ ఏడు పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. పేస్ బౌలర్ అల్జారి జోసెఫ్ (9 బంతుల్లో 14 నాటౌట్; 40 పరుగులకు 5 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విండీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. విండీస్ ముందుగా 20 ఓవర్లలో 8 వికెట్లకు 220 పరుగులు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 213 పరుగులు చేసి ఓడిపోయింది.

మెస్సీ 'సెంచరీ'



సాంటియాగో డెల్ ఎస్టెరో (అర్జెంటీనా): విఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ తన కెరీర్‌లో మరో ఘనత సాధించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో 100 గోల్స్ చేసిన మూడో ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. కురసావ్ జట్టుతో జరిగిన అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో అర్జెంటీనా 7-0తో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మెస్సీ (20వ, 33వ, 37వ ని.లో) మూడు గోల్స్‌తో 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. గొంజాలెజ్, ఫెర్నాండెజ్, డి మారియా, దిబాలా ఒక్కో గోల్ చేశారు. ఈ మ్యాచ్‌లో మెస్సీ తొలి గోల్‌తో 'సెంచరీ' పూర్తయింది. 2006లో క్రొయేషియాతో జరిగిన మ్యాచ్‌లో తొలి గోల్ చేసిన మెస్సీ 17 ఏళ్ల తర్వాత 100 గోల్స్ మైలురాయిని దాటాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ దేశం తరఫున అత్యధిక గోల్స్ చేసిన క్రీడాకారుల జాబితాలో క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్; 122 గోల్స్), అలీ దాయ్ (ఇరాన్; 109 గోల్స్) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

'రన్'రంగం రె'ఢీ'...

- రేపటి నుంచి ఐపీఎల్ 16వ సీజన్
- 74 మ్యాచ్‌లతో వేసవి వినోదం



కరోనా నేపథ్యంలో గత మూడు సీజన్‌లు పలు ఆంక్షల మధ్య జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నీకి మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. ఈసారి ఎలాంటి ఆంక్షలు లేకుండా అభిమానులకు పూర్తిస్థాయిలో వేసవిలో పరుగుల విందు అందించడానికి ఐపీఎల్ జట్లు సిద్ధమయ్యాయి. శుక్రవారం అహ్మదాబాద్‌లో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్, నాలుగుసార్లు విజేత చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తొలి మ్యాచ్‌తో ఐపీఎల్ 16వ సీజన్‌కు తెర లేవనుంది. మొత్తం 10 జట్ల మధ్య 12 నగరాల్లో 74 మ్యాచ్‌లు జరగనున్నాయి. లీగ్ దశలో 70 మ్యాచ్‌లు ఉండగా... ప్లే ఆఫ్ దశలో నాలుగు మ్యాచ్‌లతో (క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2, ఫైనల్) టోర్నీ ముగుస్తుంది. రాజస్తాన్ రాయల్స్ జట్టు జైపూర్‌తోపాటు గువాహటిలో... పంజాబ్ కింగ్స్ జట్టు మొహాలితోపాటు ధర్మశాలలో కూడా మ్యాచ్‌లు ఆడతాయి. కరోనా కంటే ముందు ఐపీఎల్‌లో ఇంటా, బయటా పద్ధతిలో ఆయా ఫ్రాంచైజీల మధ్య మ్యాచ్‌లు జరిగేవి. కరోనా కారణంగా ఈ పద్ధతికి విరామం ఇచ్చారు. ఇప్పుడు అంతా బాగుండటంతో నిర్వాహకులు మళ్లీ పాత పద్ధతిలో ఐపీఎల్‌ను నిర్వహించనున్నారు.

ఐపీఎల్-2023 షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
మార్చి 31	గుజరాత్ x చెన్నై	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 1	పంజాబ్ x కోల్‌కతా	మొహాలి	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 1	లక్నో x ఢిల్లీ	లక్నో	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 2	హైదరాబాద్ x రాజస్తాన్	హైదరాబాద్	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 2	బెంగళూరు x ముంబై	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 3	చెన్నై x లక్నో	చెన్నై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 4	ఢిల్లీ x గుజరాత్	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 5	రాజస్తాన్ x పంజాబ్	గువాహటి	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 6	కోల్‌కతా x బెంగళూరు	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 7	లక్నో x హైదరాబాద్	లక్నో	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 8	రాజస్తాన్ x ఢిల్లీ	గువాహటి	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 8	ముంబై x చెన్నై	ముంబై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 9	గుజరాత్ x కోల్‌కతా	అహ్మదాబాద్	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 9	హైదరాబాద్ x పంజాబ్	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 10	బెంగళూరు x లక్నో	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 11	ఢిల్లీ x ముంబై	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 12	చెన్నై x రాజస్తాన్	చెన్నై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 13	పంజాబ్ x గుజరాత్	మొహాలి	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 14	కోల్‌కతా x హైదరాబాద్	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 15	బెంగళూరు x ఢిల్లీ	బెంగళూరు	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 15	లక్నో x పంజాబ్	లక్నో	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 16	ముంబై x కోల్‌కతా	ముంబై	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 16	గుజరాత్ x రాజస్తాన్	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 17	బెంగళూరు x చెన్నై	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 18	హైదరాబాద్ x ముంబై	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 19	రాజస్తాన్ x లక్నో	జైపూర్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 20	పంజాబ్ x బెంగళూరు	మొహాలి	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 20	ఢిల్లీ x కోల్‌కతా	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 21	చెన్నై x హైదరాబాద్	చెన్నై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 22	లక్నో x గుజరాత్	లక్నో	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 22	ముంబై x పంజాబ్	ముంబై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 23	బెంగళూరు x రాజస్తాన్	బెంగళూరు	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 23	కోల్‌కతా x చెన్నై	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 24	హైదరాబాద్ x ఢిల్లీ	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 25	గుజరాత్ x ముంబై	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 26	బెంగళూరు x కోల్‌కతా	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 27	రాజస్తాన్ x చెన్నై	జైపూర్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 28	పంజాబ్ x లక్నో	మొహాలి	రా.గం. 7: 30 నుంచి
ఏప్రిల్ 29	కోల్‌కతా x గుజరాత్	కోల్‌కతా	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 29	ఢిల్లీ x హైదరాబాద్	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 30	చెన్నై x పంజాబ్	చెన్నై	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 30	ముంబై x రాజస్తాన్	ముంబై	రా.గం. 7:30 నుంచి
మే 1	లక్నో x బెంగళూరు	లక్నో	రా.గం. 7:30 నుంచి
మే 2	గుజరాత్ x ఢిల్లీ	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి
మే 3	పంజాబ్ x ముంబై	మొహాలి	రా.గం. 7:30 నుంచి
మే 4	లక్నో x చెన్నై	లక్నో	మ.గం. 3:30 నుంచి
మే 4	హైదరాబాద్ x కోల్‌కతా	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి
మే 5	రాజస్తాన్ x గుజరాత్	జైపూర్	రా.గం. 7:30 నుంచి
మే 6	చెన్నై x ముంబై	చెన్నై	మ.గం. 3:30 నుంచి
మే 6	ఢిల్లీ x బెంగళూరు	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి
మే 7	గుజరాత్ x లక్నో	అహ్మదాబాద్	మ.గం. 3:30 నుంచి
మే 7	రాజస్తాన్ x హైదరాబాద్	జైపూర్	రా.గం. 7:30 నుంచి
మే 8	కోల్‌కతా x పంజాబ్	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి
మే 9	ముంబై x బెంగళూరు	ముంబై	రా.గం. 7:30 నుంచి
మే 10	చెన్నై x ఢిల్లీ	చెన్నై	రా.గం. 7:30 నుంచి
మే 11	కోల్‌కతా x రాజస్తాన్	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి
మే 12	ముంబై x గుజరాత్	ముంబై	రా.గం. 7:30 నుంచి
మే 13	హైదరాబాద్ x లక్నో	హైదరాబాద్	మ.గం. 3:30 నుంచి
మే 13	ఢిల్లీ x పంజాబ్	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి
మే 14	రాజస్తాన్ x బెంగళూరు	జైపూర్	మ.గం. 3:30 నుంచి
మే 14	చెన్నై x కోల్‌కతా	చెన్నై	రా.గం. 7:30 నుంచి
మే 15	గుజరాత్ x హైదరాబాద్	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి
మే 16	లక్నో x ముంబై	లక్నో	రా.గం. 7:30 నుంచి
మే 17	పంజాబ్ x ఢిల్లీ	ధర్మశాల	రా.గం. 7:30 నుంచి
మే 18	హైదరాబాద్ x బెంగళూరు	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి
మే 19	పంజాబ్ x రాజస్తాన్	ధర్మశాల	రా.గం. 7:30 నుంచి
మే 20	ఢిల్లీ x చెన్నై	ఢిల్లీ	మ.గం. 3:30 నుంచి
మే 20	కోల్‌కతా x లక్నో	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి
మే 21	ముంబై x హైదరాబాద్	ముంబై	మ.గం. 3:30 నుంచి
మే 21	బెంగళూరు x గుజరాత్	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి

నోట్: ప్లే ఆఫ్ (క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2) మూడు మ్యాచ్‌ల తేదీలను, వేదికలను తర్వాత ప్రకటిస్తారు. ఫైనల్ మ్యాచ్ మే 28న జరుగుతుంది. ఫైనల్ మ్యాచ్ వేదికను కూడా తర్వాత ప్రకటిస్తారు.

మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్ చానెల్స్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సినిమా



● వెంకటేశ్

క్రిస్మస్ కానుక

హీరో వెంకటేశ్ సినీ అభిమానులకు, ప్రేక్షకులకు క్రిస్మస్ కానుక ఇవ్వనున్నారు. ఆయన నటిస్తున్న 'సైంధవ్' చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా ప్రేక్షకులముందుకు తీసుకొస్తున్నారు. 'హిట్' మూవీ ఫ్రాంచైజీ ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ నటిస్తున్న చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా 'సైంధవ్' ని క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 22న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, వెంకటేశ్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఇటీవల మొదలైన ఈ లాంగ్ షెడ్యూల్‌లో వెంకటేశ్‌తో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది. నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్ర చేస్తున్న ఈ సినిమాకు సంగీతం: సంతోష్ నారాయణ్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, కెమెరా:ఎస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం.



నేనెందుకు ఇంట్లో కూర్చోవాలి?

- సమంత

'పుష్ప:ది రైజ్' చిత్రంలోని 'ఊ అంటావా మావ..' పాట ఎంత పాపులర్ అయిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అయితే ఆ ప్రత్యేక పాట ఒప్పుకోవద్దని తన సన్నిహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు వారించినా ధైర్యం చేసి ఆ పాటలో డ్యాన్స్ చేసినట్లు చెప్పారు హీరోయిన్ సమంత. గుణశేఖర్ దర్శకత్వంలో సమంత, దేవ్‌మోహన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 14న రిలీజ్ కానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ-''నా వైవాహిక జీవితానికి ముగింపు పలికిన కొన్ని రోజులకే 'ఊ అంటావా మావ..' పాట ఆఫర్ వచ్చింది. తొలుత సుకుమార్‌గారికి నో చెప్పాను. కానీ, ఆ తర్వాత ఆలోచించాను. ఏదో తప్పు చేసినట్లు నేనెందుకు ఇంట్లో కూర్చోవాలి? అనిపించి, ఓకే చెప్పాను. 'ఈ సమయంలో ఇలాంటి సాంగ్ చేయకు.. ఇంట్లో కూర్చొ' అంటూ నా శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారు. నిజానికి నా వైవాహిక జీవితంలో నేను వంద శాతం నిజాయితీగా ఉన్నాను. కానీ, ఎందుకో అది వర్కౌట్ కాలేదు. ఏదో నేరం చేసినట్లు ఎందుకు దాక్కోవాలి? చేయని నేరానికి నన్ను నేను హింసించుకుని ఎందుకు బాధపడాలి?. ప్రేమ అనేది స్త్రీ, పురుషుడి మధ్యే కాదు.. ఇద్దరు స్నేహితుల మధ్య కూడా ప్రేమానురాగాలు ఉంటాయి. అయినా ఒక బంధంలో(వివాహం) విఫలమైనంత మాత్రాన అంతా అయిపోనట్లు కాదు'' అని పేర్కొన్నారు సమంత. ఇక 2017లో పెళ్లి చేసుకున్న నాగచైతన్య-సమంతలు ఆ తర్వాత 2021లో విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే.




● రవితేజ

అక్టోబర్‌లో టైగర్

వరుస చిత్రాలతో దూసుకెళుతున్న రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ మూవీలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లు. ఈ సినిమాని దసరా సందర్భంగా అక్టోబర్ 20న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఓ లుక్‌ని విడుదల చేశారు. ''1970 నేపథ్యంలో స్టూవర్టుపురంలోని గజదొంగ టైగర్ నాగేశ్వరరావు జీవిత చరిత్ర ఆధారంగా పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో గతంలో ఎప్పుడూ చూడని సరికొత్త బాడీలాంగ్వేజ్, యాసతో రవితేజ ఆకట్టుకుంటారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

డెవిల్ యాక్షన్



● కల్యాణ్ రామ్

కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ ఫిల్మ్ 'డెవిల్: ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్'. నవీన్ మేడారం దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ప్రస్తుతం 500 మందితో క్లైమాక్స్ ఫైట్ చిత్రీకరిస్తున్నారు యూనిట్. స్టంట్ కొరియోగ్రాఫర్ వెంకట్ పర్యవేక్షణలో ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నారు. ''ఈ చిత్రంలో కల్యాణ్‌రామ్ సరికొత్త మాస్ అవతారంలో కనిపిస్తారు. 500మందితో తీస్తున్న ఈ భారీ ఫైట్ సీక్వెన్స్ సిల్వర్‌స్క్రీన్‌పై అద్భుతంగా ఉంటుంది. మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం'' అన్నారు అభిషేక్ నామా. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: సౌందర్ రాజన్.ఎస్, కథ-స్క్రీన్ ప్లే- డైలాగ్స్: శ్రీకాంత్ విస్సా.

చీకటి సామ్రాజ్యంలో...



● విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ మూవీ నిర్మిస్తున్నారు. బుధవారం (మార్చి 29) విశ్వక్ సేన్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు మేకర్స్. 'సామాజిక నిబంధనలను ధిక్కరించే ప్రపంచంలో బ్లాక్ ఉండదు, వైట్ ఉండదు, గ్రే మాత్రమే ఉంటుంది' అంటూ ఈ చిత్రం అనౌన్స్‌మెంట్ వీడియో రిలీజ్ చేశారు మేకర్స్. ''రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని చీకటి సామ్రాజ్యం నేపథ్యంలో రూపొందనున్న పీరియాడిక్ ఫిల్మ్ ఇది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: యువన్ శంకర్ రాజా, సహ నిర్మాతలు: వెంకట్, గోపి.



● అలీ, అల్లు అరవింద్, జయసుధ, చంద్రబోస్, గోపీచంద్ మలినేని

నాట్స్ ఆలోచన సంతోషాన్నిచ్చింది

- అల్లు అరవింద్

''మా నాన్న అల్లు రామలింగయ్య, ఎన్టీఆర్, ఘంటసాలగార్ల శతజయంతి ఉత్సవాలను అమెరికాలో నిర్వహించనుండటం సంతోషం. ఈ ఆలోచన చేసిన 'నాట్స్'వారికి థ్యాంక్స్'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. ప్రముఖ నటులు ఎన్టీఆర్, అల్లు రామలింగయ్య, సంగీత దర్శకుడు ఘంటసాల శతజయంతి ఉత్సవాలను మే 26, 27, 28 తేదీల్లో 'నాట్స్' (ఉత్తర అమెరికా తెలుగు సమితి) ఆధ్వర్యంలో న్యూజెర్సీలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'నాట్స్' అధ్యక్షుడు బాపు నూతి మాట్లాడుతూ-''అమెరికాలోని తెలుగువారికి కష్టం వస్తే సామాజికంగా, ఆర్థికంగా భరోసా ఇచ్చే సంస్థ 'నాట్స్'' అన్నారు. ''నటులుగా 50 సంవత్సరాలు(గోల్డెన్ జూబ్లీ) పూర్తి చేసుకుంటున్న జయసుధ, సాయికుమార్‌గార్లను, 'ఆస్కార్' అవార్డు గ్రహీత చంద్రబోస్‌లను న్యూజెర్సీలో సత్కరిస్తాం'' అన్నారు 'నాట్స్' కన్వీనర్ శ్రీధర్ అప్పసాని. ఈ వేడుకలో 'నాట్స్' డిప్యూటీ కన్వీనర్ రాజ్ అల్లాడ, నటులు సాయికుమార్, ఆది, డైరెక్టర్లు ఎ.కోదండరామి రెడ్డి, బి.గోపాల్, అవసరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీటర్ వారి అంచనాలకు తగ్గదు

- కిరణ్ అబ్బవరం



● అతుల్య, కిరణ్

''మీటర్ సినిమా పాటలు, టీజర్, ట్రైలర్ చూసిన వారంతా నాకు చాలా పెద్ద సినిమా పడిందని అంటున్నారు. ఈ సినిమా నాకు ఎందుకు ప్రత్యేకం అన్నది ఏప్రిల్ 7న తెలుస్తుంది. ప్రేక్షకుల అంచనాలకు మా సినిమా తగ్గదు'' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. రమేష్ కడూరి దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రూపొందిన చిత్రం 'మీటర్'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న రిలీజవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకలో చెర్రీ మాట్లాడుతూ-''మీటర్' మాస్ కమర్షియల్ స్టైల్‌లో ఉంటుంది. ఈ సినిమాతో కిరణ్ పెద్ద హీరో అవుతాడు'' అన్నారు. ''మీటర్' లాంటి మంచి మూవీ అవకాశం ఇచ్చిన చెర్రీగారికి, కిరణ్‌కి థ్యాంక్స్'' అన్నారు రమేష్ కడూరి.



నిజాయితీగా తీశాం

- శ్రీకాంత్ ఓదెల

''దసరా' లో నానిగారిని ఊర మాస్ క్యారెక్టర్‌లో చూపిస్తే ప్రేక్షకులకు నచ్చుతుందా? లేదా? అనే లెక్కలు వేసుకోలేదు. సినిమాని నిజాయితీగా తీశాం కాబట్టి ప్రేక్షకులు కూడా కథ కోణం నుంచే చూస్తారని భావిస్తున్నాను'' అని డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల అన్నారు. నాని, కీర్తీ సురేశ్ జంటగా రూపొందిన చిత్రం 'దసరా'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ-''సుకుమార్‌గారి 'నాన్నకు ప్రేమతో', 'రంగస్థలం' చిత్రాలకు అసిస్టెంట్‌గా పనిచేశా. నిజ జీవితంలో జరిగిన ఒక సంఘటనతో 'దసరా' కథని రాసుకున్నా. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్నా ఆ ఒత్తిడి, భయం నాకు లేదు. ఈ సినిమాలోని నానిగారి లుక్ 2020లోనే అనుకున్నాం. 'పుష్ప'లో అల్లు అర్జున్‌గారి లుక్ చూసిన తర్వాత అనుకున్నది కాదు. దసరాలో హీరోయిన్‌గా తెలుగమ్మాయి కోసం దాదాపు ఎనిమిది నెలలు వెతికినా దొరకలేదు. దీంతో కీర్తీ సురేశ్‌గారిని తీసుకున్నాం. అనుకున్నదాని కంటే బడ్జెట్ ఎక్కువ అయినా సుధాకర్‌గారు ఎక్కడా రాజీపడలేదు. సంతోష్ నారాయణ్‌గారి పాటలకు మంచి ఆదరణ లభించింది. సత్యన్ సూర్యన్‌గారు బ్రిలియంట్ కెమెరామేన్'' అన్నారు.

ఆ విషయం కూడా తెలియదా?

తెలుగు బ్లాక్ బస్టర్ మూవీ 'రౌద్రం.. రణం.. రుధిరం'('ఆర్‌ఆర్‌ఆర్') చిత్రాన్ని ప్రముఖ నటి ప్రియాంకా చోప్రా తమిళ సినిమాగా పేర్కొనడం నెట్టింట వివాదాస్పదమైంది. దీనిపై సోషల్ మీడియాలో ఆమెను ట్రోల్ చేశారు నెటిజన్లు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు ప్రియాంక. ఆ ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తి 'ఆర్‌ఆర్‌ఆర్' బాలీవుడ్ మూవీ అని చెప్పారు. ఆ తర్వాత ప్రియాంకా చోప్రా మాట్లాడుతూ-''ఆర్‌ఆర్‌ఆర్' హిందీ చిత్రం కాదు.. మెగా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన తమిళ మూవీ. మాకు 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం హాలీవుడ్ 'అవెంజర్స్'లాంటి సినిమా'' అని పేర్కొన్నారు. దీనిపై నెటిజన్లు సోషల్‌మీడియాలో ప్రియాంకని ట్రోల్ చేశారు. ''ఆర్‌ఆర్‌ఆర్' తెలుగు సినిమా అని కూడా ప్రియాంకకి తెలియదా?', 'ఆస్కార్ ప్రీ పార్టీలో 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌తో కలిసి పాల్గొన్నారామె.. అయినప్పటికీ తెలుగు సినిమా అని ఆమె తెలుసుకోకపోవడం ఆశ్చర్యకరం'.. ఇలా నెటిజన్లు ఆమెను ట్రోల్ చేశారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్' గత ఏడాది మార్చి 25న విడుదలైన విషయం తెలిసిందే.



● ప్రియాంకా చోప్రా

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
346	129
57,960	17,081

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,869	▲	153
డోజోన్స్	32,618	▲	222
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,564	▲	80
డాక్స్	15,329	▲	187
షాంఘై	3,240	▼	5
నికాయ్	27,884	▲	366

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	59,335	▲	370
బంగారం (22 క్యారట్)	59,097	▲	372
వెండి (కేజీ)	69,097	▼	403

లైఫ్‌లాంగ్ చేతికి గోమెకానిక్

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల కంపెనీ లైఫ్‌లాంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కన్సార్షియం ఆర్థిక ఒత్తిడిలో ఉన్న గోమెకానిక్‌ను కొనుగోలు చేసింది. ఆఫ్టర్ సేల్స్ సర్వీసులందించే స్టార్టప్ గోమెకానిక్‌ను కొనుగోలు చేసినట్లు లైఫ్‌లాంగ్ గ్రూప్ పేర్కొంది. డీల్ విలువను వెల్లడించలేదు. సెర్విఫై కన్సార్షియంలో మెజారిటీ వాటాదారుగా గోమెకానిక్‌ను సొంతం చేసుకున్నట్లు లైఫ్‌లాంగ్ గ్రూప్ తెలియజేసింది. 1985లో ఏర్పాటైన లైఫ్‌లాంగ్ ఆటోమోటివ్ విడిభాగాలు, సర్వీసులు, మెడికల్ డివైస్‌ల తయారీ, ఈకామర్స్ సేవలు అందిస్తోంది. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా తాజా కొనుగోలుకి తెరతీసింది.

జోస్ అలుకాస్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆర్ మాధవన్



ముంబై: ఆభరణాల విక్రయ సంస్థ జోస్ అలుకాస్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా జాతీయ నటుడు ఆర్ మాధవన్‌ను నియమించుకుంది. ఇప్పటికే ఈ బ్రాండ్‌కు ప్రముఖ నటి కీర్తి సురేశ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్నారు. దీనికి సంబంధించి ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఇరు నటులు అంగీకార పత్రంపై సంతకాలు చేశారు. దేశ సినిమా రంగంలో అత్యంత ప్రజాదరణ కలిగిన వ్యక్తులు సంస్థ ప్రకటనల్లో నటించి తమ ఉత్పత్తులను కస్టమర్లకు మరింత చేరువ చేస్తారని గ్రూప్ చైర్మన్ జోస్ అలుకాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యాపార రంగంలో నిజాయితీకి మారుపేరుగా నిలిచిన బ్రాండ్‌తో కలిసి పని చేయడం చాలా సంతోషంగా ఉందని మాధవన్ అన్నారు. ఆధునిక ప్రపంచంలో ఆభరణాల పట్ల పెరుగుతున్న మహిళల అభిరుచులను జోస్ అలుకాస్ తీర్చిందని నటి కీర్తి సురేష్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-3-2023	
విశాఖ	420-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405-00
విజయవాడ	405-00
రిటైల్ ధర (డజను)	66.00
29-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

సాధారణ యూపీఐ చెల్లింపులపై చార్జీలు ఉండవు..

ఎన్‌పీసీఐ వివరణ



న్యూఢిల్లీ: ఒక బ్యాంకు ఖాతా నుంచి మరో బ్యాంకు ఖాతాకు జరిపే సాధారణ యూపీఐ చెల్లింపులపై ఎలాంటి చార్జీలు ఉండబోవని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్పష్టం చేసింది. ప్రీపెయిడ్ పేమెంట్ సాధానాల (పీపీఐ) ద్వారా జరిపే మర్చంట్ లావాదేవీలకు మాత్రమే ఇంటర్‌చేంజ్ చార్జీలు వర్తిస్తాయని, వాటికి సంబంధించి కస్టమర్లపై చార్జీల భారం ఉండబోదని ఒక ప్రకటనలో వివరించింది. వాలెట్ల వంటి పీపీఐ సాధనాల ద్వారా రూ. 2,000కు మించి జరిపే చెల్లింపులపై 1.1 శాతం ఇంటర్‌చేంజ్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, బ్యాంకులు, ప్రీపెయిడ్ సాధనాలు, వ్యాపారవర్గాలకు మాత్రమే ఇది పరిమితం కానున్నప్పటికీ దీనితో కస్టమర్లపై చార్జీల భారం పడనుందంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో ఎన్‌పీసీఐ తాజా వివరణ ఇచ్చింది. మరోమాటలో చెప్పాలంటే ఒక కంపెనీకి చెందిన వాలెట్ గల కస్టమరు మరో కంపెనీ వాలెట్ ఉన్న వర్తకులకు చెల్లింపులు జరిపినప్పుడు ఈ చార్జీలు వర్తిస్తాయి. రెండు వాలెట్ల మధ్య లావాదేవీలకు సంబంధించిన ఇంటర్‌చేంజ్ ఖర్చులను సర్దుబాటు చేసుకోవడానికి ఈ చార్జీలు సహాయపడతాయి. ప్రస్తుతం మొబైల్ వాలెట్ పేమెంట్ మార్కెట్లో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటివి ప్రధాన సంస్థలుగా ఉన్నాయి. బ్యాంకు ఖాతా లేదా పీపీఐ/పేటీఎం వాలెట్ ద్వారా చెల్లింపులు జరిపినా ఏ కస్టమరుకూ ఎటువంటి చార్జీలు ఉండవని పేటీఎం తెలిపింది.

గూగుల్‌కు ఎన్‌సీఎల్‌ఏటీ షాక్

రూ. 1,338 కోట్ల జరిమానా కట్టాల్సిందేనని ఆదేశం



న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్ మొబైల్ పరికరాల కేసుకు సంబంధించి టెక్ దిగ్గజం గూగుల్‌కు ఎన్‌సీఎల్‌ఏటీలో ఎదురుదెబ్బ తగిలింది. రూ. 1,338 కోట్ల జరిమానా విధిస్తూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) ఇచ్చిన తీర్పును ఎన్‌సీఎల్‌ఏటీ సమర్థించింది. ఇప్పటికే చెల్లించిన 10 శాతం మొత్తాన్ని సర్దుబాటు చేసి, మిగతాది 30 రోజుల్లోగా డిపాజిట్ చేయాలని ఆదేశించింది. సీసీఐ సూచించిన చర్యలను అమలు చేసేందుకు గూగుల్‌కు 30 రోజుల వ్యవధినిచ్చింది. కేసు విచారణలో సీసీఐ సహజ న్యాయ సూత్రాలను పాటించలేదన్న గూగుల్ వాదనలను ఎన్‌సీఎల్‌ఏటీ తిరస్కరించింది. సీసీఐ తీర్పులోని పది అంశాల్లో ఆరింటిని సమర్థించిన ఎన్‌సీఎల్‌ఏటీ.. నాలుగింటిని మాత్రం తోసిపుచ్చింది. డివైజ్‌ను సెటప్ చేసేటప్పుడు యూజర్లు కోరుకున్న డిఫాల్ట్ సెర్చ్ ఇంజిన్‌ను ఎంచుకునేందుకు అనుమతించడం, టోకుగా యాప్‌లన్నింటిని ప్రీ-ఇన్‌స్టాల్ చేసుకోవాలంటూ ఫోన్ల తయారీ సంస్థలను ఒత్తిడి చేయకుండా ఉండటం తదితర అంశాలను ఎన్‌సీఎల్‌ఏటీ సమర్థించింది. ప్రీ-ఇన్‌స్టాల్ చేసిన వాటిని అన్-ఇన్‌స్టాల్ చేసేందుకు అనుమతించడం వంటి సూచనలను తోసిపుచ్చింది. యాప్‌ల ఇన్‌స్టాలేషన్ ఎంచుకోవడంలో ఫోన్ల తయారీ సంస్థలకు వెసులుబాటు ఉన్నప్పుడు .. దీని ప్రస్తావనే రాదని పేర్కొంది. ఆండ్రాయిడ్ మొబైల్ పరికరాల విషయంలో పోటీని దెబ్బతీసే విధానాలు పాటిస్తోందంటూ సీసీఐ గతేడాది అక్టోబర్ 20న గూగుల్‌కు రూ. 1,337.76 కోట్ల జరిమానా విధించింది. వివిధ అనుచిత వ్యాపార విధానాలకు దూరంగా ఉండాలంటూ ఆదేశించింది. దీన్ని సవాలు చేస్తూ ఎన్‌సీఎల్‌ఏటీని గూగుల్ ఆశ్రయించింది. సీసీఐ నిష్పాక్షికంగా విచారణ జరపలేదంటూ ఆరోపించింది. గూగుల్ అప్పీలుపై మార్చి 31 లోగా నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీం కోర్టు సూచనల మేరకు ఫిబ్రవరి 15 నుంచి ఎన్‌సీఎల్‌ఏటీ విచారణను జరుపుతోంది. ఈ నేపథ్యంలోనే చైర్‌పర్సన్ జస్టిస్ అశోక్ భూషణ్, సభ్యుడు అలోక్ శ్రీవాస్తవతో కూడిన బెంచ్ తాజా ఉత్తర్వులు జారీ చేసింది.

షార్ట్ కవరింగ్ లాభాలు

- కలిసొచ్చిన ఆఖర్లో కొనుగోళ్లు
- 17,100 చేరువలో నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 346 పాయింట్లు
- శ్రీరామ నవమి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు మార్చి సిరీస్‌కు లాభాలతో వీడ్కోలు పలికాయి. ఎఫ్అండ్ఓ డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో షార్ట్ కవరింగ్ కొనుగోళ్ల జరగడంతో బుధవారం సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులు కొలిక్కి వస్తుండంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు నెలకొన్నాయి. ఉదయం మార్కెట్ ప్రారంభమైన తర్వాత మిడ్ సెషన్ వరకు సూచీలు స్థిరంగా కదలాడాయి. ఆ తర్వాత కాస్త నెమ్మదించినా.., చివరి గంటలో కీలక రంగాల్లో కొనుగోళ్ల జోరు పెరగడంతో లాభాలు పెరిగాయి. ఉదయం సెన్సెక్స్ 41 పాయింట్ల స్వల్ప నష్టంతో 57,613 మొదలైంది. ఇంట్రాడేలో 57,524 వద్ద కనిష్టాన్ని, 58,124 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 346 పాయింట్లు ఎగసి 57,960 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25 పాయింట్లు పతనమై 16,952 వద్ద మొదలైంది. రోజంతా 16,941 – 17,126 శ్రేణిలో ట్రేడైంది. చివరికి 129 పాయింట్ల లాభంతో 17,081 వద్ద నిలిచింది. అన్ని రంగాల షేర్లకు డిమాండ్ నెలకొంది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు అధికాసక్తి చూపారు. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒకటిన్నర శాతానికి పైగా ర్యాలీ చేశాయి. ఎఫ్‌పీఐలు రూ.1,245 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.823 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు క్షీణించి 82.31 స్థాయి వద్ద స్థిరపడింది. శ్రీరామ నవమి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు కావడంతో ఎక్ఛ్సేంజీలు తిరిగి శుక్రవారం ప్రారంభమవుతాయి. సూచీలు అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో బీఎస్ఈలో రూ.3.12 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఆసియా మార్కెట్లు ఒకశాతం, యూరప్ మార్కెట్లు ఒకటిన్నర శాతం పెరిగాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి. ''ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతుందనే స్పష్టం వచ్చేంత వరకు, బ్యాంకింగ్ రంగంలో అనిశ్చితులు సంపూర్ణంగా సద్దుమణిగే దాకా ఒడిదుడుకులు తప్పవు. సాంకేతికంగా నిఫ్టీ గత 5 రోజుల్లో గరిష్ట స్థాయి వద్ద ముగిసింది. ఎగువన 17,207-17,255 శ్రేణిలో నిరోధాన్ని, దిగువ స్థాయిలో 16,985 వద్ద తక్షణ మద్దతు ఏర్పాటు చేసుకుంది'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కెన్ తన నివేదికలో నిరాధారమైన, సత్యదూరమైన ఆరోపణలు చేసిందంటూ అదానీ గ్రూప్ వివరణతో ఈ కంపెనీల షేర్లు ర్యాలీ చేశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ తొమ్మిది శాతం, అదానీ పోర్ట్స్ ఏడుశాతం లాభపడ్డాయి. అదానీ పవర్, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ షేర్లు ఐదుశాతం ఎగసి అప్పర్ సర్క్యూట్ వద్ద లాకయ్యాయి.
- ఇండస్‌ఇండ్ బ్యాంకుతో వివాదాలను పరిష్కరించుకున్నామని జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ తెలపడంతో జీ మీడియా షేరు మూడున్నర శాతం లాభపడి రూ.216 వద్ద స్థిరపడింది. ఇండస్ ఇండ్ బ్యాంక్ 2% బలపడి రూ.1,056 వద్ద నిలిచింది.
- బైబ్యాక్ ఇష్యూలో పాల్గొనేందుకు అర్హత తేదీ ముగియడంతో సింఫనీ షేరు ఆరు శాతం పతనమైన రూ.1023 వద్ద ముగిసింది.

కేజీ బేసిన్‌లో ఓఎన్‌జీసీ చమురు ఉత్పత్తి

- మే నెల నుంచి ప్రారంభించనున్నట్టు ప్రకటించిన కంపెనీ
- ఏడాది తర్వాతే గ్యాస్ ఉత్పత్తి సాధ్యం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) కృష్ణా గోదావరి బేసిన్ (కేజీ బేసిన్)లోని కేజీ డీ5 ప్రాజెక్ట్ పరిధిలో చమురు ఉత్పత్తిని ఈ ఏడాది మే నెలలో ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. సహజ వాయువు ఉత్పత్తిని ఏడాది తర్వాత ప్రారంభిస్తామని ఓఎన్‌జీసీ డైరెక్టర్ (ఉత్పత్తి విభాగం) పంకజ్ కుమార్ వెల్లడించారు. ముందుగా అనుకున్న ప్రకారం అయితే కేజీ డీ5 పరిధిలోని డీడబ్ల్యూఎన్-98/2 క్లస్టర్-2 క్షేత్రాల నుంచి గ్యాస్ ఉత్పత్తిని 2019 జూన్‌లోనే మొదలు పెట్టాలి. అదే విధంగా ఆయిల్ ఉత్పత్తిని 2020 మార్చిలో ఆరంభించాల్సి ఉంది. కానీ, ఈ లక్ష్యాలను ఓఎన్‌జీసీ చేరుకోలేకపోయింది. కరోనా మహమ్మారితో కాంట్రాక్టు, సరఫరా చైన్ సమస్యలను కారణాలుగా పేర్కొంటూ చమురు ఉత్పత్తిని 2021 నవంబర్‌కు వాయిదా వేసింది. ఆ తర్వాత 2022 మూడో త్రైమాసికానికి, ఇప్పుడు మే నెలకు వాయిదా వేసుకుంది. గ్యాస్ ఉత్పత్తిని 2021 మే నెలకు వాయిదా వేసుకోగా, అది కూడా సాధ్యపడలేదు. ఆ తర్వాత 2023 మే నెలకు వాయిదా వేయగా, ఇప్పుడు 2024 మేలోనే గ్యాస్ ఉత్పత్తి సాధ్యమవుతుందని ఓఎన్‌జీసీ చెబుతోంది.

ఫ్లోటింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం

ఇప్పటికే సముద్ర జలాల్లో ఫ్లోటింగ్ (నీటిపై తేలి ఉండే) ఉత్పత్తి యూనిట్‌ను (ఎఫ్‌పీఎస్‌వో) ఏర్పాటు చేసినట్టు ఓఎన్‌జీసీ డైరెక్టర్ పంకజ్ కుమార్ తెలిపారు. చమురు ఉత్పత్తి మే నుంచి ప్రారంభిస్తామని ప్రకటించారు. ''రోజువారీ 10,000 నుంచి 12,000 బ్యారెళ్ల చమురు ఉత్పత్తి మొదలు పెడతాం. రెండు నుంచి మూడు నెలల్లో రోజువారీ 45,000 బ్యారెళ్ల గరిష్ఠ ఉత్పత్తికి తీసుకెళతాం. చమురుతోపాటు 2 ఎంఎంఎస్‌సీఎండీ గ్యాస్ కూడా బయటకు వస్తుంది. వాస్తవంగా గ్యాస్ ఉత్పత్తిని 2024 మే నెలలో మొదలు పెడతాం. అప్పుడు రోజువారీగా 7-8 ఎంఎంఎస్‌సీఎండీ ఉత్పత్తి సాధ్యపడుతుంది''అని వివరించారు. వాస్తవంగా వేసుకున్న ఉత్పత్తి అంచనాల కంటే ఇవి తక్కువ కావడం గమనించాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చమురు ఉత్పత్తి తగ్గకుండా చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో సహజ వాయువు ఉత్పత్తి పెరుగుతుందని పంకజ్ కుమార్ తెలిపారు.

విద్య, ఉద్యోగ సమాచారం

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు

కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్).. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ప్రకటనను విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు, రక్షణ రంగ సంస్థల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు, తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉన్న బాలికలకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

» **సీట్ల రిజర్వేషన్:** ఎస్సీ అభ్యర్థులకు 15%, ఎస్టీ అభ్యర్థులకు 7.5%, ఓబీసీ అభ్యర్థులకు 27%, దివ్యాంగులకు 3% సీట్లు కేటాయించారు.

» **వయసు:** ఒకటో తరగతిలో ప్రవేశం పొందాలంటే.. మార్చి 31 నాటికి విద్యార్థి వయసు ఆరు నుంచి ఎనిమిదేళ్ల మధ్య ఉండాలి. రెండో తరగతి, మూడో తరగతిలో ప్రవేశానికి ఏడు నుంచి తొమ్మిదేళ్ల మధ్య, నాలుగో తరగతికి 8-10, అయిదో తరగతికి 9-11, ఆరుకు 10-12, ఏడుకు 11-13, ఎనిమిదికి 12-14, తొమ్మిదికి 13-15, పదికి 14-16 ఏళ్ల మధ్య ఇలా ప్రతి తరగతికి నిర్దేశించిన మేరకు వయసు ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

» **ఎంపిక విధానం:** ఎనిమిదో తరగతి వరకు ప్రవేశ పరీక్షలు ఉండవు. ప్రయారిటీ కేటగిరీ సిస్టమ్ ప్రకారం సీటు కేటాయిస్తారు. సీట్ల సంఖ్య కంటే దరఖాస్తులు ఎక్కువగా వస్తే లాటరీ సిస్టమ్ ద్వారా విద్యార్థులను ఎంపికచేస్తారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. పదకొండో తరగతి ప్రవేశాలకు సంబంధించి పదో తరగతి మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. పదో తరగతిలో సీట్లు మిగిలితే ప్రవేశాలు నిర్వహిస్తారు.

» **ఒకటో తరగతి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 27.03.2023.

» **ఒకటో తరగతి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 17.04.2023.

» **రెండో తరగతి, ఆపై తరగతులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేది(పదకొండో తరగతి మినహాయించి):** 03.04.2023

» **రెండో తరగతి, ఆపై తరగతులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేది(పదకొండో తరగతి మినహాయించి):** 12.04.2023.

» **పదకొండో తరగతి రిజిస్ట్రేషన్ తేది:** పదో తరగతి ఫలితాలు వెల్లడైన 10 రోజుల తర్వాత నుంచి.

» **వెబ్‌సైట్:** www.kvsangathan.nic.in

సీయూఈటీ(పీజీ)-2023

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు(సీయూఈటీ) నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. ఒకే పరీక్షతో అన్ని జాతీయ సంస్థల సీట్లకూ పోటీపడే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా మొత్తం 142 విద్యా సంస్థలు పీజీ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో పాటు కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తోన్న విద్యా సంస్థలు, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేటు విద్యా సంస్థలలో ప్రవేశాలు పొందవచ్చు.

» **కోర్సులు:** ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంఎఫ్ఏ, ఎంపీఏ, ఎంబీఏ, మాస్టర్ ఆఫ్ వొకేషన్, ఎంఎడ్, ఎంఎల్ఐఎస్సీ, ఎంపీఈడీ, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంకాం తదితరాలు.

» **అర్హత:** ఇప్పటికే డిగ్రీ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం ఆఖరు సంవత్సరం కోర్సుల్లో ఉన్న విద్యార్థులు సీయూఈటీ రాయవచ్చు.పలు కోర్సులకు ఏదైనా డిగ్రీ సరిపోతుంది. మిగిలిన వాటికి డిగ్రీలో సంబంధిత కోర్సు చదివినవారై ఉండాలి.

» **పరీక్ష విధానం:** పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొత్తం 100 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. రెండు షిఫ్టుల్లో పరీక్ష జరుగుతుంది. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ భాషల్లో (లాంగ్వేజ్, సాహిత్య పేపర్లు తప్ప) ఉంటాయి. ఇందులో పార్ట్-ఎ, పార్ట్-బి అనే రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-ఎ 25, పార్ట్-బిలో 75 ప్రశ్నలు వస్తాయి. పార్ట్-ఎలో జనరల్, పార్ట్-బిలో సంబంధిత సబ్జెక్టు ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు. తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.04.2023

» **వెబ్‌సైట్:** www.cuet.nta.nic.in

విశాఖపట్నం జిల్లా, అంగన్‌వాడీ కేంద్రాల్లో 47 పోస్టులు

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ విశాఖపట్నం జిల్లా, ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ వర్కర్, అంగన్‌వాడీ హెల్పర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 47

» **పోస్టుల వివరాలు:** అంగన్‌వాడీ వర్కర్-05, అంగన్‌వాడీ హెల్పర్-42.

» **ఐసీడీఎస్ ప్రాజెక్టు పేరు:** పెందుర్తి,విశాఖపట్నం, భీమునిపట్నం.

» **వయసు:** 01.07.2022 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.

» **వేతనం:** అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.11,500, మినీ అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.7000, అంగన్‌వాడీ హెల్పర్‌కు రూ.7000.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును విశాఖపట్నం జిల్లాలోని సీడీపీవో కార్యాలయం చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరి తేది:** 03.04.2023.

» **వెబ్‌సైట్:** www.visakhapatnam.ap.gov.in

ఇంటర్‌తో 'అగ్నివీర్‌వాయు'

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారికోసం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. మహిళలు కూడా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ, ఫిజికల్, మెడికల్ టెస్టుల్లో అర్హత సాధించిన వారిని ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్‌వాయుగా తీసుకుంటారు. ఈ విధంగా ఎంపికైన వారు నాలుగేళ్ల పాటు ఎయిర్‌ఫోర్స్‌లో సేవలు అందించే అవకాశం లభిస్తుంది. ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్‌వాయుకు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, ప్రయోజనాలపై ప్రత్యేక కథనం..

» ప్రకటన విడుదల చేసిన ఎయిర్‌ఫోర్స్

ఎయిర్‌ఫోర్స్‌లో సైన్స్, నాన్ సైన్స్ విభాగాల్లో అగ్నివీర్‌వాయు ఖాళీలున్నాయి. సైన్స్ విభాగంలోని పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారు నాన్ సైన్స్ ఖాళీలకు పోటీ పడవచ్చు. ఇందుకోసం వీరు ప్రత్యేక పరీక్ష రాయాలి.

సైన్స్ విభాగం

ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. లేదా నిర్దేశిత బ్రాంచీల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సు 50శాతం మార్కులతో పూర్తిచేయాలి. లేదా ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో రెండేళ్ల వొకేషనల్ కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఏ విద్యార్హతతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. టెన్త్/ఇంటర్/డిప్లొమా/ఒకేషనల్‌లో ఇంగ్లిష్‌లో 50శాతం మార్కులు పొందడం తప్పనిసరి.

నాన్ సైన్స్ విభాగం

ఏదైనా గ్రూప్‌తో ఇంటర్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా రెండేళ్ల ఒకేషనల్ కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఏ అర్హతతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ..టెన్త్/ఇంటర్/ఒకేషనల్ ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. **వయసు:** 17 1/2 నుంచి 21 ఏళ్ల లోపు ఉండాలి. డిసెంబర్ 26, 2002- జూన్ 26, 2006 మధ్య జన్మించినవారు అర్హులు. అన్ని విభాగాలకు పురుషులు 152.5 సెం.మీ. మహిళలలు 152 సెం.మీ ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం. ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు ఛాతీ వ్యత్యాసం 5 సెం.మీ ఉండాలి.

ఎంపిక ఇలా

మూడు దశల్లో నిర్వహించే అర్హత పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇందులో రాత పరీక్ష, ఫిజికల్, మెడికల్ టెస్టులుంటాయి. ఈ మూడింటిలో అర్హత సాధించిన వారినే మాత్రమే తుదిగా ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

ఫేజ్-1 రాత పరీక్ష

రాత పరీక్ష ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో ఉంటుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. సైన్స్ సబ్జెక్టులకు పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. నాన్ సైన్స్ అభ్యర్థులకు పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. ఇంగ్లిష్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. సైన్స్, నాన్ సైన్స్ రెండింటికీ దరఖాస్తు చేసుకున్నవారికి పరీక్ష సమయం 85 నిమిషాలు. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి.

అన్ని పరీక్షల్లోనూ ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. అలాగే తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. అన్ని ప్రశ్నపత్రాల్లోనూ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నలు సీబీఎస్ఈ 10+2 స్థాయి నుంచి అడుగుతారు. ఎంపిక చేసుకున్న పరీక్షను బట్టి ఇంగ్లిష్ -20, ఫిజిక్స్-25, మ్యాథ్స్-25, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు వస్తాయి.

ఫేజ్-2.. ఫిజికల్ ఫిట్‌నెస్

ఫేజ్-1లో భాగంగా నిర్వహించిన రాత పరీక్షలో ప్రతిభ చూపించిన అభ్యర్థులకు మాత్రమే ఫేజ్-2కు అవకాశం ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత సెలక్షన్ కేంద్రాలకు ప్రవేశ పత్రాలతోపాటు అవసరమైన సర్టిఫికేట్లు, వాటి జిరాక్స్ సెట్, ఫోటోలు తదితర అవసరమైన పత్రాలను తీసుకెళ్లాలి. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో భాగంగా అభ్యర్థులకు 1.6 కి.మీ దూరాన్ని పురుషులు 7, మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే పురుషులు ఒక్కోటి నిమిషం వ్యవధిలో 10 పుష్అప్స్, 10 సిట్ అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి. మహిళలు 90 సెకన్లలో 10 సిట్‌అప్స్, నిమిషంలో 15 స్క్వాట్స్ పూర్తిచేయగలగాలి. వీటిల్లో అర్హత సాధించినవారికి అడాప్టబిలిటీ టెస్టు-1 నిర్వహిస్తారు. అభ్యర్థి ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగానికి సరిపోతాడా లేదా అనేది నిర్ణయించడానికి ఆబ్జెక్టివ్ తరహాలో రాత పరీక్ష ఉంటుంది. ఇందులోనూ అర్హత సాధించిన వారికి అడాప్టబిలిటీ టెస్టు-2ను నిర్వహిస్తారు. ఈ దశలో అభ్యర్థి వాయుసేన వాతావరణానికి అలవాటు పడగలడా లేదా పరిశీలిస్తారు.

ఫేజ్-3

అడాప్టబిలిటీ టెస్టులోఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణ, నాలుగేళ్ల విధుల నిమిత్తం తీసుంటారు.



రాత పరీక్ష ప్రిపరేషన్ ఇలా

అభ్యర్థులు మ్యాథ్స్, ఫిజిక్స్ విభాగాల్లోని అంశాలను ఎంసెట్ స్థాయిలో ప్రిపేర్ అయితే మంచి ఫలితం సాధించవచ్చు. దీంతోపాటు వీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి. దీని ద్వారా నిర్దేశిత సమయంలోపు పరీక్ష పూర్తిచేయగలుగుతారు. అంతేకాకుండా ఎక్కడ తప్పులు చేస్తున్నారో తెలుస్తుంది. ఇంగ్లిష్‌కు సంబంధించి వ్యాకరణాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రీజనింగ్ విభాగంలో మాదిరి ప్రశ్నలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి ఇటీవలి కాలంలో రక్షణశాఖలో తీసుకొచ్చిన నూతన సాంకేతికత, ఈ విభాగంలో చోటుచేసుకున్న కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. వీటితోపాటు స్పోర్ట్స్, అవార్డ్స్, బుక్స్, ఎన్నికలు తదితర తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

అగ్నివీర్‌వాయు ప్రోత్సాహకాలు

అగ్నివీర్‌వాయులో ప్రవేశం పొందిన వారికి మొదటి ఏడాది ప్రతి నెల రూ.30,000, రెండో ఏడాది ప్రతి నెల రూ.33,000, మూడో ఏడాది ప్రతి నెల రూ.36,500 చెల్లిస్తారు. నాలుగో ఏడాది ప్రతి నెల రూ.40,000 చెల్లిస్తారు. వీరికి వార్షిక సెలవులు 30 ఉంటాయి. ఆరోగ్య సమస్యలను బట్టి సిక్ లీవ్‌లు కూడా ఇస్తారు. నాలుగేళ్ల సర్వీస్ కాలంలో రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్సులు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ వర్తిస్తుంది. నాలుగేళ్ల సేవలకు గాను వారు పనిచేసిన విభాగాన్ని అనుసరించి అగ్నివీర్‌వాయు సర్టిఫికేట్ అందుతుంది. వీరికి ఫించను, గ్రాట్యుటీ, కరవు భత్యం, మిలటరీ సర్వీస్ పే(ఎంఎస్‌పీ),ఎక్స్‌సర్వీస్‌మెన్ హోదా ఇవేవీ వర్తించవు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఉండదు.

సేవానిధి

ప్రతినెల అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమచేస్తారు. మొత్తం నాలుగేళ్ల కాలానికి గానూ సేవనిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని వేతనం నుంచి జమవుతాయి. అంతేమొత్తాన్ని ప్రభుత్వమూ జమచేస్తుంది. రెండు కలిపి రూ.10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని జతచేసి, అగ్నివీర్‌వాయుకు అందజేస్తారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తయి వైదొలగిన వారికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. వీరికి కార్పొరేట్ సంస్థల్లోనూ అవకాశాలు ఉంటాయి. నాలుగేళ్ల సర్వీస్‌లో మధ్యలో కావాలంటే వైదొలిగే అవకాశం కూడా ఉంటుంది. అలాంటి సందర్భంలో వేతనం నుంచి జమ అయిన మొత్తాన్ని అగ్నివీర్‌వాయుకు అందిస్తారు. కాని ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం మాత్రం దక్కదు.

ఉద్యోగంలో ఇలా

అగ్నివీర్‌వాయు స్కీంలో భాగంగా నాలుగేళ్ల సర్వీస్‌ను పూర్తిచేసుకున్న అగ్రివీర్ వాయు ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్ఠంగా 25 శాతం మందిని మాత్రమే శాశ్వత ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఇందుకోసం నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభ, సంస్థ అవసరాలు ప్రామాణికంగా తీసుకుంటారు.

పదోన్నతులు

సంబంధిత విభాగంలో విధుల్లో పనిచేసే వారు భవిష్యత్తులో ప్రమోషన్ల ద్వారా మాస్టర్ వారెంట్ ఆఫీసర్(ఎండబ్ల్యువో) స్థాయి వరకు చేరుకోవచ్చు. అంతేకాకుండా సర్వీస్‌లో కొనసాగుతూ సంబంధిత పరీక్షల్లో అర్హతలు సాధించిన వారు కమిషన్డ్ ఆఫీసర్లు కావడానికి అవకాశాలు ఉన్నాయి. అలాగే ఉద్యోగం చేస్తూనే నిర్ణీత వ్యవధిగల ఉన్నత విద్యను కొనసాగించడానికి కూడా అనుమతిస్తారు. పదవీ విరమణ వయసు వరకు ఉద్యోగం కొనసాగవచ్చు. అనంతరం ఫించను, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2023, మార్చి 31
- **ఆన్‌లైన్ పరీక్షలు:** 2023 మే 20 నుంచి
- **వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

క్లుప్తంగా...

ఏప్రిల్ 1 నుంచి కొత్త లైవ్ ట్రాకింగ్ యాప్

ఆర్టీసీ వెల్లడి

సాక్షి, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీ తమ బస్సుల కొత్త లైవ్ ట్రాకింగ్ విధానాన్ని ఏప్రిల్ 1 నుంచి అందుబాటులోకి తెస్తోంది. అందుకోసం ప్రయాణికులు ఈ కొత్త లైవ్ ట్రాకింగ్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, ఐఓఎస్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆర్టీసీ బుధవారం ఓ ప్రకటనలో కోరింది. అప్డేట్ చేయకపోతే పాత లైవ్ ట్రాకింగ్ యాప్ పని చేయదని తెలిపింది.

మరో 22 వేల ఈవీ చార్జింగ్ స్టేషన్లు

సాక్షి, అమరావతి: దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ)కు ఆదరణ పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. ఇప్పటికే దేశంలో 6,586 ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. వాటికి అదనంగా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థతో కలిసి ఇంధన సంస్థలు మరో 22 వేల చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది 7,432 చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల వెంట 400 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌ఏఐ వర్గాలు తెలిపాయి. అన్ని మోడల్ వాహనాలకు ఉపకరించేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సరికొత్త ఈవీ చార్జింగ్ స్టేషన్ నమూనాను రూపొందించగా.. కేంద్రం ఆమోదించింది. వీటిని ఏర్పాటు చేసే ఇంధన కంపెనీలకు 70 శాతం రాయితీలను అందించనుంది. ప్రస్తుతం దేశంలో ఉన్న చార్జింగ్ స్టేషన్ల కంటే.. కొత్త మోడల్ స్టేషన్ల ఏర్పాటుకు 40 శాతం తక్కువ వ్యయం అవుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. భారత్, జపాన్, కొరియన్, యూరోపియన్ తదితర ప్రాంతాల కంపెనీలు ఉత్పత్తి చేసే విద్యుత్ వాహనాలకు తక్కువ సమయంలోనే పూర్తి చార్జింగ్ చేసుకునేలా వీటిని ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల వాహనదారులకు సమయం కూడా ఆదా అవుతుంది.

'మార్గదర్శి' నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే..

- 'ఈనాడు' దళిత అంశం ఇప్పుడు అందుకే ఎత్తుకుంది
- ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి : మార్గదర్శిని అడ్డుపెట్టుకుని రామోజీరావు చేసిన అక్రమాలు ఒక్కొక్కటీ బయటపడుతున్నాయని.. ఈ విషయం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే డాక్టర్ అచ్చెన్న హత్యను 'ఈనాడు' పత్రిక వాడుకుంటోందని ఎమ్మెల్సీ, ఏపీ ఎస్సీ అండ్ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ సంక్షేమ సంఘం చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ ఆరోపించారు. సీఐడీ నోటీసులతో మార్గదర్శి అక్రమాలపై ప్రజల్లో చర్చ మొదలైందని, అందుకే ఉన్నట్టుండి దళిత వాదం అందుకున్నారని ధ్వజమెత్తారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాస్తవానికి డాక్టర్ అచ్చెన్నను సుభాష్ చంద్రబోస్ వ్యక్తిగత కక్షతోనే హత్య చేసినట్లు తేలిందని, పైగా ఘటన జరిగి దాదాపు రెండు వారాలు గడిచాక ఇప్పుడు ఎందుకు దళితులపై ప్రేమ పుట్టుకొచ్చిందని ఆయన ప్రశ్నించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో దళితులపై లెక్కలేనన్ని దాడులు జరిగాయని.. కానీ, ఏనాడూ ఈనాడు పత్రిక వాటిని ప్రచురించలేదని అరుణ్‌కుమార్ ఆరోపించారు. డాక్టర్ అచ్చెన్న కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి మృతి



సాక్షి, భీమవరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి (బెనర్జీ) (92) బుధవారం భీమవరంలో మృతి చెందారు. స్వల్ప అస్వస్థతకు గురైన నారాయణస్వామి భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఉండి మండలం ఉప్పులూరు గ్రామంలో జమీందారీ కుటుంబానికి చెందిన యర్రా సూర్యారావు, శేషాయమ్మ దంపతులకు జన్మించిన నారాయణస్వామి గ్రామ సర్పంచ్‌గా, ఉండి సహకార రూరల్ బ్యాంక్ అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. నారాయణస్వామి మృతికి రాష్ట్ర మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు.

అభివృద్ధికి బాటలు

శరవేగంగా పోర్టులు - పట్టణాల అనుసంధానం

- సాగర తీరాలతో జాతీయ రహదారుల కలయిక
- రూ.18,896 కోట్లతో 446 కి.మీ మేర 22 ప్రాజెక్టులు
- రాష్ట్ర ప్రతిపాదనలకు కేంద్రం సానుకూలత
- దీర్ఘకాలిక ప్రణాళికతో వైఎస్ జగన్ సర్కారు అడుగులు ముందుకు
- వివిధ దశల్లో ఒప్పందాలు, బిడ్లు, డీపీఆర్
- ఇప్పటికే ఉన్న ఆరు పోర్టులకు అదనంగా మరో నాలుగు
- రూ.3,520.56 కోట్లతో తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు
- కొత్త పరిశ్రమల రాక.. వేగంగా ఎగుమతులు, దిగుమతులు
- శ్రీకాకుళం- నెల్లూరు మధ్య సరికొత్త వ్యాపారాలకు బాటలు
- పదుల సంఖ్యలో నగరాలు, పట్టణాల్లో విస్తృతంగా ఉపాధి



22	పోర్ట్ కనెక్టివిటీ ప్రాజెక్టులు		
446 కి.మీ	మొత్తం దూరం		
రూ. 18,896 కోట్లు	ప్రాజెక్టుల వ్యయం		

పోర్టులు: విశాఖపట్నం, గంగవరం, కాకినాడ పోర్ట్, కాకినాడ యాంకరింగ్, కాకినాడ రవ్వ క్యాప్టివ్ పోర్టు, కృష్ణపట్నం

రానున్నవి: మచిలీపట్నం, రామాయపట్నం, భావనపాడు, కాకినాడ గేట్‌వే

ఫిషింగ్ హార్బర్లు: జువ్వలదిన్నె (నెల్లూరు), నిజాంపట్నం (బాపట్ల జిల్లా), మచిలీపట్నం (కృష్ణా జిల్లా), ఉప్పాడ (కాకినాడ జిల్లా) పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండో దశ కింద బుడగట్లపాలెం (శ్రీకాకుళం), పూడిమడక (విశాఖపట్నం), బియ్యపుతిప్ప (పశ్చిమ గోదావరి), ఓడరేవు (ప్రకాశం), కొత్తపట్నం (ప్రకాశం) హార్బర్ల పనులు త్వరలో ప్రారంభించనున్నారు.

(నాగా వెంకటరెడ్డి, సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

తీర ప్రాంతాలు, వాటి సమీపంలోని పట్టణాల శాశ్వత ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో అడుగులు ముందుకు వేస్తోంది. పూర్వపు శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న తొమ్మిది జిల్లాల పరిధిలోని 974 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని జాతీయ రహదారులతో ఎక్కడికక్కడ కొత్త మార్గాలతో అనుసంధానించాలనే ప్రతిపాదనలకు కేంద్రం సానుకూలతతో అభివృద్ధి వేగం అందుకోనుంది. తీర ప్రాంతంలో ప్రతి 50 కిలోమీటర్ల పరిధిలో పోర్టు/ఫిషింగ్ హార్బర్.. ఏదో ఒకటి ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించారు. దీనికి తోడు లాజిస్టిక్ పార్కులు, పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కులు రూపు దిద్దుకుంటున్నాయి. ఇచ్ఛాపురం నుంచి తడ వరకు చెన్నై- కోల్‌కతా, కత్తిపూడి- ఒంగోలు తదితర జాతీయ రహదారులు, రైలు మార్గాలు ఇప్పటికే ఉన్నాయి. పోర్టులు, హార్బర్లతో ఎన్‌హెచ్‌ల అనుసంధానానికి భారత్‌మాల పరియోజనలో భాగంగా నూతన రోడ్ల నిర్మాణం.. నాలుగు, ఆరు వరుసలకు విస్తరించడం ద్వారా సమీప పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందనున్నాయి. సరుకు రవాణా వేగవంతం, పరిశ్రమల ఏర్పాటు.. తద్వారా వర్తక, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఊతమిస్తాయి.

వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సానుకూలంగా వ్యవహరించాలని ఢిల్లీ పర్యటనల సమయంలో ప్రధానితో పాటు సంబంధిత శాఖల మంత్రుల వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిపాదిస్తూ వచ్చారు. ఫలితంగా నెలల వ్యవధిలోనే పోర్టుల అనుసంధానానికి నిర్ణయాలు వేగవంతమయ్యాయి.

22 పోర్టు అనుసంధాన ప్రాజెక్టులు

రాష్ట్రంలోని పోర్టులను అనుసంధానిస్తూ 22 జాతీయ రహదారుల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. రూ.18,896 కోట్ల అంచనాలతో 446 కిలోమీటర్ల మేర విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం, గంగవరం, నిజాంపట్నం, కృష్ణా రివర్ టెర్మినల్, భావనపాడు, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల నుంచి ఎన్‌హెచ్‌లను అనుసంధానిస్తూ నూతన రహదారులు నిర్మితం కానున్నాయి. రెండు మార్గాలకు సంబంధించి పురోగతిలో ఉన్న వాటిలో.. అచ్చంపేట జంక్షన్ (ఎన్‌హెచ్ -216) నుంచి కాకినాడ యాంకరేజ్ పోర్టు - వాకలపూడి లైట్ హౌస్ (ఎన్‌హెచ్-516 ఎఫ్) వరకు రూ.140.50 కోట్లతో 13.19 కి.మీ నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి కాంట్రాక్టు సంస్థ ఒప్పందం చేసుకుంది. వచ్చే ఏడాది జనవరిలోగా పనులు పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ కాంట్రాక్టు సంస్థకు సూచించింది. విశాఖపట్నం పోర్టును అనుసంధానించేలా ఈస్ట్ బ్రేక్ వాటర్ (ఎన్‌హెచ్-216) నుంచి కాన్వెంట్ జంక్షన్ (ఎన్‌హెచ్-516సి) వరకు 3.49 కి.మీలను రూ.40 కోట్లతో ఫేజ్-1 కింద నాలుగు లేన్ల రహదారి పనులను నిర్మాణ సంస్థ చేపట్టాల్సి ఉంది.

బిడ్ల పరిశీలన.. డీపీఆర్

కృష్ణపట్నం, విశాఖపట్నం, కాకినాడ పోర్టుల కనెక్టివిటీకి సంబంధించి మూడు ప్రాజెక్టుల కింద రూ.2,109.61 కోట్లతో 58.50 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి, అభివృద్ధికి సంబంధించిన బిడ్లు పరిశీలన దశలో ఉన్నాయి. ఇందులో భాగంగా సబ్బవరం నుంచి షీలానగర్ వరకు 12.50 కి.మీ మేర రూ.1,028.26 కోట్లతో ఆరు లైన్ల మార్గాన్ని భారతమాల పరియోజన కింద విశాఖ పోర్టు వరకు చేపట్టనున్నారు. విశాఖ, కృష్ణపట్నం, కృష్ణా రివర్ టెర్మినల్, నిజాంపట్నం, గంగవరం పోర్టుల కనెక్టివిటీకి సంబంధించి 148.08 కి.మీ మేర రహదారి నిర్మాణానికి రూ.8,963 కోట్లతో ఆరు ప్రాజెక్టులుగా చేపట్టడానికి డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయి. ఇందులో నెల్లూరు సిటీ నుంచి కృష్ణపట్నం, వైజాగ్ పోర్టు కంటెయినర్ టెర్మినల్ నుంచి రుషికొండ, భీమిలి మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు, గుంటూరు- నారాకోడూరు- తెనాలి- చందోలు మీదుగా నిజాంపట్నం పోర్టుకు, గంగవరం పోర్టు నుంచి తుంగలం వరకు, ఇబ్రహీంపట్నం జంక్షన్ నుంచి పవిత్ర సంగమం మీదుగా కృష్ణా రివర్ టెర్మినల్ వరకు, విశాఖ పోర్టుకు సంబంధించి ఈస్ట్ బ్రేక్ వాటర్ నుంచి కాన్వెంట్ జంక్షన్ వరకు రోడ్ల నిర్మాణ ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయి. కాగా, భావనపాడు, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల అనుసంధానానికి 106.7 కి.మీ మేర రూ.2,870 కోట్లతో ఐదు ప్రాజెక్టుల కింద రహదారుల నిర్మాణానికి డీపీఆర్‌ల తయారీకి కన్సల్టెంట్లను ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించాల్సి ఉంది.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో భరోసా

విశాఖలో ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) దేశంలోనే పారిశ్రామిక ప్రగతికి భవిష్యత్ వేదిక ఆంధ్రప్రదేశ్ అనే విశ్వసనీయతను పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల్లో కల్పించింది. రూ.13 లక్షల కోట్లకు పైగా విలువైన 386 ఒప్పందాల ద్వారా దాదాపు 20 రంగాలలో ఆరు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో విశాఖ ఉండటం, సుదీర్ఘ సముద్రతీరంతో తూర్పు ఆసియా దేశాలకు ముఖద్వారం కావడం, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, జాతీయ రహదారులు, రైలు కనెక్టివిటీ కలిగి ఉండటం ప్రగతికి సోపానాలే. తద్వారా చెన్నై-కోల్‌కతా ఎన్‌హెచ్ వెంబడి, ఈ రెండింటికి మధ్యలో విశాఖ, కాకినాడ, అమలాపురం, రాజమండ్రి, ఏలూరు, భీమవరం, నరసాపురం, విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు గూడూరు తరహా పట్టణాలు, పలు మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు శరవేగంగా అభివృద్ధి చెందనున్నాయి.

ఆక్వా అదనపు అవకాశం

కోస్తా జిల్లాల్లో 5.30 లక్షల ఎకరాల్లో సాగవుతున్న ఆక్వా రంగం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 16 లక్షల మందికి పైగా ఉపాధి లభిస్తోంది. ప్రభుత్వ సహకారంతో మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆక్వా రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు దేశీయ ఎగుమతుల్లో ప్రస్తుతం ఉన్న రాష్ట్ర వాటా ఐదు శాతం నుంచి రానున్న ఏడేళ్లలో పది శాతానికి పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా ఏపీ నుంచి వివిధ ఆహార ఉత్పత్తులు, అన్ని రంగాల వర్తక వాణిజ్యాల ముడి సరుకుల ఎగుమతులు, దిగుమతులను పెంచే ప్రణాళికతో వ్యవహరిస్తోంది.

అగ్రిమెంట్ దశలో ఐదు ప్రాజెక్టులు

ఆయా ప్రాంతాల్లోని జాతీయ రహదారులతో కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం పోర్టులను నాలుగు, ఆరు వరుసల రహదారులతో అనుసంధానించే ఐదు ప్రాజెక్టుల కాంట్రాక్టులు అవార్డు పూర్తయి అగ్రిమెంటు దశలో ఉన్నాయి. వీటిని రూ.3,745 కోట్లతో 104 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు.

- ▲ కాకినాడ పోర్టును అనుసంధానించేలా 12.25 కి.మీ మేర సామర్లకోట నుంచి అచ్చంపేట జంక్షన్ వరకు రహదారి
- ▲ కృష్ణపట్నం పోర్టును కనెక్టు చేసే చిలకర్రు క్రాస్ రోడ్డు నుంచి తూర్పు కనుపూరు మీదుగా పోర్టు దక్షిణ గేటు వరకు 36.06 కి.మీ రోడ్డు
- ▲ నాయుడుపేట నుంచి తూర్పు కనుపూరు (ఎన్‌హెచ్-71) వరకు 34.88 కి.మీ రోడ్డు
- ▲ 11 కి.మీ మేర విశాఖ పోర్టు రోడ్డు అభివృద్ధి
- ▲ కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ జంక్షన్ (ఎన్‌హెచ్-516సీ) రోడ్డు అభివృద్ధి



వ్యక్తిగత కారణాలతోనే డాక్టర్ అచ్చెన్న హత్య

- ఈ ఘటనను ప్రభుత్వంతో ముడిపెట్టడం సరికాదు
- ఏపీ ఎస్సీ అండ్ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ సంక్షేమ సంఘం



మాట్లాడుతున్న ఏపీ ఎస్సీ అండ్ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ సంక్షేమ సంఘం నేతలు

సాక్షి, అమరావతి : పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న హత్యను కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశ్యపూర్వకంగానే రాజకీయం చేస్తున్నాయని ఏపీ ఎస్సీ అండ్ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ సంక్షేమ సంఘం ధ్వజమెత్తింది. డాక్టర్ అచ్చెన్నను సహ ఉద్యోగి సుభాష్ చంద్రబోస్ వ్యక్తిగత కక్షతో హత్యచేస్తే.. ప్రభుత్వ తీరుతోనే దళితులపై దాడులు జరుగుతున్నట్లు ఆ మీడియా సంస్థలు అసత్య కథనాలు రాస్తున్నాయని మండిపడ్డారు. విజయవాడలో సంఘం ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ ఇతర ప్రతినిధులతో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడారు. పీజీ అర్హత గల పోస్టులో యూజీ అర్హత గల సుభాష్ చంద్రబోస్‌ను తీసుకోవడానికి డాక్టర్ అచ్చెన్న అంగీకరించలేదని, అతన్ని డిపార్టుమెంట్‌కు సరెండర్ చేయడంతో పగ పెంచుకున్న సుభాష్ తన అనుచరులతో కలిసి దారుణానికి పాల్పడ్డాడన్నారు. ఈ వ్యక్తిగత దాడిని కావాలనే కొన్ని పత్రికలు, మీడియా సంస్థలు రాజకీయ రంగు పులుముతున్నాయని, ఈ ఘటనను దళితులపై దాడిగా చిత్రీకరిస్తూ, ప్రభుత్వంతో ముడిపెడుతున్నాయని విమర్శించారు. వాస్తవానికి డాక్టర్ అచ్చెన్న హత్య జరిగి 14 రోజులు దాటిందని, హతుని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకుని కారకులను అరెస్టు చేశారని వివరించారు. అయితే, ఇన్నిరోజులుగా పట్టించుకోని మీడియా సంస్థలు దళితులపై దాడిగా చిత్రించడంలో గల ఆంతర్యం ఏమిటో తమకు తెలీడం లేదన్నారు. తాము ఆయన కుటుంబానికి అండగా ఉంటామని సునీల్‌కుమార్ తెలిపారు.

డాక్టర్ అచ్చెన్న హత్యోదంతంలో రాజకీయం తగదు

- బాబు నీచ రాజకీయం
- ఎంపీ నందిగం సురేష్ స్పష్టీకరణ


సాక్షి, అమరావతి : పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న హత్యకు పూర్తిగా వ్యక్తిగత గొడవలే కారణమని, దాన్ని చంద్రబాబు రాజకీయం చేయటం తగదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ నందిగం సురేష్ హితవు పలికారు. ఆయన మరణం చాలా బాధాకరమని, తమను ఆ ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. దోషుల్ని వెంటనే అరెస్టుచేసినప్పటికీ దానిని ఎల్లో మీడియా దారుణంగా వక్రీకరిస్తోందని ఆక్షేపించారు. డ్యూటీ విషయంలో సుభాష్‌చంద్రబోస్ అనే వ్యక్తితో మొదలైన వారి గొడవ చివరకు చంపుకునే స్థాయికి దారి తీయటం విచారకరం అని తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం సురేష్ మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సీఎం జగన్ కొండంత అండగా ఉంటున్నారన్నారు. బాబుకు, ఎల్లో మీడియాకు దళితులపై మాట్లాడే హక్కులేదని.. ఎస్సీలను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం చంద్రబాబు, ఎల్లోమీడియా మానుకోవాలన్నారు. చంద్రబాబు ఎస్సీలు, బీసీలపై చేసిన వ్యాఖ్యలు ఎవరూ మర్చిపోలేదన్నారు.

వచ్చేనెల 6న అసైన్డ్ భూముల కమిటీ తుది సమావేశం

- అసైన్డ్ భూములపై హక్కులు కల్పించే విషయంపై అధ్యయనం
- ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న కమిటీ
- వాటి ఆధారంగా తుది నిర్ణయం తీసుకునే అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అసైన్డ్ భూములపై అర్హులకు హక్కులు కల్పించే విషయంపై ఏర్పాటైన ప్రజాప్రతినిధుల కమిటీ వచ్చేనెల 6వ తేదీన చివరిసారి సమావేశం కానుంది. రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సహా ఐదుగురు మంత్రులు, తొమ్మిదిమంది ఎమ్మెల్యేలతో కూడిన ఈ కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశమై ఈ అంశంపై అధ్యయనం చేసింది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ అసైన్డ్ భూములపై అర్హులకు హక్కులు కల్పించినతీరు, అందుకు అనుసరించిన విధానం, పర్యవసానాలు తదితర అంశాలపై ఆయా రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చించింది. ప్రభుత్వం గతంలో తమకు కేటాయించిన భూములను (అసైన్డ్ భూములు) అమ్ముకునేందుకు హక్కు కల్పించాలని పలు జిల్లాల్లో రైతులు కలెక్టర్లు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ప్రభుత్వానికి దీనిపై పెద్దఎత్తున వినతులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసైన్డ్ భూములపై ఒక నిర్ణయం తీసుకుని అర్హులైన రైతులకు మేలుచేయాలని ప్రభుత్వం భావించింది. ఈ అంశంపై అధ్యయనం చేసి అర్హులైన రైతులకు ఎలా న్యాయం చేయాలనే దానిపై నివేదిక ఇవ్వాలని రెవెన్యూ మంత్రి నేతృత్వంలో ప్రజాప్రతినిధుల కమిటీని నియమించింది. ఈ కమిటీ అసైన్డ్ భూముల చరిత్ర, హక్కులు కల్పించేందుకు ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు గతంలోనే అసైన్డ్ భూములపై రైతులకు హక్కులు కల్పించిన నేపథ్యంలో వాటిపైనా పూర్తివివరాలు సేకరించింది. దీనిపై ఇప్పటికే ఒక అభిప్రాయానికి వచ్చిన కమిటీ 6వ తేదీన జరిగే తుది సమావేశంలో ప్రభుత్వానికి చేయాల్సిన సిఫారసులను ఖరారుచేసే అవకాశం ఉంది. తమకు కేటాయించిన భూములను అనుభవించడం మినహా పేదలకు వాటిని అమ్ముకునే హక్కులు లేవు. 1954కి ముందు కేటాయించిన భూములను మాత్రమే అమ్ముకునేందుకు హక్కు ఉంది. దీంతో ఆ తర్వాత ప్రభుత్వం నుంచి భూములు పొందిన లక్షలాదిమంది రైతులు వాటిల్లో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వాటిని అమ్ముకోవడానికి, వాటిపై బ్యాంకు రుణాలు తీసుకోవడానికి అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో ఆ భూములపై తమకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని ఎంతోకాలం నుంచి అసైన్డ్ రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వాలు ఈ విషయంపై కమిటీలు వేసినా నిర్ణయం మాత్రం తీసుకోలేదు. విస్తృత ప్రజా ప్రయోజనాలు, రైతుల మేలుకోసం తాజాగా వైఎస్ జగన్ ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నివేదికను బట్టి అసైన్డ్ రైతులకు వారి భూములపై హక్కులు కల్పించే విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

పది పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి: మంత్రి బొత్స



విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. 10వ తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి బుధవారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు, విద్యాశాఖ, వైద్యశాఖ, పోస్టల్, ఆర్టీసీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు సుమారు 6.15 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షల నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, గత సంవత్సరం పరీక్షల నిర్వహణలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలని, కరెంటు నిరంతర సరఫరా చేయాలని సూచించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు అవసరమైన బస్సులు నడపాలని, విద్యార్థుల హాల్‌టికెట్‌ను బస్సు పాస్‌గా పరిగణించి ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్ జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యాశాఖ, పోలీసు, వైద్యశాఖ, పోస్టల్ శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

కుల కుంపట్లకు రామోజీ కుట్ర

మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: కులాల మధ్య చిచ్చు రగల్చడం, చంద్రబాబును అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ఈనాడు రామోజీరావు కుట్రలు చేస్తున్నారని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. దళితుల మధ్య విబేధాలు సృష్టించి వైఎస్సార్‌సీపీకి దూరం చేసే ఎత్తుగడతో అనునిత్యం విషపు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబుకు ఈనాడు ఒక కరపత్రంలా మారిందన్న విషయాన్ని ప్రజలు ఎప్పుడో గుర్తించారన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు హయాంలో దళితులపై గరగపర్రు నుంచి జెర్రిపోతులపాలెం వరకు జరిగిన ఘటనలు గుర్తు లేవా? చందూరు, కారంచేడు ఘటనలకు బాధ్యులు ఎవరో అందరికీ తెలుసు. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని హేళనగా మాట్లాడిన చంద్రబాబు కనీసం క్షమాపణ కూడా కోరలేదు. ఎస్సీలపై చంద్రబాబు హయాంలో దాడులకు సంబంధించి ఏటా సగటున 2,103, ఎస్టీలపై దాడులకు సంబంధించి ఏటా సగటున 365 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ ఎన్‌సీబీ రికార్డుల్లో ఉన్నాయి. వీటికి సంబంధించి టీడీపీ హయాంలో 2014 - 2019 మధ్య రూ.52.32 కోట్ల పరిహారం ఇవ్వగా వైఎస్సార్ సీపీ వచ్చాక మూడేళ్లలోనే రూ.125 కోట్ల పరిహారం అందచేశాం' అని చెప్పారు.

రాజ్యసభ | ఏపీ ఇన్ పార్లమెంట్

ఓబీసీ వర్గీకరణ కమిషన్ గడువు పొడిగింపు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: వెనుకబడిన కులాల (ఓబీసీల) వర్గీకరణ కోసం నియమించిన రోహిణి కమిషన్ కాలపరిమితిని ఈ ఏడాది జూలై 31 వరకు పొడిగించినట్లు కేంద్ర సామాజికన్యాయం, సాధికారతశాఖ మంత్రి వీరేంద్రకుమార్ చెప్పారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. కోవిడ్ మహమ్మారి ప్రభావంతో దేశవ్యాప్త ఆంక్షల కారణంగా కమిషన్ గడువులోగా పని పూర్తిచేయలేకపోవడంతో ప్రభుత్వం కాలపరిమితిని పొడిగించిందని తెలిపారు. కమిషన్ పదవీకాలాన్ని ఇప్పటివరకు 14 సార్లు పొడిగించినట్లు చెప్పారు. ప్రస్తుతం కేంద్రం వద్దనున్న ఓబీసీ జాబితాలో వర్గీకరణకు సంబంధించి నెలకొన్న సందిగ్ధతను నివృత్తి చేసుకుని జాబితాను పూర్తిస్థాయిలో ఖరారు చేసేందుకు కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో కలిసి పనిచేస్తోందని తెలిపారు.

ఏపీలో ఉన్నత విద్యపై సర్వే

ఆంధ్రప్రదేశ్ సహా అన్ని రాష్ట్రాల్లో ఉన్నత విద్యాసంస్థల నుంచి ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ డాటాను సేకరిస్తోందని, 2022లో 11వ సర్వే నిర్వహించిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్‌నత్వానీ ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. 2014-15 కంటే 2020-21లో బాలికల ఎన్‌రోల్‌మెంట్ 12.5 శాతం పెరిగిందని చెప్పారు.

ఏపీలో 13 మంది ఉరిశిక్ష ఖైదీలు

ఆంధ్రప్రదేశ్‌లో 2021 డిసెంబరు 31 నాటికి ఉరిశిక్ష పడిన ఖైదీలు 13 మంది ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్‌కుమార్ మిశ్రా.. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు. ఏపీలో ఐదుగురు ఖైదీలకు ఉరిశిక్షను జీవితకాల ఖైదుగా మార్చారని తెలిపారు.

లోక్‌సభ | ఇటార్సి-విజయవాడ కారిడార్‌పై సర్వే

ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే నార్త్-సౌత్ సబ్ కారిడార్ (ఇటార్సి నుంచి విజయవాడ), ఈస్ట్‌కోస్ట్ కారిడార్ (ఖరగ్‌పూర్-విజయవాడ)కు సంబంధించిన సర్వే/డీపీఆర్‌ను డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా సిద్ధం చేస్తున్నామని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

పీఎం మిత్ర ప్రతిపాదన వచ్చింది

ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాలో పీఎం మిత్ర పార్కు ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వచ్చిందని కేంద్ర జౌళిశాఖ సహాయమంత్రి దర్శన జర్దోష్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ సంజీవకుమార్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో టెక్స్‌టైల్స్, హ్యాండ్‌లూమ్స్‌కు భారీ అవకాశాలు

ఆంధ్రప్రదేశ్‌లో టెక్స్‌టైల్స్, హ్యాండ్‌లూమ్స్‌కు భారీ అవకాశాలున్నాయని కేంద్ర జౌళిశాఖ సహాయమంత్రి దర్శన జర్దోష్ తెలిపారు. రాష్ట్రంలో 10,475 యూనిట్ల ద్వారా 35,176 పవర్‌లూమ్స్ ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీలు వంగా గీతావిశ్వనాథ్, ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

26,127 మొబైల్ టవర్లు

ఆంధ్రప్రదేశ్‌లో 26,127 మొబైల్ టవర్లున్నాయని కేంద్ర కమ్యూనికేషన్లశాఖ సహాయమంత్రి దేవుసిన్హ్ చౌహాన్ తెలిపారు. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ పథకం ద్వారా రూరల్, రిమోట్, గిరిజన, వామపక్ష తీవ్రవాద ప్రభావ ప్రాంతాల్లో మౌలికసదుపాయాలు పెంచడానికి నిధులు కేటాయిస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఎన్.రెడ్డెప్ప, గొడ్డేటి మాధవి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

తెలంగాణ

'బ్రహ్మయ్య అండ్ కో'లో తనిఖీలపై స్టేటస్ కో

సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి : హైదరాబాద్‌లోని బ్రహ్మయ్య అండ్ కంపెనీలో తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు తనిఖీలు, డాక్యుమెంట్లపై స్టేటస్‌కో (యథాతథ స్థితి) విధిస్తూ తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో అక్రమ వ్యవహారాలపై విచారిస్తున్న ఏపీ సీఐడీ.. దర్యాప్తులో భాగంగా ఆ సంస్థకు చార్టెడ్ అకౌంటెంట్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మయ్య అండ్ కంపెనీలో బుధవారం సోదాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో తమ సంస్థలో తనిఖీలు చేపట్టడం ద్వారా తమ ఉద్యోగులు, భాగస్వాములను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆ సంస్థ తరఫున పెద్ది చంద్రమౌళి హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. తొలుత సీజే ధర్మాసనం ముందు పిటిషన్ దాఖలు కాగా, ఆయన మరో బెంచ్‌కు బదిలీ చేశారు. దీంతో రాత్రి 7 గంటలకు జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఏపీ సర్కార్ తరఫున స్పెషల్ కౌన్సిల్ పి.గోవింద్‌రెడ్డి వాదిస్తూ.. 1973 సీఆర్‌పీసీ సెక్షన్ 165, 166 కింద లోకల్ మేజిస్ట్రేట్ అనుమతి తీసుకుని తనిఖీ ప్రక్రియ నిర్వహించామని చెప్పారు. ఇప్పటికే తనిఖీ ప్రక్రియ ముగిసిందని, సేకరించిన డాక్యుమెంట్లు, ఇతర సామగ్రి నాంపల్లి మేజిస్ట్రేట్ ముందు ఉంచామని తెలిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది నళిన్‌కుమార్ వాదనలు వినిపించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను 31వ తేదీకి వాయిదా వేశారు. ఆ రోజు మొదటి కేసుగా విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943